1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 5
పుటలు : 52
రు. 25 లు

ISSN NO : 2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in




- ★ తెలుగులో ఇంజనీరింగ్ విద్య – మౌలిక సమస్యలు
- ★ భారతీయ భాషల మధ్య యంత్రానువాద వ్యవస్థ
- ★ జర్మన్‌ల పరిశోధన దృష్టి – సామాజిక భాషావసరాలు
- ★ దారి మరిచిన గురువులను దారికి తేవడం ఎలా
- ★ విద్యార్థుల్లో భాషా సమస్య ఒక కృష్ణబిలం
- ★ వార్తాపత్రికల్లో భాషా పరిణామం
- ★ కథలు చదవని మనుషులు
- ★ 'కొట్టడం' మానవ సంస్కృతిలో భాగమేనా!
- ★ ప్రజాస్వామ్యంతో పరాచికాలు
- ★ హోసూరు నవల ★ కళాకారుడి ఆత్మకథ

భారతీయ భాషలపట్ల కేంద్రప్రభుత్వ విధానాన్ని ప్రకటించాలి

# తాపీ ధర్మారావు పురస్కారం- 2020

## హైదరాబాదు- 18 సెప్టెంబరు 2021 ఉ॥ 10.30గం



తాపీ ధర్మారావు గారి చిత్రపటానికి
పూలమాల, జ్యోతి ప్రజ్వలన



సభాధ్యక్షుడు ఆచార్య జయధీర్ తిరుమలరావు తొలిపలుకులు



ముఖ్య అతిథి
ఆచార్య డి.రవీందర్ యాదవ్ ప్రసంగం



విశిష్ట అతిథి
జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు ప్రసంగం



డాక్టర్ ఎ.కె.ప్రభాకర్
పరిచయ ప్రసంగం



యల్లపు ముకుంద రామారావు గారికి పురస్కార ప్రదాన దృశ్యం



మన్నన పత్రాన్ని చదువుతున్న రచయిత్రి
కన్నెగంటి అనసూయ



ఆత్మీయ అతిథి
ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు ప్రసంగం



ఆత్మీయ అతిథి
శ్రీ పి.పూర్ణచంద్రరావు ప్రసంగం



సమావేశ కర్త
డాక్టర్ సామల రమేష్‌బాబు కైమోడ్పులు



సభలో పాల్గొన్న పెద్దలలో కొందరు

వార్త వివరాలు : 18–23 పుటలలో

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




అక్టోబరు 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని ఆ సంచికకు పరిశీలించడం వీలుకాదు. గమనించండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | భారతీయ భాషలపట్ల కేంద్రప్రభుత్వ విధానాన్ని.... | | 05 |
| అమ్మనుడిలో సాంకేతికవిద్య: | ఇక తెలుగులో ఇంజనీరింగ్ విద్య | రహ్మానుద్దీన్ షేక్ | 07 |
| పరిశోధన: | యంత్రానువాద వ్యవస్థ... | గారపాటి ఉమామహేశ్వరరావు | 09 |
| జర్మనీ లేఖ: | జర్మన్ల పరిశోధనా దృష్టి.... | శ్రీగణేష్ తొట్టెంపూడి | 12 |
| భాషామాధ్యమం: | విద్యార్థుల్లో భాషాసమస్య ఒక కృష్ణబిలం | జె.డి.ప్రభాకర్ | 14 |
| తాపీ మన్నన: | 'తాపీ ధర్మారావు పురస్కార' ప్రదాన సభ | రజాహుస్సేన్ | 18 |
| మన చదువులు: | కథలు చదవని మనుషులు | సి.వి.క్రిష్ణయ్య | 24 |
| వారసత్వ సంపద: | దారి మరచిన గురువులు.. | డా॥పి.శివరామకృష్ణ'శక్తి' | 26 |
| పత్రికలు–భాష: | వార్తా పత్రికలలో భాషా.... | బి. లలితానంద ప్రసాద్ | 28 |
| మాటల నిర్మాణం: | పదనిష్పాదనకళ | వాచస్పతి | 33 |
| సంస్కృతి : | 'కొట్టడం' మానవ సంస్కృతిలో.... | జె.యు.బి.వి ప్రసాద్ | 39 |
| సాహిత్యరంగం: | ప్రజాస్వామ్యంతో పరాచికాలు | మధురాంతకం నరేంద్ర | 42 |
| గిడుగు స్ఫూర్తితో: | 18 ఏళ్లుగా తెలుగుభాషా,సాంస్కృతిక.. | బద్రి కూర్మారావు | 49 |
| నవల: | మా ఊరు | అగరం వసంత్ | 44 |
| ఆత్మకథ: | కొయ్యబొమ్మ..చంద్రప్పసోబటి/రంగనాథరామచంద్రరావు | | 47 |
| ధారావాహిక: | అడుగుజాడలూ ఆనవాళ్లు-11 | ఈమని శివనాగిరెడ్డి | 36 |
| కవితలు: | బట్టలుతికే ఓ సాకలక్క..... | కొండల్ పులి | 41 |



| కార్టూన్లు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|
| సరసి, వంగల శేఖర్ | అనుమల్ల గంగాధర్ | బండారు రఘురాం |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
నుడి నాడు నెనరు మాసపత్రిక

### చందా వివరాలు

| | | |
|---|---|---|
| జీవిత చందా | : | రూ.5000 |
| 4 సం॥ చందా | : | రూ.1000 |
| 1 సం॥ చందా | : | రూ. 300 |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

### బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

### ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ

సంపుటి : 7 సంచిక : 5
అమ్మనుడి
అక్టోబరు 2021

సంపాదకీయం

# భారతీయ భాషలపట్ల కేంద్రప్రభుత్వ విధానాన్ని ప్రకటించాలి

**భా**రతీయ భాషలపట్ల శ్రద్ధ వహించకపోవడం వల్ల గత 50 ఏళ్లల్లో 220 భాషలను కోల్పోయామని కేంద్ర విద్యాశాఖ మంత్రి వారం రోజుల క్రితం ఒక జాతీయ సదస్సులో వెల్లడి చేశారు. మాట్లాడేవాళ్లు ఒక్కరైనా లేకపోవడంతో ఆయా భాషలు నశించిపోయినట్లయిందని చెప్తూ ఆమె రెండు కీలకమైన అంశాలను చెప్పారు. ఒకటి– ఇకపై భారతీయ భాషలకు ఈ గతి పట్టకుండా ఉండాలంటే పాఠశాల, కళాశాల స్థాయి చదువుల్లో వాటిని బోధించడం, నేర్పించడం జరగాలి. రెండు– దేశ ఐక్యతకు, సమగ్రతకు, భారతీయ భాషలను కాపాడుతూ, అభివృద్ధిపరచాలి.

సాక్షాత్తు కేంద్ర విద్యాశాఖ మంత్రిగారే బహిరంగంగా అన్న మాటలు గనుక, కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అవి ప్రతిఫలిస్తున్నాయని అనుకొందాం. కేంద్ర ప్రభుత్వం కొత్త జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించి, దాని అమలుకై ముందుకు సాగుతున్న సమయంలో దానిలో భాగంగా, విద్యారంగంలో భారతీయ మాతృభాషల గురించి సందర్భవశాత్తు ప్రస్తావించారు. అంతేగాని, భారతీయ భాషల – కనీసం రాజ్యాంగంలో పేర్కొన్న 22 భాషల ప్రతిపత్తి, చట్ట నిర్మాణంలోనూ, సాధారణ పాలన, న్యాయస్థానాలు, ఇతర అన్ని రంగాల్లోనూ ఆ భాషల వినియోగం పై సమగ్రమైన విధాన ప్రకటన చేయడానికి ప్రభుత్వం ఎందుకో చొరవ తీసుకోవడం లేదు. స్వతంత్ర భారత దేశంలో ఏ కేంద్రప్రభుత్వమూ ఇంతవరకూ ఈ దిశగా సరైన ప్రయత్నం చేయలేదనేది వాస్తవం.

విద్యావిధానంలో భాగంగా భాషల గురించి ప్రస్తావించడం సంగతి సరే. బహు భాషలున్న ఈ దేశంలో రాజ్యాంగ నిర్మాణ సమయం నుండి ఇప్పటివరకూ ఒక ఏకాభిప్రాయానికి పాలక వర్గాలు రాలేకపోయాయి. భాషాజాతుల గురించీ, వాటి పరస్పర సహజీవనం, పాలనా బోధనా రంగాల్లో వాటి రక్షణ గురించీ స్పష్టత లేనంతవరకూ భారతీయ భాషల రక్షణకు పూచీ లభించదు. దేశ ఐక్యతకూ సమగ్రతకూ భారతీయ భాషల రక్షణ కీలకమనీ, ఇదే ప్రజాస్వామ్య హక్కుల రక్షణకు హామీ అనీ గ్రహించాలి.

భాషారాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం ప్రజల భాషల రక్షణే. ఆ విధంగా అది ప్రజాస్వామ్య రక్షణే. అందువల్లే జాతీయ భాష ఏదో స్పష్టంగా రాజ్యాంగ నిర్మాణ సభ తేల్చలేక పోయిందని 15 ఏళ్ల వ్యవధిని నిర్ణయించి అప్పటికప్పుడు చేతులు దులుపుకున్నారన్నది కూడా మనం మరచిపోకూడదు. అదే పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతున్నది. ఈలోపు తమ భాష గురించి గట్టిగా మాట్లాడే తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాల ప్రభుత్వాలు భాషను ప్రధాన రాజకీయాస్త్రంగా చేసుకోగలిగాయి. కేంద్ర పాలకుల ప్రత్యక్ష, పరోక్ష అండతో హిందీ నిలదొక్కుకొని, హిందీయేతర ప్రజల జీవితాల్లోకి చాపక్రింద నీరులా విస్తరిస్తూనే ఉంది. ఈ విషయంలో అసమర్థ, స్వార్థ పాలక వర్గాల పుణ్యమా అని తెలుగు రాష్ట్రాలు భాషాపరంగా అణగారి పోతూనే ఉన్నాయి.

చదువుల విషయంలో మాతృభాషలను రక్షించలేని రాజ్యాంగాన్ని మనం మోస్తున్నాం. రాజ్యాంగ రక్షణకే కట్టుబడిన ఉన్నత న్యాయస్థానాలు ఏమీ మాట్లాడలేకపోతున్నాయి. ఈ పరిస్థితులు దేశాన్ని బలహీన పరుస్తున్నాయి. దేశ సమైక్యత బలహీనమవుతున్నది. విద్యారంగంతో పాటు పాలన, తదితర అన్ని రంగాల్లోనూ

# సంపాదక హృదయం

భాషా విధానమేమిటో  కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకోవడానికి స్పష్టమైన కార్య ప్రణాళికను చేపట్టాలి.

ఇరవై ఏళ్ల క్రితం తమిళనాడు పాలక పార్టీలు తమిళానికి ప్రాచీన భాషహోదా కావాలనే అశాస్త్రీయ డిమాండ్‌ను ముందుకు తెచ్చి అన్ని స్థాయిల్లో ఉద్యమాన్ని ప్రారంభించి, 2004 నాటికి దాన్ని ఒక ఎన్నికల అంశంగా చేశాయి. నాటి యు.పి.ఏ. కూటమి కేంద్రంలో ప్రభుత్వంలోకి రావడం కోసం డి.ఎం.కె.ను భాగస్వామిగా చేర్చుకొని, ఆ పార్టీ నిర్దేశించిన ప్రకారం వారికి ఆ హోదాను కట్టబెట్టే రాజకీయ నిర్ణయం తీసుకొంది. 'రాయి పుట్టి మన్ను పుట్టకముందే పుట్టిన ప్రాచీన భాష తమిళ్' (కల్ తోన్హా మణ్ తోన్హా కాలమ్ మున్ తోన్టియతు తమిళ్ మొళి) అంటూ ఆ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదన పత్రంలో కూడా (సందర్భం కాకపోయినా) ప్రకటించుకొనే ఆసంబద్ధ ధోరణికి వెన్నుకాసింది. దానిపై తెలుగు, కన్నడ, మలయాళ తదితర భాషల వారు కూడా ప్రాచీన భాష హోదాకై ఉద్యమించడంతో అడిగిన వారికి కాదనకుండా ఆ హోదానిచ్చేసింది కేంద్ర ప్రభుత్వం. వివరంగా ఆ చర్చ ఇక్కడ ఇప్పుడు అక్కర్లేదు కానీ ఎప్పటికప్పుడు సంతృప్తి పరుస్తూ కాలం గడుపుకువచ్చే ధోరణిని అనుసరించిన రాజకీయాల ఫలితంగానే కాంగ్రెస్, మిత్రపక్షాలు సాధారణ ఎన్నికల్లో ఓడిపోయి, భాజపా ప్రభుత్వం వచ్చిందన్న సంగతిని గమనించాలి.

మరి ఇప్పుడు భాజపా చేస్తున్నదేమిటి? ఇప్పటికి ఏడేండ్లు గడిచిపోయాయి. జాతీయ సమైక్యతకూ, సమగ్రతకు భారతీయ భాషల రక్షణకు ఉన్న సంబంధాన్ని ఇప్పుడు కేంద్ర మంత్రిణి ప్రస్తావించడం సంగతే కాదు. భాజపా వారెక్కడ, ఎప్పుడు మాట్లాడినా దేశం గురించి, దేశ సమైక్యత గురించీ సమగ్రత గురించీ మాట్లాడుతూనే ఉంటారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుండీ కాంగ్రెస్ వంటి పార్టీలు ఇలాగే మాట్లాడేవారు. కాని తమ పాలనలో ఆ విలువల్ని పాతరేశారు. ఇప్పుడు భాజపా కూడా - కనీసం విద్య, భాషారంగాల్లో ఇలాగే ప్రవర్తిస్తున్నది. దీనికి వారు దేశానికి సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది.

దేశ సమగ్రతకూ, రక్షణకూ ఆటంకంగా పరిణమించిన కాశ్మీర్ సమస్యను పరిష్కరించడంలో భాజపా ప్రభుత్వం ధైర్యంగా, దృఢంగా ముందడుగు వేసింది. దేశ సరిహద్దుల రక్షణలో దూరదృష్టితో చర్యలు తీసుకుంటోంది. కాందిశీకుల పౌరసత్వ అంశం, ఇంకా మరికొన్ని అంశాల్లోనూ చొరవతో వ్యవహరిస్తోంది. మరి, పలు భాషాజాతుల సమైక్య నిర్మాణంగా ఉన్న ఈ దేశ అంతరంగిక సమైక్యతను కాపాడుకోవడంలో అత్యంత క్లిష్టమైన భాషా సమస్యను పరిష్కరించడంలో చొరవ తీసుకోవలసిన బాధ్యతను ఎందుకు విస్మరిస్తున్నారు? ఈ విషయంలో  ప్రభుత్వ ఆలోచనలపై సందేహాలు ప్రజల్లో చోటు చేసుకొంటున్నాయన్న సంగతిని వారు గుర్తించాలి. కంప్యూటర్ల వికాసం, డిజిటలైజేషన్ వంటి అత్యాధునిక సాంకేతిక వికాసాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వ విధాన నిర్మాతలు భాషల వినియోగం గురించి ఆలోచించాలి. ఒకే భాషాపెత్తనం క్రిందకు వస్తేనే జాతీయత ఉంటుందనే ఆత్మవినాశక ఆలోచనలకు స్వస్తి పలకాలి. అన్ని భాషల్నీ గౌరవించి, ఆదరించాలి. భాషల్ని సంస్కృతీకరించడం ద్వారా దేశంలోని భాషల మధ్య ఏక సూత్రతనూ ఆ విధంగా జాతీయ భాషగా హిందీని పెంచిపోషించాలనే అవివేకపు ధోరణినీ కట్టిపెట్టి, దేశ ప్రజల మధ్య అన్ని విధాలుగా ఆంతరంగిక ఐక్యతను సాధించే దిశగా ముందడుగు వేయాలి. ఇందువల్ల ఎన్‌డిఏ మరికొన్నాళ్లు ప్రజల ఆమోదంతో అధికారంలో కొనసాగడం మాత్రమే గాక, దేశ సమైక్యతను పటిష్టం చేసిన కీర్తిని కూడా సొంతం చేసుకోగలుగుతుంది.

తేదీ : 30-09-2021

సామల రమేష్ బాబు

అమ్మనుడిలో
సాంకేతికవిద్య

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

జాతీయ విద్యా విధానం : భారతీయ భాషల్లో విద్య, బోధన వనరుల కల్పన

# ఇక తెలుగులో ఇంజనీరింగ్ విద్య

**24** సెప్టెంబరున అఖిల భారత సాంకేతిక విద్య సమాఖ్య(ఏఐసీటీఈ) వారు ట్విట్టర్ వేదికగా ఒక ప్రకటన చేసారు. ఆ ప్రకటన ప్రకారం, మొదటి ఏడాది ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీకి సంబంధించిన 218 పుస్తకాలను 226గురు రచయితలు అనువదిస్తున్నారు, అనువదించిన పుస్తకాలను సమీక్షిస్తున్నారు అని. “ఇకపై ఇంజనీర్ అవ్వాలనుకునే విద్యార్థులకు భాష అవరోధం కాదు” అని బ్రహ్మాండమైన ఒక నినాదాన్ని కూడా జత చేసారు.

మరొక ప్రకటనలో కేంద్ర విద్యా మంత్రి(జాతీయ విద్యా విధానం అమలైన నాటి నుండి మానవ వనరుల మంత్రిని విద్యా మంత్రిగా వ్యవహరిస్తున్నాం) ధర్మేంద్ర ప్రధాన్ ఒక విషయాన్ని చెప్పారు - ఎనిమిది రాష్ట్రాలలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో, అయిదు భారతీయ భాషల్లో ఈ ఏడాది నుంచి ప్రాంతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్య అమలయ్యేలా ఏఐసీటీఈ చర్యలు తీసుకుందని.

కాస్త వెనక్కి వెళ్ళి చూస్తే, జూలై నెలలో ఏఐసీటీఈ ఒక ప్రకటన చేసి, 11 భారతీయ భాషల్లో ఈ ఏడాది నుంచి బి.టెక్ విద్య అందుబాటులో ఉంటుందని చెప్పింది. హిందీ, మరాఠీ, తమిళం, తెలుగు, కన్నడం, గుజరాతీ, మలయాళం, బాంగ్లా, అస్సామీ, పంజాబీ మరియు ఒడియా భాషలలో బి.టెక్ మొదటి ఏడాది విద్యకు అవసరమున్న వనరులన్నీ రూపొందించినట్టు ఆనాడు ఏఐసీటీఈ వెల్లడించింది. ఈ ప్రకటన వెంబడే కేంద్ర విద్యా శాఖ వారు రెండు కమిటీలను ఏర్పాటు చేసి - మొదటిది ఐఐటీ-ఎన్ఐటీ లాంటి మొదటి స్థాయి ఇంజనీరింగ్ కళాశాలల్లో భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ విద్య అందించడంపై అధ్యయనం చేసేందుకు ఏర్పడగా, రెండవది ఏఐసీటీఈ పర్యవేక్షణలో నిర్వహించబడుతున్న మిగతా అన్ని భారతీయ విశ్వవిద్యాలయాలలో మరియు కళాశాలల్లో భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ మొదలుకొని అన్ని వృత్తివిద్యా కోర్సులు అందించేందుకు ఏర్పడింది.

మొదటి కమిటీ ధోరణి సాధ్యాసాధ్యాల బేరీజు వైపు, ఎలాగైనా ఈ భారతీయ భాషల్లో కాకుండా సంప్రదాయం ప్రకారం ఇంగ్లిష్ లో మాత్రమే ఇంజనీరింగ్ అందించేలా సిఫార్సులు రూపొందించింది. రెండవ కమిటీ హిందీకి ప్రాధాన్యతనిస్తూ సాధ్యాసాధ్యాల అధ్యయనం చేయకుండా నేరుగా అమలు పరిచే వైపు అడుగులేసింది.

ఆ ప్రకారంగానే విద్యార్థులకు సర్వే నిర్వహించి అందులో మాతృభాష వైపు మొగ్గుచూపే పిల్లలను ఆధారం చేసుకుని పలు ప్రకటనలు చేసేసింది.

ఇక్కడ గమ్మత్తైన విషయం ఏంటంటే, మొదటి కమిటీ చేసిన సిఫార్సులకు విరుద్ధంగా పలు ఐఐటీల సంచాలకులు అప్పటికే ఐఐటీల్లో ప్రాంతీయ భాషల్లోనే బోధన జరుగుతుందని తెలుపగా,

> ప్రాథమిక విద్య స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేసే యత్నంలో ఉన్న రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలు, కేంద్రం నుంచి మాతృభాషలో పైస్థాయి విద్యలన్న ముసుగులో హిందీ భాషకు ఇస్తున్న ప్రాధాన్యత - వీటి నడుమ తెలుగు కచ్చితంగా నిలదొక్కుకుని సాంకేతిక భాషగా పైకెదుగుతుందని ఆశించగలమా?!

మరికొందరు ఐఐటీల సంచాలకులు, ఎన్ఐటీల సంచాలకులు ఇంగ్లిష్ మాధ్యమ బోధన లేకుంటే విద్యార్థులకు అపార నష్టం జరుగుతుందని ఎద్దేవా చేసారు.

రెండవ కమిటీ అమలుపై ఎందరో ఇంజనీరింగ్ కళాశాలల నిర్వాహకులు అసహనం వ్యక్తం చేసారు. విద్యార్థుల నుండి ఎలాంటి అభిప్రాయం సేకరించకుండానే భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ అమలుకు విద్యార్థులు కరువయ్యారు అంటూ పత్రికల ద్వారా వార్తలు వచ్చేలా చేసారు.

ఈ కమిటీలు ఎలా ఉన్నా, వీటి చర్యలు మాత్రం ఒక పద్ధతిగా జరగటం లేదు.

ఐఐటీలు, కొంత మేరకు ఎన్ఐటీలు స్వయం ప్రతిపత్తి మీద నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ఉంటాయి. విద్యార్థుల బోధన, పాఠ్యాంశాలు, బోధన సమయం, ఇలాంటి అన్ని నిర్ణయాలు సంస్థ స్థాయిలోనే తీసుకో బడతాయి. అంటే ఒకవేళ సోమవారం నాడు ఐఐటీ తిరుపతి లోని సెనేట్(పాలకసభ) తీర్మానించి తెలుగులో ఇంజనీరింగ్ బోధన జరగాలి అని నిర్ణయిస్తే, శుక్రవారం నాటికి అది వారు అమలు చేసుకోవచ్చు. అంతటి స్వేచ్ఛ ఐఐటీలకుంది.

మరో పక్క మన రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలలో, ఇంజనీరింగ్ కళాశాలల్లో జరగాల్సిన బోధన సంబంధ అంశాలన్నిటినీ ఏఐసీటీఈ నిర్దేశిస్తుంది. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఇవి జరగాలి.

ఇక్కడ మిగతా భాషల గురించి తరువాత చెప్పుకోవచ్చు గానీ, తెలుగు వరకూ ఏ కళాశాల కానీ, విశ్వవిద్యాలయం కానీ ఒకవేళ తెలుగులో ఇంజనీరింగ్ చదివితే ఉన్న లాభ నష్టాలేంటి? తెలుగులో ఇంజనీరింగ్ కోర్సు నేర్చుకుంటే భవిష్యత్తు ఏంటి అన్న విషయాలపై కనీస అవగాహన కల్పించలేదు. విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఇంజనీరింగ్ చదవడానికీ, తెలుగు మాధ్యమంలో ఇంజనీరింగ్ చదవడానికీ మధ్య వ్యత్యాసం తెలియాలంటే తెలుగులో ఇంజనీరింగ్ చదివి, ఆ అనుభవాన్ని పంచుకోగలిగే విద్యార్థులు, బోధన సిబ్బంది కావాలి. అవి లేకుండానే ఏఐసీటీఈ ఉత్తర్వులివ్వడం, ఎవరూ తెలుగులో ప్రవేశం తీసుకోవట్లేదని కళాశాలలు వార్తాపత్రికలలో కథనాలు ప్రచురించుకోవటం అపసవ్యంగా ఉంది.

మన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు మాతృభాషల గురించి విరివిగా మాట్లాడుతున్న ఈ కాలంలో ఇలాంటి చిన్న చిన్న

మరొక ముఖ్యమైన విషయం: ఇంజనీరింగ్ విద్య అనేది పుస్తకాలలో చదువుకున్న చదువులను మానవత్వానికి, సమాజానికి ఉపయోగపడేలా అమలులో పెట్టడం. ముఖ్యంగా భారతీయ సమాజంలో, మన తెలుగు రాష్ట్రాలలో ఉన్న సమస్యలకు సమాధానాలుగా సాంకేతికతలు పనికి రావాలి. అలా జరగాలంటే, ఇక్కడి సమస్యలను అధ్యయనం చేసే పాఠ్యపుస్తకాలు మనం రాసుకోగలగాలి. ఇంజనీరింగ్ విద్యను భారతీయ భాషల్లో బోధించదలచుకుంటే, పాశ్చాత్యులో, మనవారో ఆంగ్లంలో రాసుకున్న పుస్తకాలను అనువాదం చేస్తే మాత్రమే సరిపోదు. ఇక్కడి అవసరాలకు తగ్గట్టు కొత్త పుస్తకాల సృజన కూడా జరగాలి. పాశ్చాత్యులు రాసిన ఆంగ్ల పుస్తకాలకు దీటుగా మన పాఠ్యపుస్తకాలు చేరాలంటే అనువాదంతో సరిపెట్టుకోకుండా అనుసృజన వైపు, సృజన వైపు అడుగులు వేయాలి.

పొరపాట్లతో పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఏఐసీటీఈ లాంటి కేంద్ర సంస్థలు, కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ అందరూ పెద్ద తప్పు చేస్తున్నారు.

తెలుగులో ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశపెట్టడం అంటే కేవలం పాఠ్యపుస్తకాలను అనువాదం చేస్తే సరిపోదు. ఇంజనీరింగ్ విద్యలో సెమెస్టర్‌కు ఆరేసి చొప్పున సబ్జెక్టులుంటాయి. ఒక్కో సబ్జెక్టుకి నికరంగా ఐదారు పాఠ్య పుస్తకాలు, ఐదారు రెఫరెన్స్ పుస్తకాలు సూచించబడి ఉంటాయి. పరీక్షలలో అన్ని పుస్తకాల నుంచి కలిపి ప్రశ్నలు అడుగుతారు. ఇంజనీరింగ్ స్థాయిలో ఉన్న పాఠ్యపుస్తకాలను ఆకళింపు చేసుకోవాలంటే, అంతకు ముందు నుంచి నిచ్చెనవరసలో కింద నుంచి పై స్థాయిలో ఉన్న ఇంజనీరింగ్ కోర్సు పాఠ్యక్రమాన్ని అర్థం చేసుకునే మౌలిక అంశాల కింది నిచ్చెన మెట్ల పై అవగాహన ఉండాలి. అంటే మౌలిక, ప్రాథమిక విషయాలన్నిటి మీద సరళంగా, ఇట్టే అర్థమయ్యేట్టు వివరించగల పుస్తకాలు గానీ, వనరులు గానీ ముందుగా తెలుగులో ఉండాలి. లేనిచోట వీడియోల ద్వారా ఆ పాఠ్యక్రమాలను అందించి, కనీసం సబ్‌టైటిల్స్(పాదపీఠాల్లో)లో తెలుగులో ఉండేలా విద్యార్థులకు అందించాలి. ఇది కేవలం విద్యార్థుల బోధన సంబంధ అవసరం. తెలుగులో ఆ స్థాయిలో, అంటే మౌలిక–ప్రాథమిక అంశాలను తెలియజేసే వనరులు, ఆపై పాఠ్య పుస్తకాలు, రెఫరెన్స్ పుస్తకాలు – ఇవన్నీ అందుబాటులోకి వస్తే బోధన సాధ్యమవుతుంది.

విద్యార్థి ఇంజనీరింగ్ విద్యను తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్నాడు సరే, ఆ విద్య సమగ్రం అయ్యేది ఎప్పుడు?

ఇంజనీరింగ్ విద్యలో కొన్ని పాళ్ళు పరిశోధన ఉంటుంది, కొన్ని పాళ్ళు నేర్చుకున్న చదువులతో కొత్త ఆవిష్కారాల రూపకల్పన చేసే అవసరం ఉంటుంది.

పరిశోధన జరిగింది అనటానికి ఋజువులు పరిశోధనా పత్రాలు. జరిగిన పరిశోధనను ఒక నిర్దిష్ట శైలిలో లిపిబద్ధం చేసే ప్రక్రియ. సాంకేతిక విషయాలపై పరిశోధన చేసి, పరిశోధనా పత్రం రాసి, ఆ పత్రాన్ని ఒక పరిశోధనాపత్రిక(జర్నల్)లో ప్రచురించటం కనీస ప్రక్రియ. అందుకు తెలుగులో ఎలాంటి వనరులు ఉన్నాయి? కనీసం ఏటా విడుదలయ్యే వందల వేల పరిశోధనా పత్రాలు అనువాదం రూపంలోనైనా తెలుగులో ప్రచురితమవుతున్నాయా అంటే లేదు.

నేర్చుకున్న చదువుల ఆధారంగా ఏదైనా కొత్త ఆలోచననో లేదా ఆవిష్కరింపబోయే వస్తువునో పేటెంట్ రూపంలో ఇంజనీరింగ్ విద్యార్థులు పొందుతారు. ఈ పేటెంటులు, ఆవిష్కరణలు మొదలగునవి ఒకవేళ ఒక విద్యార్థి తమ మాతృభాషలో సమర్పించినా, అది ఆమోదించే సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈనాటికీ పరిశోధనలను, ఆవిష్కారాలను విశ్వవిద్యాలయంలో తెలియపరచాలంటే అది ఆంగ్లంలోనే జరగాలి. ఇది భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ చేసే వారికి ఒక పెద్ద అవరోధం. ఇంగ్లిష్‌తో పాటుగా భారతీయ భాషల్లో సాంకేతికాంశాల పరిశోధనా పత్రాలను ప్రచురించే ప్రచురణాపత్రికలు రావాలి. ఇంగ్లిష్‌తో పాటు భారతీయ భాషల్లోనూ పేటెంట్, ట్రేడ్‌మార్క్ మొదలగు ఆవిష్కారాల పత్రాలను సమర్పించే వైపుగా భారత ప్రభుత్వ సంస్థలు ప్రోత్సహించాలి.

ఇక విద్యార్థి ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణుడయ్యాక ఉద్యోగం పొందాలి.

ఉద్యోగంలో భాగంగా చేసే ఏ పనిలోనూ అంగ్లం అవసరం లేకపోయినా, అభ్యర్థి ఆంగ్లంలో మాట్లాడే, రాసే, అర్థం చేసుకునే నైపుణ్యాన్ని అనుసరించి కంపెనీలు ఉద్యోగంలోకి ఎంపిక చేసుకుంటున్నాయి.

అభ్యర్థి పని చేయాల్సిన నైపుణ్యతలో నాసిరకంగా ఉన్నా, ఆమె/అతను ఆంగ్లంలో బాగా మాట్లాడగలిగితే, వారికి ఉద్యోగాలు కట్టబెడుతుంది ప్రస్తుత వ్యవస్థ.

ఈ వ్యవస్థ ఎంపిక చేసుకునే పనితీరు మారాలి. ఆంగ్ల భాషా నైపుణ్యం అవసరమైతే భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ నేర్చుకున్న అభ్యర్థులకు ఎప్పటికప్పుడు ఆంగ్లభాషలో కూడా పటుత్వం వచ్చేలా కోర్సులు తీర్చిదిద్దాలి. లేదా పనిచేసే చోట ఆంగ్లం అవసరం లేని ఉద్యోగాలకు, ఆ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ ఆంగ్ల భాషా నైపుణ్యం పై ఆధార పడకుండా కేంద్ర విద్యా శాఖ చర్యలు తీసుకోవాలి.

పైన చెప్పిన సమస్యలు కాకుండా అమలులోకి వచ్చాక ఇంజనీరింగ్ మాతృభాషలో చదివితే వచ్చే మరిన్ని సమస్యలు బయల్పడతాయి. వాటన్నిటికీ త్వరిత గతిన సమాధానాలు వెతికి అమలు చేసే శక్తి ఉన్న రాష్ట్ర స్థాయి, భాషా స్థాయి సంస్థలు ఏర్పడాలి.

పైన ఉన్న మౌలిక సమస్యలు తీర్చకపోతే భారతీయ భాషల్లో ఇంజనీరింగ్ బోధన ప్రవేశపెట్టినా అది బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

తమిళనాడులోని 11 కళాశాలల్లో అన్నా విశ్వవిద్యాలయం వారు తమిళ మాధ్యమంలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ అందిస్తున్నారట. విద్యార్థులకు తమిళంలో, ఆంగ్లంలో పరీక్షలు రాసే వెసులుబాటు ఉందట. అన్నా విశ్వవిద్యాలయం నుంచి, ఆయా కళాశాలల యాజమాన్యాల నుంచి, అలా తమిళంలో చదువుకున్న విద్యార్థుల నుంచి ఆంగ్లేతర భాషలో బోధన వలన జరిగిన మంచి–

**తరువాయి 17వ పుటలో....**

పరిశోధన

గారపాటి ఉమామహేశ్వరరావు
పరమేశ్వరి కృష్ణమూర్తి

# యంత్రానువాద వ్యవస్థ: అపసరణాలు

ఆధునిక అంతర్జాల యుగంలో జ్ఞానసంపదనూ సమాచార వినియోగాన్నీ కట్టడి చేసేవారిదే పైచేయి. ఆర్థిక రాజకీయ పరమైన అభివృద్ధికి సమాచార వినియోగం ప్రధానం. జ్ఞానసృష్టి ప్రపంచంలో ఎక్కడ జరుగుతున్నా దాన్ని అందుకొని వాడుకున్నవారికే అభివృద్ధి సాధ్యం. ఈ జ్ఞానసృష్టి నిరంతరం జరిగే కార్యక్రమం. అన్ని భాషలలోనూ జరుగుతుండవచ్చు. ఏ భాషలో జ్ఞానసృష్టి జరిగినా అది వీలైనన్ని భాషలలోకి వచ్చి అందరికీ అందుబాటులో ఉండటం అవసరం. అవధులులేని సమాచార వినియోగం ప్రజాస్వామ్యానికి ఆలంబన. అందరికీ అన్నీ సమకూరాలంటే సమాచార మార్పిడితోనే సాధ్యం. సమాచార మార్పిడి ఎప్పటికప్పుడు జరగాల్సిన కార్యక్రమం. దీనికి ఆధారం జ్ఞానసృష్టి జరిగిన భాషలను నేర్చుకొనివుండటం లేదా అనువాదాలపై ఆధారపడటం. ప్రపంచంలో ఉన్న ఏడువేల భాషలనూ కొందరైనా నేర్చుకోవడం ఒకఎత్తైతే ఎప్పటికప్పుడు అనువదించుకోవడం మరొక ఎత్తు. దేనికదే కష్టసాధ్యమైన పని. దీనివలన కొన్ని ప్రధాన భాషలను చారిత్రక సామాజిక సందర్భాలను బట్టి నేర్చుకొనక తప్పనిసరి అవుతోంది. దీనితో ఖర్చుకు ఖర్చూ, అనవసరమైన యాతన కాలయాపన అన్నీ అడ్డుగోడలై, భాషా సమస్యలకూ భాషా సంక్షోభాలకూ దారితీస్తున్నాయి. మన కళ్ల ముందే మన మాతృభాషలకు కాలం చెల్లించే విధానాలకు మన నేతలు పావులు కదుపుతున్నారు. మాతృభాషలను బడినుండి దూరం చేసే స్థితికి చేరుకున్నాం.

ఈ భాషా సమస్యలూ సంక్షోభాల నుండి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కావాలంటే యంత్రానువాద వ్యవస్థల నిర్మాణమే సమాధానం. యంత్రానువాద వ్యవస్థలద్వారా ఎప్పటికప్పుడు ఏ భాషనుంచైనా అప్పటికప్పుడే మరొక కోరుకున్న భాషలోకి అనువదించుకోవడం తక్కువ ఖర్చుతోనూ, ఎలాంటి కాలయాపనా లేకుండా భాషను నేర్చుకొనే యాతన అసలే లేకుండా సాధ్యమౌతుంది. అనువాదాలుకూడా మనుషులు చేసినట్లు స్వేచ్ఛానువాదాలు కాకుండా యంత్రానువాదాలు యథామూలానువాదాలుగా ఉండటం ఒక ప్రత్యేకత. పూర్వం వలే కాకుండా ఇప్పటి సాహిత్యం ఎక్కువగా సాంకేతిక, వైజ్ఞానిక, సామాజిక శాస్త్రాల ఆధారంగానూ సమాచారపరంగానూ వస్తున్నదే. వీటి అనువాదాలలో మార్పులకూ చేర్పులకు మన సంస్కృతికీ మనకూ నచ్చే విధంగా మనవాళ్లు మెచ్చే విధంగా అనువాదం చేసే పద్ధతులకు కాలం చెల్లింది.

ఇప్పటికే ఎన్నో దేశాలలో ఎన్నో భాషలకు ఇట్లాంటి యంత్రానువాద వ్యవస్థలు వాడుకలోకి వచ్చాయి, ఉదా. ఇంగ్లీషు, రష్యను, స్పానిషు, ఫ్రెంచి, జర్మను, జాపనీసు, చైనీసు ఇంకా మరెన్నో భాషలలో ప్రత్యేకంగా వైజ్ఞానిక విషయాల సాహిత్యాన్ని అనువదించే యంత్రానువాద వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. గూగుల్ అనువాదం షుమారు వంద భాషల్లో అందుబాటులోకి వచ్చింది. విశ్వవ్యాప్తంగా ఎన్నో సంగణక సమాచార సాంకేతిక రంగాలవారు వివిధ పద్ధతులలో యంత్రానువాద వ్యవస్థలను నిర్మించే పని ముమ్మరంగా సాగుతోంది. ఈనాడు కొన్ని భాషలమధ్య యంత్రానువాదం ఉండవలసినంత గుణాత్మకంగా లేకున్నా ఈ దశాబ్దాంతానికి అప్పటికప్పుడు గుణాత్మకమైన అనువాదాలు సాధ్యం కావచ్చు.

భాషలమధ్య స్వయంచాలకంగా పనిచేసే, గుణాత్మకమైన, బలమైన యంత్రానువాద వ్యవస్థను రూపొందించటం ఆకర్షణీయమైనదే, కానీ వివిధ స్థాయిలలో భాషల మధ్యనున్న తేడాలూ లేక వైరుధ్యాల రూపంలో కనబడే అపసరణాలు పెద్దగానే ఇబ్బందిపెడతాయి. భాషల మధ్యనున్న తేడాలు (అనువాద అపసరణాలు) యంత్రానువాద వ్యవస్థలో సూటిగా అర్థ మార్పిడిని కొనసాగించటానికి బాధకంగా నిలుస్తాయి. భాషాశాస్త్ర పరమైన విశ్లేషణ-పరివర్తన ఆధారిత యంత్రానువాద వ్యవస్థలలో భాషల మధ్య వ్యత్యాసాల సంఖ్య పెరుగుదల అనువాద సంక్లిష్టతను పెంచుతుంది. ఈ వ్యాసం తెలుగు-తమిళ భాషల యంత్రానువాద వ్యవస్థల అభివృద్ధిని వాటి సాఫల్యతను మెరుగుపరచడానికి భాషల మధ్య పరామితుల వైవిధ్యాల సంఖ్యను లెక్కించడానికి ఒక అపసరణ సూచిని ఎలా నిర్మించవచ్చో చర్చిస్తుంది. అనువాద అపసరణాల సూచి యంత్రానువాదంలో మెరుగైన ఇంకా వేగవంతమైన ఫలితాలను సాధించడానికి మూలభాష-లక్ష్యభాషలలో ఎక్కడ ఎంత ప్రయత్నం చేయాలో ప్రతిపాదించడం ద్వారా యంత్ర అనువాదాన్ని సులభతరం చేస్తుంది. దీనికి అదనంగా, యంత్రానువాద వ్యవస్థలో సమాచార పరివర్తన ఆధారిత విధానంలో విభిన్న రకాల వ్యత్యాసాల నిర్వహణ వ్యూహాలు కూడా చర్చించబడతాయి.

**పరిచయం**

సహజ (మానవ) భాషా ప్రక్రియల యాంత్రీకరణలో ప్రత్యేకంగా యంత్రానువాదం వ్యవస్థ ఒక సవాలు. ఇది అత్యంత లోతైన వైజ్ఞానిక - కార్యకలాపం. ఒక భాష నుండి మరొక భాషకు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి ఇంకా దానిని మార్పిడి చేయడానికి భాషాపరమైన, పారలౌకిక, ప్రాపంచిక, సాంస్కృతిక ఇంకా క్షేత్ర పరిజ్ఞానం వంటి వివిధ రకాల జ్ఞానం అవసరం. యంత్రానువాదంలో,

ప్రపంచవ్యాప్తంగా అనేక పద్ధతులు పాటిస్తున్నారు, వాటిలో ప్రధానమైనవి ప్రత్యక్ష పద్ధతి, అంతర్భాషీయ పద్ధతి, పరివర్తనాధారిత పద్ధతి, గణాంక, పాఠ్యనిధి ఆధారిత పద్ధతులూ ఇంకా నాడీ యంత్రానువాదం ఇంకా లోతైన నాడీ జాలికావలయాలతోకూడిన తాజా పరిణామాలతో పాటు వీటికి తోడుగా కృత్రిమ బౌద్ధిక పద్ధతులు. ఈ వ్యాసం భారతీయ భాషలమధ్య యంత్రానువాద ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయబడిన పరివర్తనాధారిత తెలుగు-తమిళ యంత్రానువాద వ్యవస్థలో అపసరణ సూచి ఉపయోగంతో వచ్చే మెరుగుదలను గురించి చర్చిస్తుంది (ఎలక్ట్రానిక ఇంకా సమాచార సాంకేతిక, ప్రసార సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ నిధులతో సంపర్క్ పేరున ఏర్పడిన కన్సార్టియంకింద సాగించిన పరిశోధనలో భాగంగా తయారు చేసిన నివేదన ఇది). ఈ వ్యాసం భారతీయ భాషలమధ్య యంత్రానువాద ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయబడిన పరివర్తనాధారిత తెలుగు-తమిళ యంత్రానువాద వ్యవస్థలో అపసరణ సూచి ఉపయోగంతో వచ్చే మెరుగుదలను గురించి చర్చిస్తుంది (ఇది ఎలక్ట్రానిక సమాచార సాంకేతిక, ప్రసార సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ నిధులతో సంపర్క్ పేరున ఏర్పడిన కన్సార్టియంకింద సాగించిన పరిశోధన (2008-14).

భాషా విశ్లేషణ ఏ స్థాయిలోనైనా (పైపైన, మధ్యస్థ, లోతైన, మరీలోతైన స్థాయిలలో) కనబడే అన్ని భాషా వ్యత్యాసాలనూ జాబితా చేయడం ద్వారా తెలుగు నుండి తమిళ యంత్రానువాదం కోసం అపసరణ సూచిని ఎలా నిర్మించాలో ప్రయోగాత్మకంగా వివరిస్తూ ఆశించిన ఫలితాన్ని పొందడానికి విభిన్న యంత్ర అనువాద సాధనాలను మెరుగుపరచడానికి అపసరణ సూచి ఎలా సహాయపడుతుందో వివరించడానికి కూడా ఇది ప్రయత్నిస్తుంది. వీటితో పాటు, యంత్ర అనువాదానికి పరివర్తన ఆధారిత విధానంలో విభిన్న రకాల వ్యత్యాసాల నిర్వహణ వాటి వ్యూహాలు చర్చించబడతాయి.

## 2.తెలుగు-తమిళం యంత్రానువాదం

**2.1 తెలుగు, తమిళ భాషలు :** ఇవి ప్రాచీన కాలం నుండీ సాహిత్య సంప్రదాయాలు కలిగిన ప్రధాన ద్రావిడ భాషలు. ఇవి, భాషా సారూప్యతలతోబాటు కొన్ని అసమానతలనూ కొన్ని భాషాభేదాలనూ కలిగివుండటం ఎరిగినదే. తమిళం దక్షిణ ద్రావిడ శాఖకు చెందినది కాగా, తెలుగు దక్షిణ-మధ్య ద్రావిడ శాఖకు చెందినది (కృష్ణమూర్తి, 2003).

భారతీయ భాషల కోసం యంత్ర అనువాదాలను రూపొందించడంలో ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, చాలా యంత్ర అనువాద వ్యవస్థలు ఇంగ్లీష్ నుండి భారతీయ భాషలను లక్ష్యంగా చేసుకొని తయారైనవే. అయితే, వీటికి విరుద్ధంగా, ఏదేమైనా, భారతీయ భాషలనుంచి భారతీయ భాషలకు యంత్ర అనువాదాలను అభివృద్ధి చేయడానికి చేసిన ప్రయత్నాలు చాలా తక్కువే. ఈ ప్రయత్నం మొదటిసారి సంగణక విభాగం, ఐఐటి కాన్పూరు, కాల్ట్స్, హైదరాబాదు విశ్వవిద్యాలయం కలిసి 1997 నుంచే మొదలుపెట్టాయి.

భారతీయ భాషలలో అనేక ఉమ్మడి భాషా లక్షణాలు వున్నవనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకుంటే (ఎమెన్యూ, 1956, మశీకా: 1976, సుబ్బారావు: 2012), వాటి మధ్య అధిక నాణ్యత గల యంత్ర అనువాదాలను ఖచ్చితంగా సాధించవచ్చుననే అభిప్రాయం ఉంది. తెలుగు-తమిళ పరివర్తన-ఆధారిత యంత్ర అనువాదాల వ్యవస్థ అనేది నిర్దిష్ట మరలమధ్య సాగుతూ వివిధ భాషా విభాగాల ఉద్గారాల సమ్మేళనంద్వారా పూర్తి అనువాదం (అవుట్‌పుట్) ఉత్పత్తి అయ్యే వరకు వరుసగా వివిధ విభాగాలగుండా పయనించి సవరించబడుతూ రూపుదిద్దుకుంటుంది.

**2.2 తెలుగు-తమిళ పరివర్తన ఆధారిత యంత్రానువాద వ్యవస్థ**

ఇది మూడు-దశల నిర్మాణాన్ని ఉపయోగిస్తుంది:




దశ 1: మూల భాషా విశ్లేషకం;

దశ 2: మూల భాష నుండి లక్ష్య భాషకు పరివర్తనం;

దశ 3: లక్ష్య భాషా జనకం.

మూల భాషా విశ్లేషణలో అత్యంత కీలకమైన భాషా విభాగాలలో పద విశ్లేషకం, భాషాభాగాల గుర్తింపు (పిఓఎస్), పదబంధాల గుర్తింపు (చంకర్), పేర్లగుర్తింపు (నేమ్డ్ ఎంటిటీ రికగ్నైజర్), వాక్యవిశ్లేషకం (పార్సర్) ఇంకా మూల భాష నుండి లక్ష్య భాష పరివర్తన విభాగం లో సమాసాలూ (మల్టీ వర్డ్ ఎక్స్‌ప్రెషన్స్) , పరివర్తన వ్యాకరణ విభాగం, నిఘంటు మార్పిడిలో పర్యాయపదాల ఉభయభాషా నైఘంటిక పదాల మార్పిడి (లెక్సికల్ ట్రాన్స్‌ఫర్ సిన్సెట్ ఇంకా బైలింగ్వల్ లెక్సికాన్స్) , లక్ష్య భాషా జనకంలో పదాన్వయం, వాక్యాన్వయ విభాగాలూ (ఇంటర్-చంక్, ఇంట్రా-చంక్ అగ్రిమెంట్ మాడ్యూల్స్), పద జనకమూ ఉంటాయి. ఇలా అన్ని విభాగాలలోని ప్రక్రియలూ కింది బొమ్మ లో చూపినట్లుగా ఒక వరుసలో పైన పేర్కొన్న విధంగా సమాచారం సమీకరించబడుతూ సాగుతుంది.

**2.3 అనువాద అపసరణాలు:**

'అనువాద అపసరణం' భాషల మధ్యనున్న వ్యత్యాసాలనూ లేదా తేడాలనూ సూచిస్తుంది. ప్రత్యేకంగా, అనువాద ప్రక్రియలలో అంటే భాషలను అనువదించినప్పుడు ఏర్పడే లక్ష్య భాష సంతులన సౌష్ఠవాన్ని ప్రభావితం చేస్తుంది. ఒక వాక్యం యొక్క అంతర్లీన భావన లేదా 'సారాంశం' వివిధ పదాల మీద లేదా వివిధ భాషల కోసం వివిధ ఆకృతీకరణల్లో పంపిణీ చేయబడినప్పుడు అనువాద వైవిధ్యం ఏర్పడుతుంది (డోర్, 1993). (యంత్ర) అనువాదాలలో అపసరణ భావన మూల-లక్ష్య భాషలలో కనబడేటటువంటి భాషాపరమైన వైవిధ్యంగా పోల్చవచ్చు. దీన్ని భాషాంతరిత పరామితుల వైవిధ్యం (పారామెట్రిక్) వ్యత్యాసాలకు సమానంగా పరిగణించవచ్చు.

**2.4 డోర్స్ అపసరణం**

డోర్ (1993) యూనిట్రాన్ (యూనివర్సల్ ట్రాన్స్లేటర్) యంత్రానువాద వ్యవస్థలో వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఇంగ్లీష్, స్పానిష్ మరియు జర్మన్ భాషలలోని విభిన్న భాషాసంవర్గాలను వర్గీకరించింది. ఆమె ఈ భేదాలను వ్యాకరణాత్మక అపసరణం ఇంకా పద-అర్థపరమైన అపసరణం అనే రెండు ప్రధాన

రకాలుగా విభజిస్తుంది. డోర్ యొక్క వైవిధ్యాల వివరణ ఇంగ్లీష్, స్పానిష్ ఇంకా జర్మన్ భాషలకు పరిమితం చేయబడింది. విభిన్న భాషా జంటలు పాల్గొన్నప్పుడు అనేక విభిన్న వైవిధ్యాలు ఉండవచ్చు. ఈ విభేదాల అధ్యయనానికి మరింత అన్వేషణ అవసరం. డోర్ తరువాత, భారతీయ భాషలలో ఇంగ్లీష్-సంస్కృతం-హిందీ యంత్రానువాదం (గోయల్, 2009), ఇంగ్లీష్-సంస్కృతం యంత్రానువాదం (మిశ్రా, 2008), ఇంగ్లీష్-హిందీ యంత్రానువాదం (దేవ్, 2001), (గుప్త: 2003), సంస్కృతం-హిందీ యంత్రానువాదం (శుక్లా, 2010), హిందీ-తెలుగు యంత్రానువాదం (ఉమామహేశ్వరరావు, 2010) మరియు ఇంగ్లీష్-బెంగాలీ యంత్రానువాదం (దాష్, 2013) వంటి కొన్నింటిలో ఈ అధ్యయనాలు జరిగాయి.

చాలా సందర్భాలలో, డోర్ గుర్తించిన అనేక అపసరణాలు అరుదైన దృగ్విషయంగా గమనించారు. తెలుగు, తమిళ యంత్రానువాదంలో అపసరణ సమస్యలు ఇలా పరిగణించదగినంతగా ఉండవు. ఇంకా, డోర్ భాషాంతరిత యంత్రానువాదం యూనిట్లాన్లో ఉన్న వైవిధ్యాలను చర్చిస్తుంది, అయితే, పరివర్తన ఆధారిత యంత్రానువాదంలో దీనిగురించి మరింత అన్వేషణ అవసరం.

**2.5 తెలుగు-తమిళం**

ప్రస్తుత పరిశోధన అపసరణలను పదనిర్మాణం, వాక్యనిర్మాణం, పద-అర్థపరివర్తన వంటి మూడు ప్రధాన రకాలుగా వర్గీకరించడానికి ప్రయత్నిస్తుంది. 1. పదనిర్మాణ అపసరణం: ఇది యంత్రానువాదంలో ఏదేని ఒక జత భాషల మధ్య పదాల విభక్తిరూపాల నిష్పాదనలోనూ, ఉత్పాదక పదాలలో కనిపించే భేదాలను సూచిస్తుంది.

నామవాచకాలు, క్రియలు మరియు విశేషణాలు వంటి ప్రధాన పద విభాగాలలోనూ సర్వనామాలు, సంఖ్యా వాచకాలూ, దేశకాల వాచకాలు (NST) వంటి అప్రధాన తరగతులలోనూ తెలుగూతమిళాల మధ్య పదనిర్మాణ వైవిధ్యాల అధ్యయనం అవసరమైంది. అవ్యయాలూ అనుత్పాదకత పదనిష్పాదన రూపాలు ఇక్కడ మినహాయించబడ్డాయి. ఎందుకంటే అవి నిఘంటువులో చేరటమేగాక వీటి మధ్య నేరుగా మార్పిడి చేయటానికి అవకాశం ఉంటుంది. ఇది యంత్రానువాదంలో సమస్యను పరిష్కరిస్తుంది. ఉదాహరణకు, తెలుగులోతమిళంలో నామవాచకాలపై వివిధ విభక్తిప్రత్యయాలు చేరగా ఏర్పడిన కారక రూపాల వైవిధ్యం క్రింద ఉదహరించబడింది:

ఉదాహరణ 1: వచన ప్రత్యయాలు

తెలుగు, తమిళ భాషలలో వచన ప్రత్యయాలు రెండు: అవి ఏకవచనం, బహువచనం. బహువచనం మాత్రమే ప్రత్యయంతో గుర్తించబడుతుంది. ప్రధానంగా, -బహువచన ప్రత్యయం తమిళంలో -కళ్, కాగా తెలుగులో -లు . తమిళ భాషలో బహువచన ప్రత్యయం ప్రాణివాచకాలపై విధిగా కనబడుతుంది కానీ అప్రాణి వాచకాలతో ఐచ్ఛికం. అయితే, తెలుగులో సాధారణంగా బహువచన ప్రత్యయం తప్పనిసరి (పట్టిక 1. చూడండి).

| వచనం | తెలుగు | తమిళం | అర్థం |
|---|---|---|---|
| ఏకవచనం (ప్రాణివాచకం) | అమ్మాయి | పెణ్ | అమ్మాయి |
| బహువచనం (ప్రాణివాచకం) | అమ్మాయిలు | పెణ్కళ్ | అమ్మాయిలు |
| ఏకవచనం (ప్రాణివాచకం) | ఇల్లు | వీటు | ఇల్లు |
| బహువచనం (ప్రాణివాచకం) | ఇళ్ళు | వీట్(కళ్) | ఇళ్ళు |

**పట్టిక1 : నామవాచకాలపై వచన ప్రయత్నం**

వచన ప్రత్యయంలో అపసరణం ఈ కింది విధంగా సూత్రప్రాయంగా చూపించవచ్చు:

సూ. 1. తె. నామం-**<**వ.ప్ర**>** ⇨

త. నామం [అప్రాణివాచకం]-(**<**వ.ప్ర**>**)

**ఉదాహరణ 2 : తెలుగు-తమిళ భాషలలో విభక్తిప్రత్యయాలు**

నామాలకూ క్రియలకూ మధ్య వివిధ కారక సంబంధాలను సూచించడానికి తెలుగూ తమిళ భాషలు అనేక విధాలుగా ఉపయోగిస్తాయి. కారక ప్రత్యయాలలో ప్రధాన భేదాలు రెండు కారణాల వల్ల సంభవిస్తాయి, 1. నామాల ఆధారంగా కారక ప్రత్యయాల ఎంపిక, ఔపవిభక్తిక రూపాల ఏర్పాటు, (2) వాటి ప్రదర్శన క్రమంలో తేడా. ఉదాహరణకు, అంతర-దిశీయ విభక్తి ప్రత్యయం ఉదాహరణకు పట్టిక 2. లో చూడండి, ఇక్కడ తెలుగూ తమిళ భాషలలో ప్రత్యయాల క్రమం భిన్నంగా ఉంటుంది.

| ప్రత్యయం | తెలుగు | తమిళం | అర్థం |
|---|---|---|---|
| 1. అంతర-దిశీయ | ఇంటి -లోపలికి<br>ఇంటి -**లో**(ని)కి<br>(నా. +వ. +అధి.ప్ర. + చతు.ప్ర. ) | వీట్ట్-**ఉక్క్**-ఉళ్ళే<br>వీట్ట్-ఇన్-**ఉళ్ళే**<br>(నా. +వ. +(చతు.ప్ర. )+ అధి.ప్ర. ) | ఇంటి లోపలికి |

**పట్టిక 2. తెలుగు తమిళ భాషల్లో దిగ్వాచక ప్రత్యయం**

తెలుగు తమిళభాషల్లో నామాలపై అంతర-దిశీయ ప్రత్యయాలలో అపసరణం క్రింది విధంగా సూత్రప్రాయంగా చూపించవచ్చు:

సూ. 2.తె. నామం-**<**వ.ప్ర.**>**-**<అధి.**ప్ర.**-చతు.** ప్ర.**>** ⇨

త. నామం-(**<**వ.ప్ర.**>**)-**<చతు.**ప్ర.**>**-**<అధి.**ప్ర.**>**

సంక్షేప సంకేతాలు: (---) = ఐచ్ఛికం, ప్ర.=ప్రత్యయం, చతు.=చతుర్థీ, అధి.=అధికరణం, త.=తమిళం, తె.=తెలుగు, వ. = వచనం, నా.=నామం, నామవాచకం.

(తరువాయి వచ్చే సంచికలో...)

వ్యాసకర్తలు- అనువర్తిత భాషాశాస్త్ర
అనువాద అధ్యయన కేంద్రం ఆచార్యులు,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

శ్రీగణేష్ తొట్టెంపూడి
+49 17630163660

# జర్మన్ల పరిశోధనా దృష్టి - సామాజిక భాషావసరాలు

**జర్మన్ల విద్యావిధానం గురించి పోయిన సంచికలో చర్చించుకున్నాం. ఈ వ్యాసంలో పరిశోధనా విధానాలు సామాజిక అవసరాల దృష్ట్యా ఎలా ఉంటాయో క్లుప్తంగా వివరిస్తాను. నేను గమనించినంతవరకూ ఇక్కడ జర్మన్ భాషాపాండిత్యం అంటే సాహిత్య పాండిత్యం మాత్రమే కాదు, సాహిత్యంతో పాటు ఆ భాషకి సంబంధించిన భాషాశాస్త్ర దృష్టికూడా ఉంటుంది. జర్మన్ సాహిత్యానికీ, జర్మన్ భాషాశాస్త్రానికీ మధ్య ఒక సయోధ్యతో కూడిన అధ్యయనం ఇక్కడ జరుగుతుంది. సాహిత్య అధ్యయనంలోకానీ, భాషాశాస్త్ర అధ్యయనంలోకానీ తప్పనిసరిగా సాంకేతిక అనువర్తనం ఉంటుంది. ఇక్కడ చాలా పరిశోధనా గ్రంథాలు ఆ కాలపు సామాజిక భాషావసరాలను తీర్చేవిగా ఉంటాయి. నేను చూసినంతవరకూ ప్రతి పరిశోధక విద్యార్థీ తాను ప్రచురించే పరిశోధనా గ్రంథంలో చాల వరకు సాధ్యమైనంతవరకు కొంత సమాచారాన్ని సృష్టించటంగానీ, సాధ్యమైంతవరకూ సాంకేతికతకు అనువర్తించటానికిగానీ ప్రయత్నిస్తారు.**

మన దగ్గర తెలుగు అనగానే గుర్తుకొచ్చేది ఎక్కువగా తెలుగు విభాగాలు. మన దగ్గర ఎక్కువగా తెలుగు శాఖల్లో సాహిత్యానికి సంబంధించిన అధ్యయనమే జరుగుతుంది. తెలుగుని భాషాశాస్త్ర పరంగా అధ్యయనం చేయటం చాలా తక్కువే అని చెప్పాలి. భాషశాస్త్ర శాఖల్లో తప్పించి ఇక్కడ ఎక్కువగా జరిగేది సాహిత్యపరమైన అధ్యయనమే. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకసారి గమనిస్తే మనదగ్గర ఉన్న ప్రతి విశ్వవిద్యాలయంలోనూ తెలుగు శాఖలున్నాయి. వాటిలో ఎన్ని తెలుగు శాఖల్లో భాషాశాస్త్ర బోధనా పరిశోధనా ఉందో చెప్పనక్కర్లేదు అనుకుంటా. ఇక్కడ నేను చెప్పదలచుకున్న విషయం ఒక్కటే, మీరు సాహిత్యాన్ని అధ్యయనం చేసినా, ఏ విషయం మీద పరిశోధన చేసినా అది ప్రస్తుత సమాజానికి ఎంతవరకూ ఉపయోగపడుతోంది అన్నది పరిశీలించి ఆ విషయాన్ని అధ్యయనం చేయండి. సామాజిక అవసరాలను తీర్చేదిగా భాషని సంసిద్ధం చేసుకోవాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాల మీదే ఉంటుంది.

సాంకేతికత విస్తృతంగా అభివృద్ధిచెందుతున్న ఈ రోజుల్లో తెలుగు భాషను మనం సామాజిక అవసరాలకు సంసిద్ధం చేసుకోవాలి. దానికిగానూ మనం విరివిగా ఈ భాషను సాంకేతిక ఉపకరణాలలో వాడవలసి ఉంటుంది. ఈ విధానాలలో మనం మొదటిగా చేయవలసింది భాషని సాంఖ్యీకరణం (డిజిటలైజేషన్) చేయటం. సాంఖ్యీకరణం అంటే పుస్తకాలని స్కాన్ చేసి ఆన్‌లైన్, లేదా ఆర్కైవ్లోనో పెట్టటం కాదు. నా అభిప్రాయంలో సాంఖ్యీకరణం అంటే మనం స్కాన్ చేసిన పత్రాన్ని యంత్రం చదవగలగాలి. దాన్ని యంత్రం అర్థం చేసుకోగలగాలి. మనం ఆ పత్రాలమీద ఏమైనా శోధనలనూ, ప్రశ్నలనూ వేస్తే ఆ యంత్రం వాటికి ఆ పత్రాల నుండీ లేదా ఆ పుస్తకాల నుండీ సమాచారాన్ని మనకు తిరిగి ఇవ్వగలగాలి. అంటే ఒక విధంగా మనం పుస్తకాలని మనిషి ఎలా చదివి అర్థంచేసుకోగలుగుతున్నాడో అలా యంత్రం చేత చదివించి సమాచారాన్ని తిరిగి పొందటం అన్నమాట. ఇలాంటివి చేసినప్పుడు మాతృభాషలో అద్భుతమైన ఉపకరణాలను నిర్మించటానికి ఇవి ఉపయోగపడతాయి. పరిశోధనలు చేసే ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉపకరణాలు చేయటానికి సమాచారాన్ని సమకూర్చాలి. మీకు ఈకింద గొట్టింజన్ విశ్వవిద్యాలయం వారు ప్రాచీన భారతీయ గ్రంథాలకు ఎలాంటి డిజిటలైజేషన్ చేశారో ఈ కింది చిత్రంలో చూడొచ్చు.

ఈ డిజిటల్ లైబ్రెరీలో మనకి ఎక్కడా ఒక్క పిడిఎఫ్ పుస్తకం కనపడదు. అన్నీ టిఇఐ రూపంలోనే ఉంటాయి. అంటే ఈ రూపంలో ఉన్న పత్రాలన్నీ యంత్రం చదివి అర్థం చేసుకోగల పుస్తకాలన్నమాట.




గొట్టింజన్ వారి భారతీయ సాంఖ్యిక భాషానిధి

```
▼<listChange>
   <change when-iso="2020-07-31" who="Maximilian Mehner">TEI encoding by mass conversion of GRETIL's Sanskrit corpus</change>
  </listChange>
 </revisionDesc>
</teiHeader>
<text xml:lang="sa-Latn" xml:id="RvKh">
▼<body>
 ▼<div>
   <p>om.namo.viṣṇave / atha khileṣu sūkta.pratika.ādy uktam.prayojanam.. śatarcy.ādīnām.adhidaivatā.lakṣaṇāni ca /.(.Khila I Introd..).
   kṛtiḥ.prakṛtir.ākṛtir.vikṛtis.saṃkṛtir.abhikṛtir.utkṛtir.ity.aśity.akṣara.ādīni.catur.uttarāṇy.eva.yajūṃṣi.saṃkhyā.anuvartana.ādi.tulyam.ṛṣiṇā
   //.(.Khila I Introd..).</p>
   <p><.sam.>.tṛcam.<.śaśvat.>.ṣaṇ.ūnā.tārkṣyas.suparṇa.āśvinam.vai.tat.saptamy.āgneyi.parā.aindri.ekādaśi.vā.navami.liṅga.uktā.devatā.aṣṭamy.ādi
   <.pra.>.sapta.brāhmyo.niṣad.upaniṣadau.dvitiyā.jagati.ṣaṣṭhi.virāṭ.sthānā.<.jyotiṣmantam.>.daśa.bhāradvājo.jyotiṣmām.ṣaṣṭhy.ādyā.liṅga.ukta.de
   <.kṛśa.>.ekādaśa.āśvinaḥ.kṛśa.ādyāṣ.ṣaḍ.liṅga.ukta.devatā.ānuṣṭubham.<.imāni.>.sapta.apunar.doṣa.aindr āvaruṇam.jāgatam.<.ayam.>.ṣaḍ.retāgaṅgy
   <.yam.>.catuṣkam.gaurivītir.<.idam.>.aṣṭau.cakṣuṣi.<.āśvinā.>.apadoṣaṣ.ṣaṣṭhi.jagaty.atra.anukta.gotrās.sauparṇāḥ.//.(.p.53.).</p>
  ▼<lg xml:id="RvKh_1.1.1">
    <l xml:id="RvKh_1.1.1a">samaikṣiṣya.ūrdhva.mahasa.ādityena.sahiyasā./</l>
    <l xml:id="RvKh_1.1.1b">aham.yaśasvinām.yaśo.viśvā.rūpāṇy.ādade./</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.1.2">
    <l xml:id="RvKh_1.1.2a">udyann.adya.vi.no.bhaja.pitā.putrebhyo.yathā./</l>
    <l xml:id="RvKh_1.1.2b">dīrgha.āyutvasya.heśiṣe.tasya.no.dhehi.sūrya./</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.1.3">
    <l xml:id="RvKh_1.1.3a">udyantam.tvā.mitramaha.ārohantam.vicakṣaṇa./</l>
    <l xml:id="RvKh_1.1.3b">paśyema.śaradaś.śatam.jivema.śaradaś.śatam./</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.1.4">
    <l xml:id="RvKh_1.1.4a">abhi.tyam.meśam.puru.hūtam.ṛgmiyam./1</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.2.1">
    <l xml:id="RvKh_1.2.1a">śaśvan.nāsatyā.yuvayor.mahitvam.gāvo.arcanti.sadam.it.purukṣū./</l>
    <l xml:id="RvKh_1.2.1b">yad.ūhathur.aśvinā.bhujyum.astam.anārambhaṇe.adhvani.taugryam.astam./</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.2.2">
    <l xml:id="RvKh_1.2.2a">yad.aśvam.śvetam.dadhato.abhighnan.nāsatyā.bhujyū.sumatāya.perave./</l>
    <l xml:id="RvKh_1.2.2b">tam.vyām.ratim.vidatheṣu.viprā.rebhanto.dasrāv.agaman.manasyum./</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.2.3">
    <l xml:id="RvKh_1.2.3a">ā.no.vipanyū.savanam.juṣethām.ā.vām.haṃsās.suyujo.vahantu./</l>
    <l xml:id="RvKh_1.2.3b">yuvām.stomāso.janayo.na.maryā.uśanto.dasrā.vṛṣaṇā.sacante.|.(.p.54.).</l>
   </lg>
  ▼<lg xml:id="RvKh_1.2.4">
    <l xml:id="RvKh_1.2.4a">ā.no.yātam.tṛvṛtā.(.trivṛtā.).soma.peyam.rathena.dyukṣā.savanam.madāya./</l>
    <l xml:id="RvKh_1.2.4b">stīrṇam.vām.bahris.suṣutā.madhūni.yuktā.hotāro.rathinās.suhastāḥ./</l>
   </lg>
```


**గొట్టింజన్ వారి ఋగ్వేద టిఇఐ రూపాంతరీకరణ**

ఇలా మనం మన మాతృభాషలో ప్రతి పుస్తకాన్నీ సాంఖ్యీకరణం చేయవలసి ఉంటుంది. మనం అనుకునే సాంఖ్యీకరణానికీ విదేశీయులు అనుకుంటున్న డిజిటలైజేషన్‌కి ఎంత వ్యత్యాసం ఉందో చూడండి. అసలు ఈ టిఇఐ అంటే ఏమిటి మొదలైన విషయాలని జర్మనీలో ఇక్కడి వారు భారతీయ భాషలమీద చేస్తున్న పరిశోధనలని తదుపరి వ్యాసాలలో వివరిస్తాను.


వ్యాస రచయిత– జర్మనీలోని హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో "డిజిటల్ హ్యూమానిటీస్"లో పరిశోధకుడు.

జె.డి.ప్రభాకర్
8500227185

# విద్యార్థుల్లో భాషాసమస్య ఒక కృష్ణబిలం

**అం**తరిక్షంలో అత్యంత గురుత్వాకర్షణ శక్తి కలిగిన ప్రదేశాలను కృష్ణ బిలాలు ( బ్లాక్ హోల్స్ ) అంటారు. కృష్ణ బిలాలకి దగ్గరగా వచ్చే సూర్యుడి కంటే ఎంతో పెద్ద నక్షత్రాన్నైనా మింగేస్తుంది. చివరికి కాంతిని కూడా తనలోకి పూర్తిగా ఆకర్షించుకుని కనబడనీయకుండా చేస్తుందని శాస్త్రం చెబుతోంది. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ, గ్రహణ శక్తి, ఆత్మవిశ్వాసం, మొదలగు లక్షణాలను ఇంగ్లీషు విద్యామాధ్యమం మింగేస్తోంది. ప్రాథమిక దశలో, మాధ్యమిక దశలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇటువంటి సమస్యలు వెలుగులోకి ఎక్కువగా రాలేదు. విద్యార్థుల వికాసానికి అవరోధంగా మారిన భాషాసమస్యనూ వాటి పర్యవసానాలనూ పూర్తిగా శాస్త్రీయ కోణంలో వివరించి, వాటిని సంబంధిత పరిశోధనలతో నిరూపించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

**భాషా సమస్యలు**

ఒక దేశంలోని భాషా సమస్యలు ఆ దేశానికి ప్రగతి అవరోధాలుగా ఉంటాయి. రిచర్డ్ రుయిజ్ ( 2013: 19) అమెరికాలోని భాషాసమస్యలపై పరిశోధన చేసి “ ... భాషా సమస్యలు, ఆ సమూహానికి సంబంధించిన పేదరికం, మానసిక వైకల్యం, తక్కువ విద్యాసాధన, సామాజిక చైతన్య లేమితో ముడిపడి ఉంటాయి” అని తెలిపారు. సమాజంలో భాషాసమస్యలు ఉన్నట్లయితే అవి పేదరికానికి దారితీస్తాయని వారి మాటల్లో గమనించవచ్చు. ఈ భాషాసమస్యల కారణంగా విద్యార్థులకు చదువు అబ్బక, విద్యకు దూరం అవుతూ బడి మానేసినవాళ్లు (డ్రాపౌట్స్) మన తెలుగు రాష్ట్రాలలో పెరుగుతూనే ఉన్నారు. అది దేశ విద్యాసాధనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. బహు భాషలు కలిగిన దేశాలలో ఇటువంటి భాషాసమస్యలు అనివార్యం. ఎక్కువ భాషల నుండి భాషా ఎంపిక చేయడం సమస్యను క్లిష్టతరంగా మార్చుతుంది అని మ్యాకీ (1979 : 48) సూచించాడు. బహుభాషలు కలిగిన మన దేశంలో ప్రతీ రంగంలో ఎప్పటికీ భాషాసమస్యలు ఉంటూనే ఉన్నాయి. రాజకీయపరంగానూ సామాజికపరంగానూ ఇవి తీవ్ర సమస్యలుగా పరిగణించబడతాయి. ముఖ్యంగా విద్యావ్యవస్థలో దీని ప్రభావం తిరిగి పూడ్చుకోలేనంతగా జరిగాయి. తద్వారా దేశం పూర్తి నష్టాన్ని అన్ని రంగాలలో చవిచూస్తూనే ఉంది. భాషాసమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపే భాషావిధానాన్ని గురించి ఫిష్మన్ (1974a:79 ; 1975) ప్రస్తావిస్తూ “భాషా సమస్యల పరిష్కారానికి క్రమబద్ధమైన అన్వేషణ, సాధారణంగా జాతీయస్థాయిలో జరగాలి” అని అన్నారు.

పిల్లలకు వారసత్వంగా వచ్చే భాషలో (అమ్మనుడి) స్వేచ్ఛా, ధైర్యం, సృజనాత్మకత, చురుకుదనం ఉంటాయి. ఉత్సుకతతో చూసే కళ్ళతో మాతృభాషలోనే అన్ని వస్తువుల పేర్లను తెలుసుకుంటాడు. చుట్టూ ఉండే తల్లిదండ్రులూ బంధువులూ ప్రేమగా పలకరించే పిలుపులూ అన్నీ మాతృభాషలోనే మస్తిష్కంలో చోటుచేసుకుంటాయి. ఎదిగేకొద్దీ తోటి స్నేహితులతో స్వేచ్ఛగా ఆడుకోవడం, నిర్భయంగా మాతృభాషలో మాట్లాడడం జరుగుతుంది. పిల్లల్ని బడిలో చేర్పించాక పూర్తిగా వాతావరణం మారుతోంది. పిల్లల కదలికల నుంచీ మాట్లాడే భాష వరకూ బడిలో ఉపాధ్యాయులు సరిచేస్తూ ఉంటారు. ఇంగ్లీష్ మాధ్యమంలో చదివే పిల్లలకు పూర్తిగా మాట్లాడే స్వేచ్ఛ హరించుకుపోతుంది. ఇంటి దగ్గర తల్లిదండ్రులతో, బంధువులతో, స్నేహితులతో మాట్లాడినంత సహజంగా చురుకుగా పిల్లలు బడుల్లో మాట్లాడరు. ఇంగ్లీషులోని పాఠ్యపుస్తకాలూ, ఉపాధ్యాయుల పాఠాలూ కొత్తగా అనిపిస్తాయి. అందువల్లనే బహుశా పిల్లలు బడికి వెళ్ళడానికి మారాం చేస్తారు. వారికున్న స్వేచ్ఛ పూర్తిగా ఇంట్లో దొరుకుతుంది కాబట్టి ఇంట్లోనే ఉండడానికి పిల్లలు ఇష్టపడతారు.

**ఇంటిదగ్గర అమ్మనుడిలో పెరిగి, బడిలో ఇంగ్లీష్ మాధ్యమంలో చేరిన పిల్లల మానసిక స్వభావంలో, ప్రవర్తనలో, మాటల్లో, కొన్ని అసహజ లక్షణాలు కనిపిస్తాయి. తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ గమనించని ఈ లక్షణాలు పిల్లల్లో తెలియకుండానే క్రమేణా పెరిగిపోతూ ఉంటాయి. పిల్లల మానసిక ఎదుగుదలనూ, వ్యక్తిత్వ వికాసాన్నీ, భాషా కౌశలాలనూ, స్వేచ్ఛనూ మనసులో ఎక్కడో చీకట్లో మాటేసుకొని మింగేస్తున్న కృష్ణబిలం ఉంది.** పిల్లల్లో ఆ కృష్ణబిలం ఆకర్షించుకుంటున్న ఒక్కొక్క విషయాన్నీ విపులంగా తెలుసుకుందాం.

**ఏకాగ్రత**

పిల్లలకు ఇంటి భాషా- బడి భాషా వేరవడంతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఏకాగ్రతతో వినరు. ఇంట్లో అవ్వాతాతలూ, తల్లిదండ్రులూ, బంధువులూ చెప్పే కథలకు చూపిన ఆసక్తీ, ఏకాగ్రతా బడుల్లో ఉపాధ్యాయులు చెప్పే పాఠాల పట్ల ఉండదు. దానికి గల కారణం భాష వేరవ్వడమే. మాతృభాషలో వినే కథలకు ఉన్న భావనా, అందులో ఉండే భాష వలన కలిగే ఆకళింపు బడిలో ఉండే ఇంగ్లీషు భాషలో లేకపోవడంతో పాఠంలోకి పిల్లలను తీసుకెళ్ళలేకపోతారు. బడిలో కూర్చుని వినే అలవాటు కూడా పిల్లల్లో పెద్దగా ఉండకపోయేసరికి వారిని ఇంగ్లీషు భాష ఏకాగ్రతకి మరింత దూరం చేస్తోంది. ఇది ప్రాథమిక దశలో ఉన్న విద్యార్థుల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఏకాగ్రతను పరిశీలిస్తూ ఉంటారు. కానీ పిల్లల ఏకాగ్రత ఎందుకు పూర్తిగా ఇవ్వలేరో అర్థం కాకుండాపోతోంది.

**విషయావగాహన**

విద్యార్థుల ప్రతిభ అంతా విషయ అవగాహన మీదే ఆధారపడి ఉంటుంది. చిన్న వయసులో నేర్చుకునే పాఠాలు మస్తిష్కంలో ఇప్పటికీ నిలిచిపోయి ఉంటాయి. జీవితంలో ప్రతి దశలోనూ అన్వయించుకోవడానికి బడిలో చెప్పే విషయాలపై అవగాహన ఎంతో అవసరం. వారసత్వంగా వచ్చే అమ్మనుడిలో కాకుండా వేరే ఏ భాషలో బోధించినా విద్యార్థులకు సహజంగా ఉపాధ్యాయులు చెప్పే అంశాలు

అర్థం కావు. అందుచేత ఉపాధ్యాయులు వారు చెప్పే పాఠాలను పదే పదే పునరావృతం చేస్తూ ఉంటారు. ఒక చిన్న అంశాన్ని పిల్లల మెదడులోకి ఎక్కించడానికి ఉపాధ్యాయులకు ఎంతో శ్రమా సమయమూ పడతాయి. ఇక పిల్లలకు ఆ విషయం పైన పూర్తి అవగాహన లేకపోయినా బట్టీపట్టి నేర్చుకునే ప్రయత్నం చేస్తారు. దానిలో ఉండే అర్థం వారికి పూర్తిగా తెలియదు. వాటి ఫలితాలు మార్కులు రూపంలో కనిపించినా విషయంపట్ల అవగాహన ఎక్కడో చీకట్లోకి వెళ్లిపోతుంది.

### ఆత్మ విశ్వాసం

పిల్లలు, తరగతి గదిలో ఉపాధ్యాయులు అడిగే ప్రశ్నలకు ఎంత చురుకుగా సమాధానం చెబితే అంత ఏకాగ్రతతో విషయావగాహనతో ఉన్నారని అర్థం. పిల్లల ఆత్మవిశ్వాసం వారు విషయాన్ని చెప్పే తీరులో, రాసే రాతలో, ప్రవర్తనలో కనిపిస్తుంది. ఉపాధ్యాయులు చెప్పిన పద్యాలను కాని అంశాలను గాని తిరిగి ఉపాధ్యాయులకు అప్పచెప్పడంలో, విద్యార్థులతో గుంపుగా మాట్లాడే సందర్భాలలో ఆత్మవిశ్వాసం ప్రదర్శించబడుతుంది. ఆత్మవిశ్వాసానికి మూలం విషయావగాహన. వారు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలూ, చదువుకున్న పాఠ్యాంశాలూ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ఆ బోధనా పాఠ్యాంశాలూ వారి మాతృభాషలో లేనప్పుడు విషయ అవగాహన లేమితో ఆత్మవిశ్వాసం కుంటుపడుతుంది. అక్కడ ఏర్పడిన ఆత్మన్యూనతా భావం పిల్లల జీవితంలో ప్రతి దశలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. సమాజంలో తోటి వారితో సరైన సంభాషణలు చేయలేకపోతారు. జీవితంలో చురుకుదనం తగ్గుతూవస్తుంది. దేశానికి కావాల్సిన మంచి నాయకులు అవ్వలేరు. దీనంతటికీ కారణం - ప్రాథమిక దశలో విద్యార్థులకు ఉండవలసిన ఆత్మవిశ్వాసాన్ని ఏదో వెనక్కి లాగేసుకున్నది.

### ప్రేరణ

తొలిదశలో పిల్లలకు బడి వాతావరణం కొత్త కావడంతో విద్యార్థులకు చదువుకునేందుకూ పాఠాలు వినేందుకు సుముఖత చూపరు. పిల్లలు బడికి వెళ్లాలంటే ఏదో గొప్ప ప్రేరేపణ ఉండాలి. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థం కానప్పుడూ, చదువుతున్న పాఠాలు అర్థం కానప్పుడూ చదువును పక్కన పెట్టేస్తారు. అటువంటి సమయంలో విద్యార్థులు తమని తాము ప్రేరేపించుకోలేరు. తమ స్నేహితులు చదవడానికీ, పాఠాలు వినడానికీ ప్రేరేపణ ఇస్తే ఆ విద్యార్థి మరింత ఉత్సాహంగా చదవడానికీ బడికి వెళ్ళడానికీ ఇష్టపడతాడు. బడుల్లో ఇది జరగదు. దానికి గల కారణం ఇంటిభాష బడిభాష వేరుగా ఉండటం. తోటి విద్యార్థులకూ ఇంగ్లీషు మాధ్యమం వలన విషయావగాహన లేమితో తోటి విద్యార్థులను చదవడానికి ప్రేరేపించలేరు. బడి నుండి ఇంటికి వస్తే, బడిలో చెప్పిన పాఠాలను తల్లిదండ్రులూ బంధువులూ పిల్లలకు తిరిగి బోధించలేరు ఇంగ్లీషు రాకపోవడంతో. కాబట్టి ఇటు ఇంటిలో ప్రేరేపణ అందక, స్నేహితులు వైపు నుంచి ప్రేరేపణ అందకా విద్యార్థికి చదువుపట్ల ఆసక్తి తగ్గిపోతుంది.

### సృజనాత్మకత

మనిషి మనుగడకు ముఖ్య భూమిక సృజనాత్మకత. సృజనాత్మకతతోనే మనిషి అత్యుత్తమ స్థాయిలో పనిచేసి ఆదాయాన్ని సృష్టిస్తాడు. పిల్లలకు విద్య నైతిక విలువలను అందించేదే కాకుండా జీవన మార్గాన్ని కూడా చూపించేదిగా ఉండాలి. అది మాతృభాషా మాధ్యమ విద్య ద్వారా ఇంకా సులువుగా జరుగుతుంది. ప్రాథమిక దశలో పిల్లలు నేర్చుకునే విద్య తన తదుపరి జీవితానికి పునాదిగా ఉంటుంది. బడిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు పూర్తిగా అవగాహన చేయించితేనే ఆ అంశాలను క్రియాశీలకంగా ఆలోచించి తర్వాత దశలో వాటినుండి కొత్త ఆవిష్కరణలు చేయడానికి మాతృభాష మాధ్యమం ఎంతో తోడ్పడుతుంది. కానీ ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా సృజనాత్మకత కుంటుపడుతోంది. ఇంగ్లీషు మాధ్యమ విద్యలో పుస్తకాలలో ఇవ్వబడింది మాత్రమే నేర్చుకోవడానికి విద్యార్థులు బట్టీ పట్టాల్సి వస్తుంది. అది విద్యార్థులు రాసే పరీక్షల్లో ప్రతిబింబిస్తుంది. విశ్లేషణాత్మక సమాధానాలు రాయవలసిన ప్రశ్నలకు విద్యార్థులు పూర్తిగా పుస్తకాల్లో ఉన్నది ఉన్నట్టుగా నామమాత్రంగా సమాధానాలు రాస్తారు. ఈ విషయం ఉపాధ్యాయులకు అందరికీ తెలుసు. కానీ మౌనం పాటిస్తారు. వాక్య నిర్మాణంలో సృజనాత్మకత ఎంత మాత్రమూ ఉండదు. **భాషలోలేని సృజనాత్మకత భావాల్లో ఉండదు. విద్యార్థులు నైపుణ్యాలను సాధించలేరు. ఫలితంగా నిరుద్యోగ సమస్య దేశంలో పెరుగుతూనే ఉంది. ఇండియా నైపుణ్యాల నివేదిక ప్రకారం 45.9 % యువత మాత్రమే ఉద్యోగానికి అర్హులుగా పరిగణించబడతారు అని తేల్చింది. ఉద్యోగ వ్యాపారాలలో 63% అక్షరాస్యులు నైపుణ్యాలు లేకపోవటంతో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. నైపుణ్యాల లేమికీ నిరుద్యోగానికీ మన చదువుల్లో సృజనాత్మకత లోపించడం కారణం కాదంటారా? దేశాన్ని దరిద్రంలోకి నెట్టే చీకటి శక్తి ఇంగ్లీషు మాధ్యమం కాదంటారా? దేశంలో స్వార్థ శక్తుల వలన విద్యానాణ్యత తగ్గడం ఒక కారణమైనా, ఇంగ్లీషు విద్యామాధ్యమం ప్రధాన కారణం. దేశంలో కోట్ల మంది విద్యార్థులు చదువుకుంటున్నా వారి సృజనాత్మకత ఏమవుతున్నట్టు?**

### సంస్కృతి

ఒక దేశంలో లేదా రాష్ట్రంలో ప్రజలు సమిష్టిగా పనిచేసి ఏర్పరచుకున్న జ్ఞానమూ, విలువలూ, వస్తువులూ, ఆహారపుటలవాట్లూ, పలు భాషలూ, ఆచార వ్యవహారాలూ, సామాజిక ప్రవర్తనా మొదలగు వాటి సమాహారమే సంస్కృతి. మనిషినీ సంస్కృతినీ వేరు చేయలేం. ఒక మనిషి ఉపయోగించే భాషలో భావాలలో సంస్కృతి అంతర్లీనంగా జతచేయబడి ఉంటుంది. పిల్లలు గర్భస్థ శిశువుగా ఉన్నప్పటినుండి ఆ సంస్కృతికి అలవాటు పడి ఉంటారు. పుట్టిన తర్వాత చూసే ప్రతి వస్తువూ, మనుషుల ప్రవర్తనా మొదలగునవి అన్నీ కూడా పిల్లల ప్రతి కణంలోకి వెళ్లిపోతాయి. పిల్లలు పెద్ద అయి వివిధ సంస్కృతులను ఆనందించి ఆస్వాదించినప్పటికీ తన స్వీయ సంస్కృతికి ప్రతినిధులే. పిల్లలు తమ సొంత సంస్కృతిని ఎంత వివరంగా తెలుసుకుంటారో, అంత జ్ఞానాన్ని సంపాదించి ఆ సమాజానికి సేవ చేయగలుగుతారు. కానీ దీనికి భిన్నంగా ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా పిల్లలకు వారు పెరిగిన సంస్కృతికి దూరంగా పాఠ్యాంశాలు ఉండడం వల్ల పాఠ్యాంశాలను త్వరగా అన్వయించుకోలేరు. దీని ద్వారా పిల్లలకు

వారసత్వంగా వచ్చిన జ్ఞానాన్ని ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా నేర్చుకోలేక వైరుధ్యాలతో చీకటి బతుకుల్లోకి జారిపోతారు.

### మాతృభాష

పిల్లలకు వారసత్వంగా వచ్చే భాషను మాతృభాష అంటారు. మనసుకి ఎదుగుదలకు సమాజాన్ని సంస్కృతిని అర్థం చేసుకోవడానికి మాతృభాష ఎంతో సహకరిస్తుంది. పిల్లల మొదటి రెండు సంవత్సరాల్లోనే మాతృభాషలో అనేక పదాలను తెలియకుండానే వాళ్ళు సులభంగా నేర్చుకుంటారు. భాషలోని పదాలను నేర్చుకుంటున్నారు అంటే భాషలోని భావాలని వాటి సందర్భాలను నేర్చుకుంటున్నారని అర్థం. పిల్లలకు ఎంత పదసంపద పెరిగితే అది వారి వికాసానికి సూచనగా ఉంటుంది. బాసిల్ వి బెర్న్‌స్టెన్ (1964) చెప్పినట్లు పిల్లలు తమ మాతృభాషలో విషయాలను ఎక్కువ పద సంపదతో, ఎక్కువ సందర్భాలలో వివరణాత్మకంగా మాట్లాడగలరు. బడిలో పిల్లల్ని చేర్చినప్పుడు వారి ప్రాథమిక దశలో మాతృభాష మాధ్యమం ద్వారా విద్యను నేర్పించినట్లయితే త్వరగా, సులువుగా నేర్చుకోవడానికి ఆస్కారం ఉంటుంది. పిల్లలు తాము తమ మాతృభాషలో నేర్చుకున్నట్లయితే నేర్చుకునే విద్యకూ, దైనందిన జీవితంలో చూస్తున్న సమాజానికీ సంబంధాన్ని కలిగి ఉంటారు. ఆ విధంగా కాకుండా ఇంగ్లీషు మాధ్యమం ద్వారా పిల్లలకు మన సంస్కృతికి సంబంధించిన పాఠ్యాంశాలు బోధించినప్పుడు వారికి భాష అర్థం కాక వారి మస్తిష్కంలో అవి పొసగవు. సంవత్సరాలు గడిచిన తర్వాతకూడా పిల్లలు విషయ అవగాహన లేమితో మాతృభాషలో విషయాలను చెప్పలేకా ఇటు ఇంగ్లీషులోనూ చెప్పలేకా సతమతమవుతుంటారు. నేడు అనేక మంది విద్యార్థులు భాషా సమస్యతో పోరాడుతున్నారు. ఇంగ్లీష్ మీడియం ద్వారా ఆత్మవిశ్వాసంతో పాఠ్యాంశాలను వ్రాత పరీక్షల్లోనూ, మౌఖిక పరీక్షలోనూ రాయలేక విఫలమవుతున్నారు. స్వేచ్ఛగా ఆత్మవిశ్వాసంతో మాతృభాషలో నేర్చుకోవాల్సిన విద్యను పక్కనుబెట్టి ఇంగ్లీషు మాధ్యమంతో మాతృభాషలోని కౌశలాలను చీకట్లో బంధించివుంచుతారు అన్నమాట.

### పరిశోధనల సారాంశం

అలియు ఫఫున్వా బాబ్స్ (1970–1978) ఈ మధ్యకాలంలో నైజీరియాలో ఏ భాషలో చదువుకున్న పిల్లలు ఎక్కువ నైపుణ్యాలను ప్రదర్శిస్తారో తెలుసుకునేందుకు ఒక పరిశోధన చేశారు. నైజీరియా కూడా మన దేశం లాగే బహు భాషలు కలిగిన దేశం. ఆ కాలంలో సుమారు 10 కోట్ల జనాభా కలిగివుండేది. అందులో మూడు కోట్ల మంది హౌసా భాషనూ, ఒక కోటి నలభై లక్షల మంది ఇగ్బో భాషనూ, సుమారు ఒక కోటి యాభై లక్షల మంది యోరుబా భాషనూ, మీడియాలో అక్కడక్కడా మరి కొన్ని భాషలు మాట్లాడేవారు. నైజీరియా కూడా బ్రిటిష్ వలసపాలనలో 1856 – 1960 వరకూ ఉన్నవారే. నైజీరియాలో బ్రిటిష్ పాలన రాకముందు వారి విద్యావ్యవస్థ వారి మాతృభాషలోనే జరిగేది. వారి విద్యా వ్యవస్థలో బాధ్యతా, నైపుణ్యాలూ, పని విలువలూ, రాజకీయ భాగస్వామ్యమూ, ఆత్మీయ నైతిక విలువలపై ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చేవారు (ఫఫున్వా బాబ్స్ 1989:3). కానీ బ్రిటిష్ తెచ్చిన ఇంగ్లీష్ విద్యతో వాటన్నిటికి కాలం చెల్లింది. నైజీరియాలోని ఐఫేలో పిల్లల్ని ఇంగ్లీష్ మీడియంలో, యెరుబా మీడియంలో, చదివిన వారిని మూడు గుంపులుగా విభజించి చేసిన పరిశోధనలో యెరుబా మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఇంగ్లీష్ మాధ్యమంలో చదివిన విద్యార్థులకంటే మెరుగైన ప్రతిభను కనబరుస్తున్నారని తేలింది. దీనితో పిల్లలు మొదటి 12 సంవత్సరాలు మాతృభాషలో విద్యను అభ్యసించాలని సూచించారు. మాతృభాషలో చదివిన వాళ్లు ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన వారి కంటే ఇంగ్లీష్ లో కూడా ఎక్కువ ప్రతిభను కనపరిచారని ఈ ప్రాజెక్టు నివేదికలో తెలిపారు. అందరికీ సమాన హక్కుల కోసం సమాన విద్య కోసం మాతృభాషలు విద్యా మాధ్యమాలుగా ఉండాలని తద్వారా సాంఘిక అసమానతలు తొలగుతాయని అలియు ఫఫున్వా బాబ్స్ తన పరిశోధనలో పేర్కొన్నారు.

సెనెగల్‌లో డాక్టర్ గ్రీన్‌ఫీల్డ్ తమ లాబరేటరీలో చేసిన పరిశోధనలో అక్కడ స్థానిక భాష అయిన వొలోఫ్‌లో ఊహించే ఆటల ప్రయోగంలో అక్కడి ఆధిపత్య భాష అయిన ఫ్రెంచిలో కంటే ఎక్కువ ప్రతిభను కనబరిచారని ఆ ప్రయోగంలో తేలింది.

రిచర్డ్ రూయిజ్ (1984) చేసిన పరిశోధనా రచనలలో అమెరికాలోని ఏక భాషా విద్యా విధానం ద్వారా అక్కడి మెక్సికన్ అమెరికన్లు బలవంతంగా వారి సంస్కృతిని విలీనం చేసే విధంగా చేశారని పేర్కొన్నారు. అటువంటి విద్యావిధానంలో 'మెక్సికన్–అమెరికన్' విద్యార్థుల ఆలోచనా విధానం మారిపోయిందని తెలిపారు. దాని ఫలితంగా సాంస్కృతిక గుర్తింపును కోల్పోతూ భాషాపరమైన ఆందోళనకు గురి అవుతారని తెలిపారు. దాని ఫలితంగా ద్విభాషా విధానంలో వారు విద్యనభ్యసించినప్పటికీ, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉండడంతో ఇంగ్లీషు భాషా ఆధిపత్యంతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మన్యూనతా భావానికి గురవుతున్నారని సూచించారు. దీన్ని గుర్తించి అమెరికాలోని కోర్టు కూడా అమెరికాలోని విద్యావిధానం కేవలం ఇంగ్లీషు మాట్లాడే అమెరికన్ల కోసం మాత్రమే ఉపయోగ పడుతుందని దానివలన మెక్సికన్ అమెరికన్లు 'సాంస్కృతిక అసమర్థతకు' గురవుతున్నారని తేల్చింది. పేదరికమూ, పోషకాహార లోపమూ, విద్యా లేమి మొదలగు లక్షణాలు సాంస్కృతిక భాషా సంబంధంతో ముడిపడి ఉన్నాయని తెలిపింది (డెల్ వల్లే 1981:1).

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారు (2016) 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' పుస్తకంలో విద్యాబోధన మాతృభాషలో జరగడం సహజమనీ అధిక జనాభా మాట్లాడే భాషను వదిలి ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందించడం అప్రజాస్వామికమని అశాస్త్రీయమని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు అంటూ ఇంగ్లీషు మాధ్యమ భాషావిధానాన్ని ప్రభుత్వాలు అమలు పరచడం అశాస్త్రీయ ధోరణేగాక ఒక భ్రమగా పరిగణించారు. ఇంగ్లీషు మాధ్యమ విద్య కారణంగా తెలుగు రాష్ట్రాలలో 30 శాతం నుంచి 35 శాతం మంది విద్యార్థులు ప్రాథమికోన్నత స్థాయిలో ఇంగ్లీషు భాష అర్థం కాక చదువులో వెనుకబడి బడిని మానేస్తున్నట్లు గణాంకాలతో నిరూపించారు. అయితే మనిషి చేసే ప్రతి పనిలో శ్రమ ఉంటుందని శ్రమకు ఆధారం జ్ఞానం అని తెలిపారు. ఈ జ్ఞానం అనుభవంతోనో చదువు కోవడంతోనో వస్తుందని వీటిలో ఉపయోగిస్తున్న భాష ప్రధాన పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలోనూ, వ్యాపార రంగాలలోనూ

భారతీయ భాషల వాడుకకు ఉన్న సహజ సంబంధాన్ని చూపిస్తూ భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి పనిస్థలాలలో భారతీయ భాషల వాడుక నుండి వస్తుందని గణాంకాల ఆధారాలతో చూపించారు. ఆర్థిక కార్యకలాపాలలో మాతృభాష 89.67 శాతం, ఇంగ్లీషు కేవలం 10.33 శాతం ఉపయోగిస్తున్నారని ఆధారాలతో నిరూపించారు.

### ఆర్థిక ప్రగతికి మాతృభాషా మాధ్యమం

జ్ఞాన సృజన అనేది ఒక దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించడానికి ఎంతో సహకరిస్తుంది. ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా ప్రజలకు స్వయం సమృద్ధిని కలిగించడమే అభివృద్ధికి సూచన. ఈ స్వయం సమృద్ధి ప్రజలను వారి కాళ్ళ మీద వాళ్ళని నిలబడేటట్టు మాత్రమే చేయకుండా, దేశాన్ని ఆర్థిక ప్రగతిలోకి నడిపిస్తుంది. దీనికి పునాదులు వేయగలిగేది మంచి విద్యా వ్యవస్థ ద్వారా మాత్రమే. కానీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా మన దేశం యొక్క పాఠశాల విద్య నాణ్యత ఇంకా ఆశించినంతగా లేకపోవడం విచారకరం. 2018లో ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన విద్య నాణ్యత కొలత నివేదికల్లో భారతదేశ స్థానం 355. అంటే మన చుట్టుపక్కల ఉన్న చిన్న చిన్న దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న విద్యానాణ్యత కంటే తక్కువ అని తెలిసింది. మన దేశంలోని తల్లిదండ్రులు కొంతమంది విద్యార్థులు ఇంగ్లీషు వ్యామోహం నుంచి బయట పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ముగింపు

సమాజంలో నేటి వరకు అధికార దాహమూ, స్వార్థమూ, ఆధిపత్యధోరణీ వంటి చీకటి లక్షణాలను కొందరిలో చూసి ఉంటాం. వారు ప్రత్యక్షంగా దేశ అభివృద్ధికి అవరోధం అయినప్పటికీ, మనకు తెలియకుండానే మనలను ప్రగతిపథంలోకి నడిపించకుండా ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా పిల్లల్లో, యువతలో కృష్ణబిలాలను పెంచి పోషిస్తున్నారన్నమాట. తమ జీవితానికీ దేశానికీ ప్రత్యక్షంగా ఉపయోగపడే గొప్ప లక్షణాలైన ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, సృజనాత్మకత, సాంస్కృతిక జ్ఞానం మొదలగు వాటిని ఇంగ్లీష్ విద్య చాపకిందినీరులా తెలియకుండా మింగేస్తోంది. **జీవన వికాసానికీ దేశ అభివృద్ధికీ అవరోధమైన ఈ కృష్ణబిలాలను మూసి వేయాలంటే మాతృభాషలో విద్య తప్పనిసరి. మన సమాజంలో ఉన్న ఈ చీకటి కోణాన్ని అర్థం చేసుకుని శాస్త్రీయమైన ఆలోచనా దృక్పథంతో మాతృభాషలో విద్యావిధానాన్ని అమలుపరచాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రభుత్వం కూడా పైన పేర్కొన్నట్లుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న భాషా సమస్యలను పరిగణనలోకి తీసుకొని వాటికి తగిన భాషా విధానాన్ని రూపొందించి, విద్యార్థులకు మాతృభాషలో విద్యను అందించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్యనూ, సదుపాయాలనూ అందించాలి.**

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

## 8 వ పుట తరువాయి.....

చెదులు తెలుసుకుని వాటి విస్తృత ప్రచారం చేయాలి.

ఏఐసీటీఈ లాంటి కేంద్ర సంస్థలు తూతూ మంత్రంగా హిందీలో ఇంజనీరింగ్ అమలైతే అన్ని భాషల్లో అమలవుతున్నట్టు భ్రమిస్తాయి. అందుకని రాష్ట్ర స్థాయిలో ఇరు తెలుగు రాష్ట్రాలలోని ఉన్నత విద్యా శాఖ మంత్రులు, అధికారులు తెలుగులో ఇంజనీరింగ్ అమలుపై దీర్ఘకాలిక మన్నిక ఉండే చర్యలు చేపట్టాలి.

తెలుగులో ఇంజనీరింగ్ చదువుతున్న, చదవబోయే విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఉండాలి. వందల ఏళ్ళ సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్ అంశాలు, గత రెండు మూడు దశాబ్దాలలో విప్లవంలా వచ్చిన ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సైన్స్ అంశాలు అన్నీ విద్యార్థులకు తెలుగులో సులువుగా అందుబాటులో ఉండేలా వనరులను రూపిందించే దిశగా ముందు విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర విద్యా మంత్రిత్వశాఖ వారు పని మొదలుపెట్టి చొరవ తీసుకుని పూర్తి చేయాలి.

తెలుగులో ఇంజనీరింగ్ బోధన అందిస్తే అదనంగా 60 సీట్లు ఇస్తామని యాజమాన్యాలకు ఏఐసీటీఈ తాయిలం ఇచ్చినా, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం ఒకే ఒక్క కళాశాల(ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాల, ఆగిరిపల్లి) తెలుగులో ఇంజనీరింగ్ బోధించేందుకు ముందుకు వచ్చింది. ఆ సంస్థ కూడా ఒక్క కంప్యూటర్ సైన్స్‌లో మాత్రమే తెలుగులో ఇంజనీరింగ్ అమలుకు నడుం బిగించింది.

ఇప్పటికే ఇంజనీరింగ్ పోటీ పరీక్షలతో పాటుగా జాతీయ స్థాయి పోటీ పరీక్షలు తెలుగులో కూడా ఉన్నాయి. జేఈఈ(మెయిన్స్) పరీక్ష తెలుగులో రాస్తున్న విద్యార్థులున్నారు. వేలల్లో ఉన్న వీరికీ, పదుల్లో ఉన్న తెలుగులో ఇంజనీరింగ్ అందుబాటులోకి వచ్చిన సంఖ్యకూ నిష్పత్తిలో అస్సలు పొంతన లేదు.

ప్రాథమిక విద్య స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేసే యత్నంలో ఉన్న రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలు, కేంద్రం నుంచి మాతృభాషలో పై స్థాయి విద్యలన్న ముసుగులో హిందీ భాషకు ఇస్తున్న ప్రాధాన్యత – వీటి నడుమ తెలుగు కచ్చితంగా నిలదొక్కుకుని సాంకేతిక భాషగా పైకెదుగుతుందని ఆశించగలమా?!

మరొక ముఖ్యమైన విషయం: ఇంజనీరింగ్ విద్య అనేది పుస్తకాలలో చదువుకున్న చదువులను మానవత్వానికి, సమాజానికి ఉపయోగపడేలా అమలులో పెట్టడం. ముఖ్యంగా భారతీయ సమాజంలో, మన తెలుగు రాష్ట్రాలలో ఉన్న సమస్యలకు సమాధానాలుగా సాంకేతికతలు పనికి రావాలి. అలా జరగాలంటే, ఇక్కడి సమస్యలను అధ్యయనం చేసే పాఠ్యపుస్తకాలు మనం రాసుకోగలగాలి. ఇంజనీరింగ్ విద్యను భారతీయ భాషల్లో బోధించదలచుకుంటే, పాశ్చాత్యులో, మనవారో ఆంగ్లంలో రాసుకున్న పుస్తకాలను అనువాదం చేస్తే మాత్రమే సరిపోదు. ఇక్కడి అవసరాలకు తగ్గట్టు కొత్త పుస్తకాల సృజన కూడా జరగాలి. పాశ్చాత్యులు రాసిన ఆంగ్ల పుస్తకాలకు దీటుగా మన పాఠ్యపుస్తకాలు చేరాలంటే అనువాదంతో సరిపెట్టుకోకుండా అనుసృజన వైపు, సృజన వైపు అడుగులు వేయాలి.

ఎ.రజాహుస్సేన్
90631 67117

# విజయవంతంగా జరిగిన 'తాపీ ధర్మారావు పురస్కార' ప్రదాన సభ



సెప్టెంబర్18 వ తేదీ, శనివారం నాడు హైదరాబాద్‌లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల'లోని సమావేశ మందిరంలో జరిగిన "తాపీ ధర్మారావు పురస్కార" ప్రదాన సభకు జయధీర్ తిరుమలరావు అధ్యక్షత వహించారు.



ప్రతి యేటా ఇచ్చే తాపీ ధర్మారావు పురస్కారాన్ని 2020 సంవత్సరానికి గాను ప్రముఖ పరిశోధక కవి, అనువాదకులు, 'యల్లపు ముకుంద రామారావు' గారికి ఇవ్వాలని నిర్వాహకులు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈమేరకు సభలో ముకుంద రామారావు గారికి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ...

"సమాజంలో శాస్త్రీయ. భౌతికభావవాద రచనలు రావాల్సిన అవసరం వుందన్నారు. అలాంటి రచనలు చేసిన వారిలో తాపీ ధర్మారావు గారు ముందుంటారని ఆయన చెప్పారు. సమాజాన్ని ప్రభావితం చేసిన తాపీ ధర్మారావు గారి మేధావి రచనలపై విస్తృతంగా పరిశోధనలు జరగాలన్నారు. ప్రస్తుతం యాంత్రికంగా తయారైన సమాజంలో తాపీ ధర్మారావు గారి లాంటి వారి స్ఫూర్తి దాయక రచనలు రావాల్సిన అవసరముందన్నారు. ఇలాంటి రచనలు వచ్చిన నాడే మన సమాజం ఒక మెట్టు ఎదుగుతుందన్నారు. తాపీ వారి భావజాలంతో ఇతోధికంగా పుస్తకాలురావలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఇందుకు రచయితలు నడుం కట్టాలన్నారు. 2020 సంవత్సరానికి గాను తాపీ ధర్మారావు పురస్కారాన్ని పరిశోధక కవి, అనువాదకులు, ముకుంద రామారావు గారికి ఇవ్వడం సముచితంగా వుందన్నారు. మాతృభాషల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాల్సిన అవసరముందని ఆచార్య జయధీర్ తిరుమలరావుగారు పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వాల భేషజాల వల్ల మన మాతృభాషలకు పెనుముప్పు పొంచి వుందని ఆయన హెచ్చరించారు.. మాతృభాషల పరిరక్షణకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



సభకు విశిష్ట అతిథిగా హాజరైన జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు గారు మాట్లాడుతూ, తాపీ ధర్మారావు గారిని మించి ఆయన పుస్తకాలు ప్రాచుర్యం పొందాయన్నారు. పెళ్ళి, దాని పుట్టు పూర్వోత్తరాలు గొప్ప పరిశోధక పుస్తకమన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి తాపీ ధర్మారావు గారి పేర పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. తాపీ ధర్మారావుగారి స్ఫూర్తిని యువతరం అందిపుచ్చుకునేలా కృషి చేయాలన్నారు. తాపీ ధర్మారావు పురస్కారానికి సోషల్ మీడియాలో కృషిచేస్తున్న వారిని కూడ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

తాపీ ధర్మారావు భావజాలాన్ని ముందుకు తీసుకుపోతున్న సామల రమేష్‌బాబు కృషిని ఆయన కొనియాడారు. ఎన్ని కష్టాలు వచ్చినా, తట్టుకొని నిలబడి 'అమ్మనుడి' పత్రిక ద్వారా, భాషా పరిరక్షణ ఉద్యమాల ద్వారా తెలుగు భాషాభివృద్ధికి సామల రమేష్‌బాబు చేస్తున్న కృషి అనితర సాధ్యమని ప్రశంసించారు.

పురస్కార గ్రహీత ముకుంద రామారావు గారి జీవితం, రచనల గురించి డాక్టర్ ఏ.కె ప్రభాకర్ గారు సభకు పరిచయం చేశారు. ప్రాచీనతలో కూడా ఆధునికతను జోడించిన వారికి తాపీ ధర్మారావు గారి స్మారకంగా ఇస్తున్న ఈ పురస్కారాన్ని ముకుంద రామారావు గారికివ్వడం సముచితమన్నారు. ఆయన కవిగా సాహితీ ప్రస్థానాన్ని

మొదలు పెట్టి, పరిశోధకుడిగా, అనువాదకుడిగా రూపాంతరం చెందిన విధం చాలాగొప్పగా వుందన్నారు.



ముకుంద రామారావు గారి జీవితం చాలా చిత్రమైన మలుపులు తిరిగి తిరిగి చివరకు సొంతనేలకు చేరింది. ఆయన తండ్రి సౌత్ ఆఫ్రికాలో పుట్టారు. ముకుంద రామారావుగారు పశ్చిమ బెంగాల్‌లో పుట్టారు. ఏడెనిమిది రాష్ట్రాలుతిరిగారు. ఏడెనిమిది భాషలు నేర్చుకున్నారు. ఆయన 'వలస జీవితం..', 'ఘర్ వాపసీ' అంతా ఓ కథలా వుంటుందన్నారు. సూఫీ కవిత్వాన్ని ఆయన తెలుగు నేలకు పరిచయం చేశారని చెప్పారు.

ఆయన రైల్వేలో కంప్యూటర్ ఇంజనీర్. తెలుగులో చదివింది 8 వ తరగతే. ఆయన చదువంతా ఇంగ్లీషు మీడియంలోనే జరిగింది. (Mse ,DIIT ,PGD CS ) అయితే వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ వుండటం వల్ల తెలుగు, ఇంగ్లీషు, హిందీతో పాటు కన్నడం, బెంగాలీ, తమిళం, మలయాళీ, ఉర్దూ, మరాఠీ భాషల్లో కూడా ప్రవేశం సంపాదించారు. బహుభాషలు తెలియడం వల్ల వివిధ భాషల నుంచి అనువాదాలు చేయగలిగారని తెలిపారు.

"అదే గాలి"..."అదే ఆకాశం".."అదే నేల" పేర్లతో ప్రపంచ దేశాల కవిత్వంతో పాటు భారతీయ కవిత్వాన్ని ఔపోసన పట్టారు. వివిధ భాషల్లోని కవిత్వాన్ని (లిఖిత, ..లిపి లేని ఆదివాసీ కవిత్వం) తెలుగులోకి అనువదించారు. భాషావిషయికంగా ముకుంద రామారావు ప్రజాస్వామ్యవాది అన్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ, స్థానిక, ప్రాంతీయ భాషలపట్ల ముకుంద రామారావు దృక్పథం చాలా గొప్పగా వుందన్నారు. అదే నేలలో ఈ విషయాన్ని గమనించవచ్చని చెప్పారు. ముకుంద రామారావు స్వతహాగా కవి అయివుండి కూడా ఎక్కువగా సొంత కవిత్వం రాసుకోకుండా ఇతర కవుల కవిత్వాన్ని తెలుగు భాషలోకి అనువదించడానికే ప్రాధాన్యమిచ్చారని ప్రశంసించారు. ప్రపంచ దేశాలతో పాటు భారతీయ కవిత్వ మధురిమల్ని తెలుగువారికి చేరువ చేసిన వారిగా... ముకుంద రామారావు గారు గుర్తుండి పోతారన్నారు.

రచనలు:

1.వలసపోయిన మందహాసం 1995 2.మరో మజిలీకి ముందు 2000 3.ఎవరున్నా లేకున్నా 2004 4.నాకు తెలియని నేనెవరో 2008 5.నిశ్శబ్దం నీడల్లో 2009 6.విడని ముడి 2013 7.ఆకాశయానం 2014 8.రాత్రి నదిలో ఒంటరిగా 2017

స్వీయ అనువాద రచనలు:

1.అదే ఆకాశం..అనేక దేశాల అనువాద కవిత్వం 2010 2.శతాబ్దాల సూఫీ కవిత్వం 2011 3.1901 నుండి నోబెల్ కవిత్వం (కవుల కవిత్వం..జీవిత విశేషాలు ) 2013 4.1901 నుండి సాహిత్యంలో నోబెల్ మహిళలు 2015 5.అదే గాలి..ప్రపంచదేశాల కవిత్వం 2016 6.భరతవర్షం. సీతాకాంత మహాపాత్ర ఒరియా కావ్యానికి తెలుగు అనువాదం 2017 7.చర్యాపదాలు..(అనేక భాషల ప్రథమ కావ్యం) 10. శతాబ్దపు మహాయాన బౌద్ధుల నిర్వాణ గీతాలు 2019 8.అదే నేల (భారతీయ కవిత్వం..నేపథ్యం.2019)

ఇతర భాషల్లోకి అనువాదాలు:

1.వలస హోద మందహాస ..కన్నడ2005 2.The smile that migrated and other Poems..2011

కథలు..ఎట్సెట్రా :

1.దేశదేశాల కప్పులు కథలం 2010 2. నిన్ను నువ్వు చూసుకునే అద్దం 2015 3.వ్యక్తిత్వ వికాసం. ఆనందమార్గాలు, వ్యాసాలు.. 2018 4.అనువాదం.. అనుభవాలు 2019

ప్రచురణలో వున్నవి:

1.మిణుగురులు..టాగోర్ Fire filesకు తెలుగు అనువాదం 2.ఇసుక నురగ.. ఖలీల్ జిబ్రాన్ అనువాదం 3. అనామిక ప్రతిబింబాలు ప్లవాహం టాగోర్ నమ్మాలా రేఖా నాథ్ బెయెకు తెలుగు అనువాదం. 4.అదే ఆకాశం ఎక్కడైనా? ప్రపంచ వ్యాప్త కవుల పరిచయం 5.నా ఇల్లెక్కడ? కథల సంకలనం 6.ఆసక్తి..వ్యాస సంకలనం 7.విశ్లేషణ..సమీక్షలు..సమాలోచనలు.

ఇవి కాకుండా ఆంగ్లం, హిందీ, ఉర్దూ, బెంగాలీ, కన్నడం, తమిళం, మలయాళం మరాఠీ భాషల్లోకి ఎన్నో కవితల అనువాదాలు.. కవితలు. ఆంగ్లకవితలు, వ్యాసాలు, సమీక్షలు లెక్కకు మించి ప్రచురింపబడ్డాయి. వాటి వివరాలన్నీ ఇక్కడ చెప్పడానికి సమయం సరిపోదని చెప్పారు.



సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.రవీందర్ గారు మాట్లాడుతూ..సైన్స్ నేపథ్యం నుంచి వచ్చిన ముకుంద రామారావుగారు. దేశంలోని వివిధ భాషల కవితల్ని ఒకే పుస్తకంలో తీసుకురావడం చాలా గొప్ప విషయమన్నారు. వయస్సు మీద పడుతున్నా చాలా గొప్ప రచనలు చేస్తున్న 'ముకుంద రామారావు' గారిని ఆయన అభినందించారు.



మరో అతిథి ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు జనసందోహానికి తార్కికపద్ధతిలో ఆలోచించడం, హేతువాద దృక్పథాన్ని ఆచరించడాన్ని తాపీ ధర్మారావు గారు మనకు అందించారు. అలాంటివారి పేర ఇస్తున్న పురస్కారం ముకుంద రామారావు గారి లాంటి పరిశోధక కవి, అనువాదకుడికి ఇవ్వటం సముచితమన్నారు. ప్రపంచీకరణలో అడుగంటి పోతున్న 700 మాతృభాషల్ని ఒడిసిపట్టుకొని "అదేనేల" అనే బృహత్ పుస్తకంగా అందించడం చాలా గొప్ప విషయమన్నారు. మాతృభాష పరిరక్షణోద్యమాన్ని మరింతముందుకు తీసుకు వెళ్ళాల్సిన

అవసరముందన్నారు.

తెలంగాణ ప్రాంతానికి చెందిన కోయ కవయిత్రి 'పద్దం అనసూయ' మౌఖిక కోయ భాష కవితను ముకుంద రామారావు గారు ఎలా అనువదించారో ఆయన చదివి వినిపించారు.

"రూపం అదే/ ఆత్మ పరాధీనమైంది/ నేనిప్పుడు /మైదానం ముందు మోకరిల్లిన సాంస్కృతిక

దుఃఖాన్ని/ భాష అదే / అక్షరం అంటరానిదైంది / నేనిప్పుడు / అస్తిత్వాన్ని కోల్పోయిన మౌఖికాన్ని"



ముకుందరామారావు గారి అనువాదం స్వతంత్ర రచనలా అనిపిస్తుంది. ఇతర భాషా కవుల కవిత్వంలో పరకాయప్రవేశం చేయడం వల్ల ఆయన అనువాదంలో తెలుగుభాషా పరిమళం మరింత గుబాళిస్తోందని ఆయన ప్రశంసించారు.

కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పి.పూర్ణచంద్రరావు గారు మాట్లాడుతూ... సమాజంలో స్ఫూర్తిదాయక రచనలు రావలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

సభలో తాపీ ధర్మారావు గారి 'పురస్కారాన్ని' యల్లపు ముకుంద రామారావు గారికి అందజేసే సందర్భంగా ముకుందరామారావు గారికి మన్నన పత్రాన్ని శ్రీమతి కన్నెగంటి అనసూయ గారు చదివి వినిపించారు.

పురస్కార గ్రహీత వై.ముకుంద రామారావు గారు తనకు జరిగిన సన్మానానికి నిర్వాహకులకు, సభికులకు, అతిథులకు



కృతజ్ఞతలు తెలిపారు. అదేనేల పుస్తక రచన జరిగిన తీరును, అందుకోసం పడిన కష్టాలను ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. కొన్ని భాషల్లోని ఆత్మను ఆత్మీయంగా తీసుకొని ఈ రచన చేశానన్నారు.

తొలుత తాపీ ధర్మారావు పురస్కార నిర్వాహక కర్త, అమ్మనుడి ముఖ్య సంపాదకుడు డాక్టర్ సామల రమేష్‌బాబు సభకు స్వాగతం పలుకుతూ తాపీ ధర్మారావు గారి పేరిట ఇస్తున్న పురస్కారాలలో ఇది తొమ్మిదవదని, 2020లోనే దీనిని ప్రకటించామని, ఐనా కరోనా విజృంభణ కారణంగా వాయిదా పడతూవచ్చిందనీ నేటికి ఈ పురస్కారాన్ని అందించగలుగుతున్నందుకు సంతోషపడుతున్నామని అన్నారు. 2021 పురస్కారాన్ని త్వరలోనే ప్రకటించే ప్రయత్నం చేస్తున్నామని తెలియజేశారు. అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. వారికి శ్రీమతి కన్నెగంటి అనసూయ, డా॥కోయి కోటేశ్వరరావు, జె.డి.ప్రభాకర్, తదితరులు పుష్పగుచ్ఛాలను, పుస్తకాలను ఇచ్చి సత్కరించారు. సభ చివరిలో పురస్కార గ్రహీతకు, అతిథులకు, వేదికను ఇచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ గారికి, ముఖ్యకార్యకర్తలకు జ్ఞాపికలను అందచేశారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సుమారు రెండు గంటలపాటు ఈ సభ జరిగిన తీరు హుందాగా వుండటం విశేషం.

మన్నన పత్రం : పుట 23, పురస్కారం: పుట 24
పురస్కార గ్రహీత ప్రసంగం : పుట 25





తాపీ ధర్మారావు

కనువెలుగు : 19-09-1887
కనుమరుగు : 08-05-1973

**జనమాధ్యమాలను జనం మధ్యకు తెచ్చిన వ్యక్తిగా తాపీ ధర్మారావు తెలుగుజాతి చరిత్రలో చిరస్మరణీయ స్థానాన్ని పొందారు. పాత పాళీలను తొలగించి కొత్త పాళీలను తొడిగి జనం భాషను జనసామాన్యానికి అందుబాటులోకి తెచ్చిన అరుదైన సంపాదకుడు. పత్రికా రంగానికి, సినిమా రంగానికి ఆయన చేసిన సేవ సాటిలేనిది. కవి, పండితుడు, విమర్శకుడు, వ్యాఖ్యాత, నాటకకర్త, హేతువాది, పత్రికా సంపాదకుడు, సినీ రచయిత, సంస్కర్త, ఉద్యమకారుడు తాపీ ధర్మారావు. జనమాధ్యమాల వినియోగంలో తన కలాన్ని పరాక్రమింపజేసిన ఒక పాత్రికేయుడిని / రచయితను/ కవిని ప్రతి ఏటా తాపీ ధర్మారావు స్మారక పురస్కారంతో సత్కరిస్తున్నాము.**



## యల్లపు ముకుంద రామారావు

## మన్నన

**సృ**జన అనుసృజన ఆయన రెండు కళ్ళు. మృదు మితభాషిత్వం ఆయన స్వభావం. కవిత్వమైనా అనువాదమైనా నిరాడంబరత ఆయన శైలి. అదే ఆయన వ్యక్తిత్వం. అధ్యయనం అనుభవ జ్ఞానం రెండింటి మేళవింపు ఆయన సాహిత్య బలం.

ఎల్లలులేని కవిత్వ ప్రేమికుడు యెల్లపు ముకుంద రామారావు పుట్టి పెరిగింది తెలుగునేలకు దూరంగా పశ్చిమబెంగాల్ ఖరగ్‌పూర్‌లో. చదువుల కోసం ఉద్యోగరీత్యా భిన్నరాష్ట్రాల భాషా సమూహాలతో సహచరించినందువల్ల అనేక భారతీయ భాషా సాహిత్యాలతో సాహిత్యకారులతో పరిచితి ఏర్పడింది. మెట్రో నగర జీవనం విశ్వమానవ పరిశీలనకు దోహదం చేసింది. దేశ సంచారం కవిగా ప్రకృతితో సాన్నిహిత్యాన్ని పెంచుకోవడానికి తోడ్పడింది.

తెలుగునేలకు దూరంగా వుండటం వల్ల ముకుంద రామారావు వొక విధమైన వలస వేదన అనుభవించారు. అదే తొలినాటి కవిత్వంలో బలంగా ప్రతిఫలించింది. వలసపోయిన మందహాసం ద్వారా తెలుగు కవితా ప్రపంచంలోకి రామారావు ఆలస్యంగానే అడుగుపెట్టినప్పటికీ తొలి సంపుటి ద్వారానే సత్కవిగా గుర్తింపు పొందారు. గణితశాస్త్రంలో సమాచార సాంకేతిక రంగంలో నిష్ణాతుడైన కారణంగా ఆయన కవిత్వంలో కనబరచిన పద-అర్థాల మధ్య తూకం విమర్శకుల మన్నన పొందడమే కాదు ఇతర భాషల్లోకి సైతం అనువాదమైంది. ఆ తర్వాత కవిగా రామారావు వెనక్కి తిరిగిచూడలేదు. మరోమజిలీకి ముందు, ఎవరున్నా లేకున్నా, నాకు తెలియని నేనెవరో, నిశ్శబ్దం నీడల్లో , విడనిముడి, ఆకాశయానం, రాత్రి నదిలో ఒంటరిగా మరో అరడజనుకు పైగా కవితా సంపుటులు వెలువరించారు. ప్రపంచీకరణలో లుప్తమైపోతున్న మానవసంబంధాలు, అంతశ్శోధన ఆయన కవిత్వ సారం. క్లుప్తత ఆప్తత ఆయన కవిత్వానికి ప్రాణభూతమైన శిల్పంగా కనిపిస్తాయి.

అనువాదకుడిగా గత దశాబ్దకాలంగా ముకుందరామారావు చేస్తున్న కృషి అనితరసాధ్యం. 'అదే గాలి', అదే ఆకాశం గ్రంథాల ద్వారా అనేక దేశాల కవిత్వాన్ని అనువదించి ప్రపంచ భాషల సాహిత్య చరిత్రని అందించారు. 'శతాబ్దాల సూఫీ కవిత్వం' సూఫీ తత్త్వసారాన్ని కాచి తెలుగులోకి వడగట్టి పోశారు. నోబెల్ బహుమతి పొందిన కవుల కవిత్వ జీవిత విశేషాల్ని క్రోడీకరిస్తూ వారి విశిష్ట కవితల్ని అనువదిస్తూ 'నోబెల్ కవిత్వం' ప్రకటించారు. భరతవర్షం - సీతాకాంత మహాపాత్ర ఒరియా కావ్యాన్ని ఆంధ్రీకరించారు. అనేక భాషల ప్రథమకావ్యంగా గుర్తింపుపొందిన పదవ శతాబ్దపు మహాయాన బౌద్ధుల నిర్వాణ గీతాల్ని 'చర్యాపదాలు' పేరుతో అనువదించి సాంధ్య భాషలో దాగివున్న మహాయాన బౌద్ధ

సిద్ధాచార్యుల ఉపదేశాల్ని నోరారా వినిపించారు. స్వయంగా కవి కావడంవల్ల కవిత్వ పరుసవేది విద్యని సహజాతంగా అలవర్చుకున్న ముకుంద రామారావు అనువాదాలకు సైతం సృజనాత్మక శైలినీ సహజత్వ శోభనీ అద్దుతున్నారు.

సహస్రాబ్దాల చరిత్రవున్న భారతీయ కవిత్వాన్ని అంతటినీ ఒక చోట గుదిగుచ్చి తెలుగులోకి అనువదించి 'అదే నేల' పేరుతో వొక వుద్గ్రంథాన్ని కూర్చారు ముకుంద రామారావు. అనేక భాషల భారతీయ కవిత్వానువాదం అందించే నెపంతో యీ దేశ జనజీవనవిధానంలోని విశిష్టతనీ విలక్షణతనీ వివిధతనీ యెత్తిచూపుతూ భిన్నత్వం అంచుమీద నిలబడి ఐక్యతారాగాన్ని ఆలపించారు.

అనువాద కళని ఆపోశన పట్టిన రామారావు 'అదే నేల' ద్వారా భారత దేశంలోని భిన్నభాషల్లో విలసిల్లిన కవిత్వాల్ని వాటి చారిత్రక నేపథ్యంతో సహా కుప్పబోసి తెలుగు పాఠకుల్ని దేశీయ సాహిత్య ప్రపంచంలోకి చేయిపట్టి నడిపించారు. వందలాది భారతీయ భాషల నుంచి దాదాపు మూడు వేల మంది కవుల్ని ఆ గ్రంథం ద్వారా ఆయన పరిచయం చేశారు. ఏడు వందలకు పైగా కవితల్ని అనువదించి దేశంలోని భిన్న జాతుల అస్తిత్వాన్ని గుర్తించి గౌరవిస్తూనే వాటిమధ్య ఐక్యత కోసం సాంస్కృతిక వారధిని నిర్మించారు.

'అదే నేల' కేవలం భారతీయ భాషల్లో వచ్చిన కవిత్వ అనువాద రచన మాత్రమే కాదు. కవిత్వ అనువాదంతో పాటు ఆయా భాషల సాహిత్య చరిత్రని కవిత్వ నేపథ్యాల్ని సైతం నమోదు చేసింది. భిన్న కాలాల్లో ఆయా భాషల కవిత్వంలో చోటుచేసుకున్న పరిణామాల్ని గుర్తిస్తూ అందుకు కారణమైన బాహ్య – ఆంతర పరిస్థితుల్ని వివరించింది. ఆనుషంగికంగా కాలానుగుణంగా లేదా కాలానికి యెదురీదుతూ నిర్మించుకొన్న భారతీయ కవిత్వరీతుల్ని విశదీకరించింది. అంతిమంగా కవిత్వం ద్వారా ఆవిష్కారమైన భారతీయ ఆత్మని సాక్షాత్కరింపజేస్తుంది.

బహుభాషావేత్తగా, అనువాదకుడిగా ముకుందరామారావుది ప్రజాస్వామిక దృక్పథం. అందువల్లనే ఆధిపత్య భాషాసంస్కృతుల కింద నలిగే పీడిత ప్రజల అస్తిత్వ వేదనతో ఆత్మీయంగా మమేకమయ్యారు, అంతరించిపోతున్న ఆదివాసీ భాషల మౌఖిక కవితాభివ్యక్తిని గుండెకు హత్తుకున్నారు. 'అదే నేల' అందుకు నిండైన నిదర్శనం.

ఇంతకు మునుపే తెలుగు విశ్వవిద్యాలయం నుంచి వచన కవిగా కీర్తి పురస్కారం (2009) అనువాదకుడిగా సాహిత్య పురస్కారం(2017)పొందిన ముకుంద రామారావు కథకుడిగా వ్యాసకర్తగా సైతం పేరుపొందారు. ప్రత్యక్షంగా జర్నలిజం రంగంలో పనిచేయనప్పటికీ దాదాపు పది సంవత్సరాలుగా పాలపిట్ట, మిసిమి, విశాలాక్షి పత్రికల్లో దేశవిదేశాల కవిత్వాన్ని పరిచయం చేస్తూ రాస్తున్న వ్యాస పరంపర ఆయనకు కవిత్వ కాలమిస్టుగా గుర్తింపు తెచ్చింది.

మధ్య యుగాలనాటి భారతీయ భక్తి కవిత్వంలోని సామాజికాంశాలను వెలికితీసే బృహత్ కార్యంలో నిమగ్నమైవున్నారు. కవిగా కథకుడిగా వ్యాసకర్తగా అనువాదకుడిగా యెల్లపు ముకుంద రామారావు చేస్తున్న భాషాసేవను గుర్తిస్తూ 2020 సంవత్సరానికి 'తాపీ ధర్మారావు స్మారక పురస్కారం' అందించడం సముచితమని మేము భావిస్తున్నాం.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్<br>
మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి<br>
ఖైరతాబాద్–హైదరాబాదు<br>
19 సెప్టెంబరు 2021.

**తాపీ ధర్మారావు వేదిక,**<br>
98480 16136<br>
విజయవాడ.





# పురస్కార గ్రహీత ప్రసంగం

**సభకు నమస్కారం**

**తాపీ** ధర్మారావు గారు అంటేనే ఒళ్లు పులకరిస్తుంది. వారు చేసిన సాహిత్య సామాజిక సేవ అద్వితీయమైనది. వారి పేరుమీద ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేయడం, నా అదృష్టంగా భావిస్తున్నాను. నాకు ఇది మరో విధంగా ఆనందాన్ని కలగజేస్తోంది. అది వారు రాష్ట్రేతర ప్రాంతంలో ఉన్న బరంపురంలో పుట్టడం పెరగడం, అనేక ప్రాంతాల్లో ఉండడం, నేను కూడా రాష్ట్రేతర ప్రాంతమైన ఖరగపూర్‌లో పుట్టి పెరిగి అనేక ప్రాంతాల్లో ఉన్నాను. అదొక్కటే వారికీ నాకూ ఉన్న సామ్యంగా భావించి సంతోషం అనిపించింది. తెలుగు దినపత్రికల్లో తొలిసారిగా వ్యావహారిక భాషను ప్రవేశపెట్టిన సంపాదకుల సంపాదకుడు ఆయన. తెలుగు సినిమాల్లో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టిన తాతాజీ. అనేక ప్రాంతాలు తిరిగి, అనేక ఉద్యోగాలూ చేసిన, అనుభవమే, అతను ఒడిసి పట్టుకున్న ప్రజల భాషతో ముడిపడి ఉన్న అతని జీవితం.

నన్ను మరింత ఆనందపరిచిన ఇంకొక విషయం నేను తప్పకుండా ఇక్కడ చెప్పుకోవాలి. అది – ఈ పురస్కార కార్యక్రమం ఒక ఆత్మీయ వాతావరణంలో జరిపించడం, అది ఎంతో నిబద్ధతతో చేయడం, నన్నూ నా కుటుంబ సభ్యుల్ని సైతం ఎంతగానో సంతోషపరుస్తోంది. అందుకు ఇందులో పాలుపంచుకున్న అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

అయితే నా ఈ పుస్తకం 'అదే నేల' విషయానికి వస్తే, ఈ పుస్తకం ఇలా వస్తుందని గాని, ఇలా రావాలని గాని, నేను ఏనాడూ ముందు అనుకోలేదు. ఒక్కొక్క భాష, ఆ భాషా చరిత్ర, అందులోని కవిత్వ చరిత్ర, కవిత్వం చదువుకుంటూ పోయాను. ఆ క్రమంలో ఆ భాషలోని ప్రముఖ కవులని సంప్రదించడం, మరిన్ని వివరాలు సేకరించడం వాటిని భద్రపరుచుకోవడం, వీటితో నాకు రోజులు ఎలా గడిచిపోయాయో నాకే తెలియదు. దానిలో నేను పడ్డ కష్టాలు గుర్తు చేసుకోవడం గాని, ఏకరువు పెట్టడం గానీ నేనిప్పుడు చేయదలుచుకోలేదు. అయితే వాటిలో నేను పొందిన కొన్ని ఆనందాల్ని మాత్రం మీతో పంచుకుంటాను.

ఆయా భాషా కవులు చూపించిన ఆదరణ, ప్రోత్సాహం, సహాయం తప్పకుండా నన్ను ముందుకు నడిపించాయి.

ముఖ్యంగా నేను చెప్పాల్సింది, భారతీయ భాష నాకు తెలిసింది అయినా, తెలియంది అయినా, ఏవీ నాకు పరాయివి అనిపించకపోవడం. దానికి కారణం అక్కడి కవిత్వమే కాకుండా, అక్కడి కవులు కూడా. నేను అక్కడి కవిని అనుకున్నట్టే, వారు కూడా నన్ను వారిలో వాడిగానే తీసుకోవడం నన్ను అబ్బురపరిచేది.

ఏ భాష ఎక్కడితో ఆపాలో కూడా నాకు ఒక సమస్యగా ఉండేది. దానికి కారణం, దాని నుండి బయటపడలేని తనంలో నేను కూరుకుపోవడం. మరో భాషలోకి వెళ్లాలి కదా అన్న ఒత్తిడి మరో పక్క నన్ను వేధించేది. ఇంకో భాషా కవిత్వం ఇంకెంత బాగుంటుందో ఏమో అని, నన్ను నేను సర్ది చెప్పుకుని మరో భాషలోకి ప్రవేశించేవాడిని. ఇందులో నేను చివర్లో తీసుకున్నది ఆదివాసీల కవిత్వం. అది ఒకందుకు నాకు మంచిదే అయింది. ఎందుకంటే అదే ముందు తీసుకుని ఉంటే ఈ పుస్తకం ఇంకా నాకు చాన్నాళ్లు పట్టేది. అదే వేరొక పుస్తకంగా రావలిసినంత అద్భుతమైన కవిత్వ సంపద అందులో ఉంది.

నిజానికి ఇందులో ఉన్న భాషలన్నీ వాటికవే ఒక గ్రంథం రాసినా సరిపోదు. అయినా వారి కవిత్వాన్ని పరిచయం చేయడం కోసం చేసిన ప్రయత్నం మాత్రమే ఇది. ఈ పుస్తకం ఇంత బరువుంటుందని నేను ఏ కోశానా అనుకోలేదు. పోర్టరు డబ్బుకోసం ఆశపడి సామానంతా తానే మోసి తీసుకుపోయి, బరువు దించుకున్నాక పొందిన హాయి లాంటిదే నాకు కూడా అనుభవానికొచ్చింది. ఆశకొద్దీ కవిత్వాన్నంతా సేకరించాలన్న దురాశతో ఆబగా మోసి మోసి, పుస్తకంలో దించుకున్నాక, ఒక విధమైన తృప్తి, ఉపశమనం, ఆనందం నాకు కలిగాయి. మూర్తయి పుస్తకంగా బయటపడ్డాక, కొంత శూన్యం కూడా వెన్నాడింది. ఏదైతేనేం భారతీయ కవితల్లోని కొన్ని ఆత్మలనయినా తాకిన ఆత్మ సంతృప్తి మాత్రం నాకు తప్పకుండా మిగిలింది.

ఈ పనిలో నాకు భరోసాగా అడుగడుగునా నిలిచిన ప్రభాకర్ గారికి నేను ఎన్ని ధన్యవాదాలు చెప్పుకున్నా తక్కువే. నేను ఎంత ఇబ్బందికి గురిచేసేవాడినో ఏమో ప్రభాకర్ గారిని! ఈ పుస్తకం చూసిన ప్రతీసారీ నాకు ఈ ఆలోచన రాకుండా ఉండనే ఉండదు.

రమేశ్‌బాబు గారు నన్ను పొగడవద్దని వారించినా, ఇదొక బాధ్యతగా ఈ సభని ఇంత జయప్రదంగా నిర్వహించినందుకు నా ధన్యవాదాల బరువు ఆయన మోయకతప్పదు. అది నా కర్తవ్యంగా భావించమని వారిని సవినయంగా కోరుకుంటున్నాను. ఇందరు పెద్దలు – మాన్యులు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ రవీందర్ యాదవ్ గారు, ఆప్తులు శ్రీ జయధీర్ తిరుమలరావు గారు, జస్టిస్ శ్రీ రామలింగేశ్వరరావు గారు, ఆచార్య శ్రీ గారపాటి ఉమామహేశ్వరరావు గారు, శ్రీ పూర్ణచంద్రరావు గారు, శ్రీమతి కన్నెగంటి అనసూయ గార్లను ఇలా ఒక దగ్గర కలుసుకునే అవకాశం భాగ్యం నాకు కలిగింది. వారందరికీ నా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

శనివారం ఉదయం ఇంత ఆనందంగా ఇలా నాతో గడిపిన మీ అందరికీ నా నమోవాకాలు.

– ముకుంద రామారావు

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# కథలు చదవని మనుషులు

**అవి** నా చిన్నప్పటి రోజులు. నేను ఐదో తరగతి చదువుతున్నాను. మా ఇంటి పక్కన ఒక పెద్దమనిషి ఉండేవాడు. ఆయనది మా ఊరు కాదు. ఎక్కడినుంచో వచ్చాడు. ఒంటరిగా ఉండేవాడు. వైద్యం చేస్తూ జీవనం సాగించేవాడు. ఆయన్ను అందరూ "కథల బాబాయ్" అని పిలిచేవారు. ఆయన అసలు పేరేమిటో తెలియదు.

ఇంట్లో పిల్లల్ని చుట్టూ కూర్చుండబెట్టుకొని కథలు చెబుతూ ఉండేవాడు. చెప్పిన కథ చెప్పకుండా చెపుతూ ఉంటే ఎంతో ఆసక్తిగా వినేవాళ్లం. కథలో ఉండే విషయం కన్నా ఆయన చెప్పే తీరుకు మేము ఎక్కువ ఆకర్షితులమయ్యాం అని చెప్పవచ్చు. అప్పుడప్పుడు మాకు ఒక విషయం చెప్పేవాడు. మీరు పాఠాలు చదవకపోయినా పర్వాలేదు. కథలు మాత్రం తప్పక చదవండి. కథలు చదివినవాళ్లు మంచి మనుషులు అవుతారు అని చెప్పేవాడు.

మా ఊరి మధ్యలో పెద్ద అరుగు ఉంది. ఆ అరుగు మధ్యలో చుట్టూ కొమ్మలు పరచుకొని చల్లని నీడనిచ్చే పెద్ద వేపచెట్టు ఉంది. వేసవికాలంలో ఇంట్లో వేడిని తట్టుకోలేక పిల్లలూ, పెద్దలూ మధ్యాహ్నం భోంచేసి అరుగు మీదకు వచ్చి సేద తీర్చుకొనేవారు. అలాంటి సమయంలో జనం కథల బాబాయిని బ్రతిమాలి కథలు చెప్పించుకొనేవారు. ఆయన చెప్పే కథలు గంటలకొద్దీ సాగేవి.

ఆ కథల్లో తప్పకుండా మహావీరుడైన రాజకుమారుడు అందాలరాసియైన ఒక రాజకుమారి, ఒక రాక్షసుడో, మాయలు తెలిసిన మంత్రగాడో ఉండేవాడు. ఆ రాక్షసుడు రాకుమారిని అపహరించి ఏ దీవిలోనో, ఇతర లోకాల్లోనో ఎక్కడో దాచిపెట్టేవాడు. రాజకుమారుడు రాజకుమారిని వెదుకుతూ మధ్యలో అనేక శక్తులు సంపాదించుకొంటూ, వరాలు పొందుతూ అన్నిలోకాలు వెదికేవాడు. రాజకుమారుడి శక్తులకు రాక్షసుడి మాయలకు అంతు అంటూ ఉండేది కాదు. రకరకాల రూపాలు మార్చేవారు. ఆకాశంలో ప్రయాణం చేసేవారు. రాజకుమారి నిద్రాహారాలు మాని తల్లిదండ్రుల కోసం గాని ప్రియుడి కోసం గాని విలపిస్తూ ఉంటే వింటున్న శ్రోతల కళ్లల్లో నీళ్లు ఉబికేవి. నోరెళ్లబెట్టి బొమ్మల్లా ఆలకించేవారు. ఆ సమయంలో కథా ప్రవాహానికి ఎవ్వరైనా ఆటంకం కలిగిస్తే వాడికి మూడినట్లే. కొట్టేంత పని చేసేవారు.

ఒక్కోరోజు సమయం చాలక కథ పూర్తియ్యేదికాదు. రేపటికి మిగిలిపొయ్యేది. రేపటి కథకోసం జనం ఎంతో ఆత్రుతతో ఎదురు చూసేవారు. మరునాడు కథల బాబాయ్ అరుగు మీదకి రాగానే నిన్నటి కథ ఎంతవరకు వచ్చింది, అని అడిగేవాడు. నేను నేనంటూ అందరూ కథను తిరగతోడేవారు. తర్వాతి కథ కొనసాగిస్తూ చెబుతూవుంటే మైమరచి వింటూ కొందరు నిద్రలోకి జారుకొనేవారు. ఇలాంటి సమయంలో ఏదో ఒక హాస్య సంఘటన చెప్పి నవ్వించే వాడు. మీకు నిద్రవస్తున్నట్లు ఉంది, రేపు చెప్పుకొందాం అనేవాడు. జనం ఒప్పుకొనేవారు కాదు. ఆ నిద్రపోయిన వాళ్లని చెడ తిట్టి బాబాయిని బ్రతిమలాడుకొనేవారు. అరుగుమీద జనం చేరి ఉన్నప్పుడు ఊళ్లో ఏదైన చెడ్డ పనులు చేసిన వారి సంగతి తెలిసేది. కథలు విననివాళ్లు కథలు చదవని వాళ్లే ఇలాంటి చెడ్డపనులు చేస్తారు, దుర్మార్గులు అవుతారు అనేవాడు. విచిత్రంగా అరుగు మీదకు రాని వాళ్ల పేర్లే వినబడేవి.

బాబాయి అరుగుమీదికి రాని రోజు బాబాయిని గురించి జనం రకరకాల కథలు చెప్పుకొనేవారు. మన ఊళ్ళో మనకు కథలు చెప్పే బాబాయి ఉన్నాడు. పాపం ఇలాంటి కథలు చెప్పేవాళ్లు లేక ఇతర ఊళ్లల్లో జనాలు ఎలా బ్రతుకుతున్నారో అంటూ బాధపడిపోయేవారు.

నేను పదవ తరగతిలో ఉండగా కథల బాబాయి ఏదో జబ్బుతో కన్నుమూసాడు. ఊరి జనమంతా కన్నీరు మున్నీరై విలపించారు. మన పిల్లలకూ మనకూ ఇంక ఎవరు కథలు చెబుతారంటూ దిగులు పడ్డారు.

ఆ చిన్న వయస్సులో కథలు వింటూ పెరిగిన నేను కథల పుస్తకాలు తెగ చదివేవాడిని. క్రమక్రమంగా నవలలు, పురాణాలు శాస్త్ర గ్రంథాలు చదవడం అలవాటయింది. 50 సంవత్సరాలకిందట కథల బాబాయి చెప్పిన మాటలు అప్పుడప్పుడు గుర్తుకు వస్తూ ఉంటాయి. కథలు చదవకుండా పుస్తకాలు చదవకుండా డిగ్రీలు సంపాదించుకొని బయటకు వస్తున్న వీళ్లంతా మంచివాళ్లు కాదా? ఏమో ఆనాడు కథల బాబాయి చెప్పిన మాటలు నిజమేమో అనిపిస్తూ ఉంది.

ఇప్పుడు అభ్యుదయవాదం, మానవతావాదం, సమతావాదం వంటి మాటలు బూతు పదాలయ్యాయి. అందుకే కాబోలు ఎవరి నోటా వినబడడంలేదు. నీతి, న్యాయం, ధర్మం అని మాట్లాడేవాళ్లను చేతగాని వాళ్లని, బీ.సీ. కాలం నాటి అమాయకులని అంటున్నారు. ఎందుకిలా జరిగింది. చదువుల్లో భాషాసాహిత్యాలకున్న ప్రాధాన్యత గతంలో కంటే తగ్గినందువల్ల వట్టిపోయిన హృదయాలతో విద్యావంతులై బయటకు వస్తున్నారేమో? కాదని కొట్టివేయలేము.

**మనిషి సంపాదించిన శాస్త్ర జ్ఞానం విశ్వవ్యాప్తం చెంది, భౌతిక ప్రపంచం చాలా చిన్నదైపోయింది. భూగోళమంతా మన అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్లోకి వచ్చేసింది. మనిషి మరింత విశాలంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్యవాదిగా, విశ్వమానవుడిగా ఎదగాలి. కాని మానసికంగా మనిషి ముడుచుకుపోయాడు. జాతి, కుల, మతాలను ముందుకు తెచ్చి ఊగిపోతున్నాడు. ఎదుటివారిపై కత్తులు దూస్తున్నాడు. ఎందుకు ఇలా జరిగింది? కథా సాహిత్యం చదవక పోయినందువలనేనా?**

మనిషి విశ్వమానవునిగా మారడానికి కావలసిన శక్తి కథల్లో, పుస్తకాల్లో ఉందా? విశ్వమానవుడు అంటే అదేదో చాలా గొప్ప ఆదర్శం కాదు. మన పొరుగు వారు కూడా మనలాంటి వారేననుకోవడం.

కథల్లో ఏముంది? కథా సాహిత్యం మనుషుల్ని ఇంతగా

ఎందుకు ఆకర్షిస్తుంది? కథ కూడా అద్దంలాంటిదే. మనిషి అద్దంలో తన ముఖం చూసుకొన్నట్లు కథలో తనను వెదుక్కొంటాడు. తన అభిప్రాయాలు, బాధలు, మంచీచెడుల గురించి తెలుసుకొంటూ వుంటాడు. కథల్లో, కావ్యాల్లో, నవలల్లో అన్నింటిలో మనుషులే ఉంటారు. చివరకు దేవుడి రూపం కూడా మనిషిదే. మంచివారిని మహాత్ములను దేవుడిగా పూజిస్తారు. లేదా దేవుడే మనిషిగా పుడతాడు. కథల్లో ఇతర జీవులు, ప్రాణంలేని బండరాళ్లు మనిషిలానే మాట్లాడతాయి. అణువణువులో మనిషి తననే వెదుక్కొంటాడు.

పుస్తకాలు చదివేవాళ్లు వంద మంది ఉన్నారనుకొంటే అందులో తొంభై మంది కథల పుస్తకాలే చదువుతుంటారు. మిగిలిన పదిశాతం ఇతర పుస్తకాలు చదువుతుంటారు.

**కథలు చదివేవాళ్లు జాతి, కుల, మత భేదాలు లేకుండా ఒకేలా స్పందిస్తారు. అందరూ సినిమాలకు వెళ్లతారు. సినిమా చూసే ప్రేక్షకుల్లో ధనికులూ, పేదలూ ఉంటారు. మంచివారూ, చెడ్డవాళ్లు ఉంటారు. అందరూ ఒకేలా స్పందిస్తూ ఉంటారు. ముగింపులో చెడు ఓడిపోయి మంచి గెలుస్తుంది. ఎవ్వరు చెడు గెలవాలని కోరుకోరు. కాని నిజజీవితంలో బలహీనుడివైపు ఎంత న్యాయమున్నా గెలవడు. బలవంతులు, ధనవంతులు, అధికారం ఉన్నవాళ్లు ఈ ప్రపంచంలో గెలుస్తూ ఉన్నారు. కాని కథల్లో మాత్రం ఓడిపోవాల్సిందే. ఇది మానవ జాతి ఆకాంక్ష, కోరిక, ఆశయం. ఈ ఆకాంక్షను మానవజాతి ఏదో ఒక రోజు నెరవేర్చుకొంటుంది. అయితే మనుషులు ఈ ఆకాంక్షతో జీవించాలంటే అది కథా సాహిత్యం ద్వారానే సాధ్యం. మరింత బలంగా పురికొల్పబడుతూ ఉండాలి. ఇందుకే పిల్లలు కథలు వింటూ కథలు చదువుతూ పెరగాలి.**

కథా సాహిత్యం చదవకుండా పాఠ్యేతర పుస్తకాలు చదవకుండా పైకి వచ్చిన వారికి మనుషులు మనుషుల్లా కనిపించరు. డాక్టర్లకు పేషంట్లుగా, లాయర్లకు క్లయింట్లుగా, రాజకీయ నాయకులకు ఓటర్లుగా, వ్యాపారులకు కష్టమర్లుగా మాత్రమే కన్పిస్తారు. వీళ్లంతా ప్రకృతి నుండి, మనిషి నుండి ఎంత పిండుకోవాలో అంత పిండుకోడానికే చూస్తారు.

**మానవ జాతిని సమాజ అభివృద్ధిని శాస్త్రీయంగా అర్థం చేసుకోక పోతే, తాలిబాన్ల వంటి ఉగ్రవాదులు పుడుతూనే ఉంటారు. ప్రకృతిని ఇతర జీవజాతులను అర్థం చేసుకోలేకపోతే కరోనాలాంటి భూతాలు పుడుతూనే ఉంటాయి. ఈ దుష్టసమాజపు పోకడలకు విసిగిపోయిన జనం మరింత దుర్మార్గులను క్రూరులను తమ ప్రభువులుగా ఎన్నుకొంటారు. అంతులేని లాభాపేక్షతో వ్యాపారులు, ఆశబోతులు ప్రకృతి నుండి మరింత పిండుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటే కరోనా కంటే ప్రమాదకరమైన జీవులు పుట్టి మానవజాతి అంతుచూస్తాయి.**

ఈ భూగోళం పచ్చగా పరిశుభ్రంగా జీవంతో కళకళలాడుతూ ఉండాలంటే మనిషి మారాలి. మనుషులు మంచి వాళ్లుగా ఆలోచనాపరులుగా మారాలి. ఇది ఒక్క కథాసాహిత్యం ద్వారానే సాధ్యం.

మనుషుల ఊహలకు, కల్పనలకు, ఆకాంక్షలకు ఊపిరి పోసేవే కథలు. కథల్లో ఉన్న కల్పనలు- శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాస్త్రాల ద్వారా వాస్తవం చేసుకొంటాడు మనిషి. ఊహలకు, కల్పనలకు ఊపిరిపోసే కథలు చదవకుండా మన విద్యార్థులకు శాస్త్రజ్ఞానం ఎలా అబ్బుతుంది. శాస్త్రజ్ఞులకు మానవతా విలువలు ఎక్కడ నుండి వస్తాయి.

మనిషి కథల గుర్రాన్ని ఎక్కి స్వారీ చేసుకొంటూ సైన్సు అనే మాయామందిరంలోకి ప్రవేశించాలి. అప్పుడు మాత్రమే తన మానవరూపాన్ని నిలబెట్టుకొంటాడు. లేకపోతే ఏభూతంగానో క్రూర మృగంగానో మారిపోయి బయటకు వస్తాడు.

ఒకప్పుడు శాస్త్రాన్ని కూడా కలిపి అంతా సాహిత్యంగానే చదువుకొన్నారు. ఆధునిక కాలంలో శాస్త్రం సాహిత్యం నుండి విడగొట్టుకొన్నది. అయినా చదువుల్లో భాషాసాహిత్యాలకు, విజ్ఞాన శాస్త్రాలకు సమప్రాధాన్యత నిచ్చి చదువుకొన్నాం. ఇప్పుడు భాషాసాహిత్యాలను పక్కనబెట్టి శాస్త్రజ్ఞానం చాలు అన్నట్లుగా చదువులు సాగుతున్నాయి. ఈ చదువుల పుణ్యమే మాతృభాషల ప్రాధాన్యతలను అర్థంచేసుకోలేని మేధావులు తయారయ్యారు. ఊహలు, కల్పనలు, స్పందనలు లేని కొత్తరకపు మానవజాతి ఈ భూగోళం మీద అవతరిస్తుంది.

**ఈ కొత్త రకపు మానవజాతి పుట్టింది ఈ చదువుల ద్వారా ఈ బడుల ద్వారానే. ఇది నమ్మలేని నిజం.**

బాల్యంలో కథా సాహిత్యం చదవకపోవడం, పాఠ్యేతర పుస్తకాలు చదవకపోవడమనే చిన్న కారణంతో బడిమీద ఈ నాటి చదువుల మీద ఇంత పెద్ద నిందవేయడం సబబేనా?

చిన్న మేకు టైరులో దిగితే గాలిపోయి బండిబోల్తా కొడుతుంది. బోల్టు చాలా చిన్నగా కనిపించవచ్చు. అది ఊడిపోతే ఎంతపెద్ద యంత్రమైనా ఆగిపోతుంది.

కథలు చదవకపోవడం పుస్తకాలు చదవకపోవడం చిన్న కారణమా? మనిషి గుండెల్ని తట్టిలేపేవి పుస్తకాలు. పుస్తకాలు మనతో మాట్లాడతాయి. పుస్తకానికి పాఠకుడికి మధ్య ఎవ్వరూ ఉండరు. ఏకాంతంలో ఒక్కడే పుస్తకాలు చదువుతూ స్పందిస్తూ ఉన్నప్పుడే మనిషిలో మార్పు జరుగుతూ ఉంటుంది. మంచి భావనలు నాటుకొంటూ ఉంటాయి. ఇక్కడ పరీక్షలు మార్కుల గొడవ ఉండదు. గుర్తుపెట్టుకోవాలనే బాధ ఉండదు.

ఇష్టపూర్వకంగా ఆనందంగా ఆసక్తిగా చదివే పుస్తకాలే మనిషిని మానవతా సింహాసనంపై కూర్చుండబెడతాయి. మహనీయుల్నిగా మారుస్తాయి.

'మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అని అడిగితే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పుస్తకం అని చెబుతాను' అన్నాడు అల్‌బర్ట్ ఐన్‌స్టీన్. 'తుపాకీ కంటే గొప్ప ఆయుధం పుస్తకం' అన్నాడు లెనిన్. 'శారీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎలా అవసరమో మానసిక ఆరోగ్యానికి పుస్తక పఠనం అంతే అవసరం' అన్నాడు మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్. జైల్లో ఉన్నప్పుడు 'నాకు ఎలాంటి స్వేచ్ఛ అవసరం లేదు. పుస్తకాలను చదవనిస్తే చాలు' అన్నాడు నెల్సన్‌మండేలా. 'నాకు కోటి రూపాయిలిస్తే ముందు గ్రంథాలయాన్ని పెడతా'నన్నాడు గాంధి. 'ఒక పిల్లవాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి పుస్తకమే'నంటాడు విన్సెంట్ రస్సెల్.

**ప్రపంచాన్ని తిరిగిచూడాలన్నా, భూత భవిష్యత్తు కాలాల్ని దర్శించాలనుకొన్నా ముందు గ్రంథాలయమనే జ్ఞాన మందిరాన్ని సందర్శించాలి.**

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# దారి మరిచిన గురువులు-దారిలోకి తెచ్చే అగత్యాలు, అవకాశాలు

**జా**నపదులకు లింగ్విస్టిక్స్ అక్కరలేదు కాని, లింగ్విస్టిక్స్ వాళ్ళకు జానపదసాహిత్యం కావాలి అని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ మీద లింగ్విస్టిక్స్ శాఖాధిపతి భద్రిరాజు విసుర్లు పేలుస్తుండేవారు. కొత్తభాష కనిపెడదాం అని ఆయన అరకులోయలో కువి భాషకు వ్యాకరణం రాసేనాటికే, భాషాశాస్త్రజ్ఞుల స్ఫూర్తితో ఫోనిం- మార్ఫిం వలెనే, సాహిత్య మానవ శాస్త్రవేత్తలు, పురాగాథలలో మూలకాలను మిథీం, సెమీం అని వాటిలో వస్తున్న పరిణామాలను విశ్లేషించసాగారు. మనవాళ్ళు ఆ జోలికి పోలేదు. భద్రిరాజు కువి ఎత్నోగ్రఫి కొంత రాశారు కాని, పి. యస్. సుబ్రహ్మణ్యం వగైరాలు వ్యాకరణంతో సరిపెట్టారు. వారి గురువు ఎమేనోవ్ తోడా తెగ పాటలను సేకరించి ప్రచురించారు. కాని వీళ్ళు భాష తప్ప, సాహిత్యం జోలికిపోలేదు.. బ్రౌన్ తన నిఘంటువులో కావ్యాలలో ప్రయోగాలు కూడా ఇచ్చారు, తెలుగు వ్యుత్పత్తి పదకోశం జానపద సాహిత్యంలో ప్రయోగాలు ఇవ్వలేదు.

1960లో మాండలికవృత్తి పదకోశాలు తయారు చేసేనాటికి, పాశ్చాత్య దేశాలలో సోషియో లింగ్విస్టిక్స్, ఫోక్ టాక్సానమీ అభివృద్ధి చేస్తున్నారు. ఆ దిశలో వీరు ముందుకు పోలేదు. నన్నయ, తిక్కన పద ప్రయోగ కోశాలు, పత్రికా నిఘంటువులు, తెలుగు అకాడెమి వారి పారిభాషిక పదావళి స్థిరీకరించటం, ఆధునిక కవిత్వ విమర్శలలో కొట్టుకుపోయారు..,

ప్రజలలో ప్రయోగాలను సేకరించి ప్రమాణీకరించాలన్న భద్రిరాజు సలహాను, అకాడెమీలో తన స్థానబలంతో, ప్రభుత్వ విధానాలు ఉదహరిస్తూ ఎలా తిరస్కరించిందీ, బూదరాజు తన ఆత్మకథ 'విన్నంత కన్నంత'లో చాలా ఉత్సాహంగా చెప్పుకొస్తారు. ఇటువంటి విషయాలలో అప్పుడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సాహితీవేత్త పి.వీ.నరసింహారావు పాత్ర ఏమిటో మనకు తెలియదు. 1997లో కమ్మరి పదకోశం ముందుమాటలో **ఈ పదసంపదలో మార్పులను సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేయాలి అని భద్రిరాజు అన్నారు. ఆయన అప్పుడు హైదరాబాద్ విశ్వవిద్యాలయం కులపతిగా ఆ ప్రయత్నం చేయవలసింది.. ఆ సమయంలో అక్కడి మానవశాస్త్ర శాఖ ఎత్నో బయాలజీ మీద పని చేస్తుంది. కాని భాష నుడికారం వాళ్ళకు అక్కరలేదు.**

**తెలుగు గిరిజన మాండలికం అర్థమైతేనే తెలుగేతర తెగల భాషలు బోధపడతాయి అని ఆయన గమనించారు. కాని ఆ దిశగా వారి ప్రయత్నం సాగలేదు. ఆ భాషలలో జరిగిన కృషి, ఆ పండితులకు తప్ప ఇతరులకు అర్థంకాదు. తెలుగు-తెలుగేతర ద్రావిడ భాషలలో పరస్పర ప్రభావం ఎవరూ అధ్యయనం చేయలేదు.**




అమెరికాలో, మొదట్లో భాషాశాస్త్రం, మానవ శాస్త్రంలో భాగంగా ఉండేదని, తప్పనిసరిగా ఆ శాస్త్రాన్ని చదవవలసి వచ్చిన తనపాట్లను, చేకూరి రామారావు ఏకరువుపెడుతూ, భద్రిరాజు, అనువాద పద్ధతులకు పునాది వేస్తూ, విశ్వ సౌందర్య శాస్త్రం అభివృద్ధి చేయాలని కలలు కనేవారని, కాని ఆయన అధ్వర్యంలో వర్ధిల్లిన భాషాశాస్త్ర శాఖ, ఇతర శాఖల మీద ఏమీ ప్రభావం చూపలేక పోయిందని తన 'భాషానువర్తనం '(పుట 7) లో వాపోతారు. ఇటువంటి విశ్వ విద్యాలయాల అనువాద శాఖలలో పనిచేసిన ఆఫ్రికన్ రచయితలు చినువా అచ్చే, గూగి వాంగ్ తియంగో, రేడియో ప్రయోక్త సోఎంకా ఆఫ్రికన్ అస్తిత్వానికి ప్రపంచ ఖ్యాతి తెచ్చారు.

మాక్సిం గోర్కీ, 'జానపద సాహిత్యంలోనే నిజమైన వీరులు కనిపిస్తారు' అంటారు. 'కోటకవుల'వి మైనపు బొమ్మలు కాగా , పల్నాటి యుద్ధం, కాటమరాజు కథ, దేశింగురాజు కథలలో స్త్రీలలో 'సాహస పరాక్రమాలే కాక, ప్రణయజీవితంలో కూడా స్వేచ్ఛ, మానవతాస్ఫూర్తి కనిపిస్తాయి' అంటారు. త్రిపురనేని మధుసూదనరావు(కవిత్వం-చైతన్యం-పుట 103). తెలుగు వీరగాథలు సేకరించిన తంగిరాల సుబ్బారావు, 'నాదేశం-నాప్రజలు' అని ఘోషించి, వామపక్షాల ప్రభావంతో నినాదప్రాయంగా మారుతున్న రచనలను నిరసిస్తూ, 'కవిసేన మేనిఫెస్టో' రూపొందించిన గుంటూరు శేషేంద్రశర్మ సన్నిహితులు.. కానీ తంగిరాల, వీరగాథలు ఆయనకు ఎక్కించలేదు.

పల్లెపదాలను అనుకరించిన ఉద్యమ సాహిత్య రచయితలు తిరునగరి రామాంజనేయులు వగైరాలు, ప్రజలలోకిపోయి తమ పాటలను ఎలా


మాండలిక

వృత్తిపదకోశం

ప్రథమ సంపుటం

వ్యవసాయ పదాలు

సంకలనకర్త, సంపాదకుడు

భద్రిరాజు కృష్ణమూర్తి

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి

హైదరాబాదు

1974

మార్పులుచేసి సొంతంచేసుకునేవారో తెలుసుకునే వారట. కాని వారి తరువాతి తరానికి అంత ఓపిక లేదు.

మనదేశంలో మెక్సికన్ రాయబారిగా పనిచేసి, సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన అక్టేవియో పాజ్, మన సాహిత్యవేత్తలకు బాగా పరిచితుడు. జానపద గిరిజన సాహిత్య విశ్లేషణకు పట్టం కట్టిన సాహిత్య మానవ శాస్త్రజ్ఞుడు లెవిస్ట్రాస్. నిర్మాణ సిద్ధాంత ప్రతిపాదనలో మార్క్సిజం, బౌద్ధం ఒదిగిపోయాయని, పాజ్, ఒక పుస్తకం రాసాడు. అది మన సాహిత్యగాళ్ళ దృష్టికి రాలేదు. మన కవులు పంతుళ్ళు, తత్వవేత్తలు జీన్ పాల్ సార్త్రే అస్తిత్వ వాదం గూర్చి చెపుతారు కాని, అదే ఫ్రాన్స్‌లో ఆయన సమకాలికుడు స్ట్రాస్ నిర్మాణవాదంగూర్చి చెప్పరు.

1982 నుండి 'గిరిజనోద్యమాలు – రైతాంగ పోరాటాలు' 'సబాల్టర్న్ స్టడీస్' అధ్యయన సంప్రదాయానికి ఒరవడి దిద్దాయి. వీటి మొదటి సంపుటంలోనే, డేవిడ్ ఆర్నాల్డ్, రంప–గూడెం గిరిజన పోరాటాల మీద సుదీర్ఘ వ్యాసంలో గిరిజనుల మతంలో పాండవుల గేయగాథలు పోరాటానికి పురిగొల్పుతున్నాయి అని పేర్కొన్నాడు. ఈ పరంపరలో ప్రసిద్ధి చెందిన నేటి చికాగోలో ఆచార్యుడు. దీపేశ్ చక్రవర్తి, తన తొలి రచనలలో ఇదే అభిప్రాయానికొస్తాడు. మాతృభాష బెంగాలీలో అతని ప్రభావం ఎక్కువ.. ఏ.కే.రామానుజన్, బ్లాక్ బర్న్ వగైరాలు అంతర్జాతీయంగా జానపదసాహిత్యం ప్రాసంగికత పెంచారు.

కానీ **'విశ్వవిద్యాలయాలలో విద్యార్థి సంఘాలు తమకు కావలసిన సాహిత్యాన్ని పాఠ్యపుస్తకాలుగాపెట్టించగలుగుతున్నాయి' అని తన 'ప్రజల మనిషి'(1995 పుట 6) పరిచయవాక్యాలలో పేర్కొన్న వరవరరావు వగైరాలు, ఉద్యమ సాహిత్యం మీద తప్ప జానపద గిరిజన సాహిత్యం మీద, ఈ అధ్యయనాల మీద దృష్టి పెట్టలేదు. పైగా అవి అమ్మమ్మ నాయనమ్మ కథలని తీసి పడేశారు(సత్నం. జంగల్ నామా) జానపద రామాయణాల మీద రామానుజన్ వ్యాసం ఢిల్లీ విశ్వవిద్యాలయం తొలగించినపుడు వామపక్షాలు ఆందోళన చేసింది జానపదంమీద ప్రేమతో కాదు.** సత్యవతిగారు అనువదించిన ఆ వ్యాసాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది.

**జాతి మనుగడలో మౌలిక సత్యాలను తెలుసుకోడానికి, మేధావులు, కళాకారులు ఆదిమ సమాజాల అధ్యయనానికి పూనుకుంటున్న రోజుల్లో వెన్నెముకలేని మధ్యతరగతి మన సాహిత్యంలోకి ప్రవేశించింది. ఉద్యోగ రీత్యానో, ఉద్యమాల ప్రభావంవల్లనో రేజీకటి కమ్మిన సాహిత్యగాళ్ళకు కొండకోనల వెన్నెలబయళ్ళలో ఆటపాటలు వినిపించలేదు..**

ఇంతమంది, జనందారి మరిచి, తాన అంటే తందానా అంటూ, కాలవాహిని అలలవాలున కొట్టుకు పోతుంటే; శబ్ద అర్థ, స్వార్థ, సాహిత్య కాలుష్యంతో నింపివేస్తుంటే, వేడెక్కిన ప్రకృతి, మరణమృదంగం మోగిస్తుంది.


ప్రజా జీవ పట్టిక (పి.బి.ఆర్)

ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు అకాడమీ, దూలపల్లి

"మేము శిక్షణ ఇవ్వము - మారుస్తాము"

పాలకులు వేడెక్కుతున్న పర్యావరణాన్ని శాంతపరచటానికి జీవ వైవిధ్యపరిరక్షణ చట్టాలు చేసి , పంచాయతీవారీగా అటవీశాఖ అధ్వర్యంలో 'ప్రజాజీవపట్టికలు' తయారు చేయించ సాగారు. ఈచట్టం అమలుచేసే జాతీయ హరిత ట్రిబ్యునల్, శ్రీకాకుళంజిల్లాలో 'బీల తంపర' భూములలో థర్మల్‌విద్యుత్ కేంద్రం పెట్టడానికి కుదరదు అని తీర్పు ఇచ్చింది. ఈ ఉద్యమం మీద చాలా రచనలు వచ్చాయి. కాని ఈ జీవపట్టికలు, యధావిధిగా తెలుగుఅకాడమి పదాలు, పత్రికల భాషతో తయారుచేసారు. వాటిని నింపే ఉద్యోగులు ఏదో పని అయితే అదే పదివేలు అన్నట్లు చూస్తారు..

దాంట్లో వాడే భాష, ఒకనాటి పదకోశాలతో పోలుస్తూ, జనం వాడుకలో వచ్చిన మార్పులు గమనించటం అవసరం. శాస్త్రీయ అవసరాలకు తగ్గ పదాలు తయారుచేస్తాం, భాషను అధునికీకరిస్తాం అంటూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నవారు ఇందుకు పూనుకుంటే, వారు నిర్మించేపదాలు, వాడుకకు ఎంత దగ్గరగా ఉన్నాయో తెలుసుకోవచ్చు. మన పెద్దలు ప్రారంభించిన కృషిని తగు విధంగా సవరించి కొనసాగించవచ్చు. అటు ప్రకృతిని,భాషను కాపాడుకోవచ్చు. అ

**ఏ నుడి నానుడులు అయినా బతికి బట్ట కట్టాలి అంటే అవి విరివి చదువుకు అనుకూలంగా ఉండాలి**

**– బి.స.బంగారయ్య**

బి. లలితానంద ప్రసాద్
92474 99715

# వార్తా పత్రికలలో భాషా పరిణామం

**మన దేశ సామాజిక వికాసంలో పత్రికలు గణనీయమైన పాత్ర పోషించాయి. సంఘ సంస్కరణలోనూ, జాతీయ సమైక్యతతో స్వాతంత్ర్య పోరాటంలోనూ, సముపార్జనలోనూ, అనంతరం ప్రజాస్వామ్యం కొనసాగింపులోనూ ఎనలేని సేవ చేశాయి పత్రికలు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఇంచుమించు ప్రతి అగ్రనేత అది రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ అంతా పత్రికా రచయితలే గాక పత్రికను నడిపిన వారు కూడా. అందరిలోనూ స్వాతంత్ర్యేచ్ఛ రగిల్చి అందరినీ ఒకే త్రాటిపై నడపడంలో వార్తా పత్రికలసేవ సాటిలేనిది.**

తెలుగునాట తొలి పత్రిక ఆరంభమే సామాజిక సంస్కరణ ధ్యేయంగా మొదలైంది. అందుకు మహోన్నత వీరేశలింగంగారి 'వివేకవర్ధని' నాంది పలికింది. అనంతరం స్వాతంత్ర్య పోరాటంలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు దినపత్రిక ఆంధ్ర పత్రిక'నూ దాదాపు రెండు దశాబ్దాల పాఠకులకి ఉచితంగా పంపిణీ చేసి తెలుగునాట పాఠకులు అశేషంగా పెరగడానికి ఎంతగానో దోహదపడ్డారు. అనంతరకాలంలో ముట్నూరి వారి కృష్ణా పత్రిక, సురవరం వారి గోల్కొండ పత్రిక, నెల్లూరు నుండి జమీన్ పత్రిక, ప్రకాశం గారి 'స్వరాజ్య' పత్రికలు తొలిరోజుల్లోనే తెలుగు మాగాణంలో స్వర్ణబీజాలు నాటాయి. ఆనాటి మొలకలు అనంతరం బంగారు పంటలై నిత్యనూతన విత్తనాల, మొలకలనందిస్తూనే ఉన్నాయి.

**విలువలే ప్రాణాధికం:** అప్పటి పత్రికలని కాలానుగుణంగా లేక విషయాలనుగుణంగా వర్గీకరించినా అన్నింటా ఉన్నత ఆదర్శాలు, ఉత్తమ ఆశయాలు లక్ష్యంగా, మనిషిని ఉదాత్తంగా తీర్చిదిద్దు సాధనాలుగా పత్రికలు తీర్చిదిద్దాలనే ఏకైక లక్ష్యంతో, అన్ని విధాలా వ్యక్తి, సమాజ బహుముఖ మానవీయతను, విలువలను, నైతికతను పెంపొందించాలనే మహోన్నత గమ్యం వైపు, నిష్పాక్షికత, సన్మార్గాలు గమనంగా కొనసాగాయి. ఈ కారణంగా సమాజంలో ఆ విలువలను ప్రోది చేయడానికి పాటు పడ్డాయి.

**ప్రజాస్వామ్యంలో వార్తా పత్రికలు:** నాగరిక ప్రపంచంలో ప్రజాస్వామ్యానిది అత్యుత్తమ పాలన వ్యవస్థ. దీనిలో విశ్వమంతా వర్ధిల్లేట్లు చేయడంలో వార్తాపత్రికలకు ఈనాడున్న విస్తృత ప్రాచుర్యం, మన వర్తమాన సమాజం నిస్సంశయంగా ప్రగతి దిశగా ప్రసవ వేదనతో ప్రయాస పడుతున్న ప్రస్తుత తరుణంలో పెద్ద సానుకూలత. అనేకానేక విధాల శక్తి సామర్థ్యాల పెంపుదలకు నిరంతర కృషితో తెలుగు పత్రికలు సమాచార ప్రచారం ద్వారా సంఘ పురోభివృద్ధికి నిర్వహిస్తున్న పాత్ర నాలుగు పుష్కరాలుగా ఎంతగానో రాటుతేలి పదును ఎక్కాయి. నేటి ఆధునిక యుగంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో చైతన్యవంతులైన ప్రజలు సహకారాన్ని, భాగస్వామ్యాన్ని పాలకవర్గాలు ఆశించి పొందటంలో ప్రచార సాధనాలకు ఉన్న ప్రాముఖ్యం ఎంత చెప్పినా తరగదు. వార్తా పత్రికల విషయంలో ఇది మరింత వాస్తవం.

ఇంతటి విశిష్టత గల వార్తాపత్రికలు ప్రపంచానికీ వ్యక్తికీ వారధి లాంటివి. వాటి ద్వారా మనిషి మహిలో జరిగేవన్నీ తెలుసుకోగలుగుతున్నాడు. వార్తాపత్రికలోని భాషా మాధ్యమం ద్వారా. ఆ భాషా వాహిక సరిగా లేకుంటే అందులోనివి అందవలసిన వారికి అందవలసిన రీతిలో అందవు. వాటి నుండి ఆశించిన ప్రయోజనం నెరవేరదు. పత్రికలు సమాజాన్ని తీర్చిదిద్దటంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తాయి, ఆ పత్రికలను తీర్చిదిద్దేందుకు అందులోని భాష అంతటి మౌలిక పాత్ర పోషిస్తుంది. ఇంతటి అత్యంత ప్రాధాన్యత గల భాషా పరిణామం వార్తాపత్రికలలో ఏ రీతిలో ఉందో పరిశీలించటం ఆసక్తిదాయకం. మెరుగు పరుచుకోవడానికి జరిపే ప్రయత్నాలకు ప్రేరకంగాను ఉంటుంది.

ఈ సందర్భంగా భాషకు సంబంధించిన ప్రాథమిక అంశాల ప్రస్తావన అవసరం. **'భాష', 'పెరుగుదల' విషయం ముచ్చటించు నప్పుడు రెండు అంశాలు గుర్తించాలి. ఒకటి- భాష ఎందుకు పెరగాలి? రెండోది- అది ఎలా పెరుగుతుంది? భాష ఎందుకు పెరగాలంటే - మనకోసం. మన రోజువారీ కార్యకలాపాలు, అవసరాలు ఇబ్బడిముబ్బడిగా నానాటికీ పెరిగిపోతున్నాయి. కాబట్టి వాటికి సంబంధించిన ఆలోచనలు, అభివ్యక్తులు తగినంత పెరగాలి కనక భాష పెరగాలి. అది ఎలా పెరుగుతుంది అన్న ప్రశ్నకు సమాధానం - మనం దాన్ని ఉపయోగిస్తే పెరుగుతుందని. మనం ఏ రంగంలో ఉపయోగిస్తే ఆ రంగం ఆ మేరకు అది పెరుగుతుంది. మనం పెరగాలి కనుక మన భాష పెరగాలి. మన భాష పెరగాలి గనక మనం ఇంకా పెరగాలి. పెరగనిదే మనుగడ లేదు. దీనికి గత్యంతరమూ లేదు.**

పత్రికలు, అందులో పని చేయువారు సమాజంలో అంతర్భాగం. కావున పత్రికల్లో సమాజంలో ఉన్న మంచి చెడులన్నీ వారిలోనూ ఉంటాయి. అచ్చంగా మనుషులందరిలో ఉన్నట్లే. అలాగే అన్ని రంగాలకు ఏదో రూపంలో ప్రాధాన్యత వుంటుంది. ఏదీ ఒంటరి కానందున. అందులోని వారు ఎవరూ మిగతా వారికి అతీతులు కాదు. కానీ కొన్నింటిలో భిన్నంగా ఉంటారు. ఉండాలి. ఆ వృత్తి అటువంటిది. ప్రవృత్తితో ఎక్కువగా ముడివడి ఉంటుంది. ఇందులో వేగం తప్పనిసరి. కాలంతో పాటు ఇతర పత్రికలతోనూ పోటీ పడాలి ప్రతిక్షణం. వార్త సేకరణ, ముద్రణ, అందించటం అన్నింటా. ఇది సామాన్యమైన విషయం కాదు. అందుకే ఓ కవి మాటల్లో ' ఇది

కలంతో సాము/ హలంతో సాము/ కోలాహలంతో సాము/ హాలాహలంతో సాము' అనటం వాస్తవ చిత్రణమే.

మారే కాలంతోపాటు పత్రికల ధోరణులు మారుతుంటాయి. కొత్త కొత్తవి విన్నూత్న ఆకర్షణలతో, తాజా వార్తలతో, అదనపు సమాచారంతో, ఇంటిలోని అందరికీ ఉపయోగపడే శీర్షికలతో పాఠకులను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఒకప్పుడు వారంలో ఒక రోజు అది ఆదివారం ఏ కొలది స్థానములోనే సినిమా రంగం, వ్యాపార విషయాలు వేసేవారు. ఇప్పుడివి ప్రతిరోజు పూర్తినిడివి పేజీల్లో రంగురంగులతో రావడం ప్రారంభమైంది. అలాగే ఇంట్లో పిల్లలు, స్త్రీలకు సంబంధించినవి, విద్య, ఆరోగ్యం లాంటి ఇంటిల్లిపాదినీ ఆకర్షించే అంశాలు విరివిగా ప్రచురించటం ఆరంభించాయి. వార్తాపత్రిక లక్ష్యాన్ని పూర్తిగా వ్యాపార ప్రయోజనాలాక్రమించాయి. సమస్త విలువలకు తిలోదకాలు ఇచ్చేసాయి. సహజంగానే వీటన్నింటి ప్రభావం వార్తాపత్రికల భాష పైన పడింది. పడుతూనే ఉంది. ఇదే సమయంలో వార్తల విస్తృతి పరిధి అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి నుండి స్థానిక స్థాయికి వ్యాపార లక్ష్యాలకు, లక్షణాలకు అనుగుణంగా కుదించుకు పోయింది. ప్రపంచంలో, దేశం, రాష్ట్రంలో ఏమైనా పర్వాలేదు. తాను ఉన్న ప్రదేశం ఒకటే ముఖ్యం అనే దుస్థితికి పాఠకులని, ప్రజలనే నిస్సిగ్గుగా దిగజార్చారు. వార్తాపత్రికల భాషలో వచ్చిన మార్పులకి ఇలాంటివి దోహదపడ్డాయి. పర్యవసానంగా ఉత్తమ ఉన్నత అభిరుచుల, విలువల స్థానంలో అన్ని రకాల అరాచక భాషా ధోరణులు పత్రికలను ఆక్రమించాయి. ఒకప్పుడు తిట్లు గా పరిగణించే 'దమ్మ్', 'పీకడం', 'దగుల్బాజీ' లాంటి అనేక కుసంస్కార మాటలు పతాక శీర్షికల్లోనూ సర్వసాధారణమైపోయాయి. ఎంత అధమ భాష వాడితే అంత గొప్పగా చలామణి అవ్వడం పరిణామక్రమానికి అద్దం పడుతుంది. ఇవి పూర్తిగా ఆక్షేపణీనీయం. అవాంఛనీయం. పరిహరణీయం.

**వార్తాపత్రికలలో భాష పరిణామ క్రమాన్ని అంతటినీ ఏక వాక్యంలో చెప్పాలంటే, వార్తాపత్రికల్లో భాష గ్రాంధికంతో ప్రారంభమై, సరళ గ్రాంధికమై, వ్యవహారికంగా మారి, వాడుకభాషలోకి ఒదిగి, పరభాషా సంకరంతో, సినీ భాష చౌరబాటుతో, ఉపయోగించు వారి శక్తి సామర్థ్యాల చలవతో వంకర టింకరగా వర్ధిల్లుతోంది.** తొలినాళ్లలో ఎంతో కృషి సల్పిన వీరేశలింగం,ఖాసా సుబ్బారావు, కాశీనాధుని నాగేశ్వరరావు, తాపీ ధర్మారావు, ముట్నూరి, నార్ల లాంటి వారెందరో ప్రాతఃస్మరణీయులు కలరు. వారంతా ఎంతగా కృషి సల్పి పత్రికా భాష పరిపుష్టం గావించారో అంతగా అనంతరం వారు తమదైన స్థాయిలో పలచన గావించారు. పత్రికల్లో భాషా పరిణామానికి సంబంధించి ఎందరో సంపాదకులకి శిక్షణ ఇచ్చిన విశిష్ట సంపాదకులు ఏబీకే ప్రసాద్ 1984లో తణుకులో ఒక శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ప్రస్తావించింది – **'పెద్దలందరూ పునుకొని ఆకాశంలోని అక్షరాన్ని నేలపైకి తెచ్చారు. ఇప్పుడు దాన్ని తలా ఒక చేయి వేసి( జిల్లాల పేరుతో) పాతాళంలో కప్పి పెడుతున్నారు'.** అన్నారు. దీనికి మరే వ్యాఖ్య అవసరం లేదు. అది 1984 సంవత్సరం నాటి మాట. ఈ మూడున్నర దశాబ్దాల్లో వచ్చిన వస్తున్న మార్పుల గురించి ఎంత చెప్పినా రాసినా తక్కువే. అది 'ముంజేతి కంకణం'. పరిణామం అనేది ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి తీసికెళ్ళి ఉదాత్తత దిశగా బాటలు వేయాలి. అందుకు విరుద్ధంగా అయితే 'నానాటికి తీసికట్టు నాగంబొట్టు' – అన్పిస్తుంది. అది దుష్పరిణామమే.

**మార్గదర్శి నార్ల వెంకటేశ్వరరావు:** తెలుగు వార్తాపత్రికలు అనగానే భాష పరంగానూ, సంపాదకుని గానూ మార్గదర్శిగా మన అందరికీ గుర్తుకు వచ్చేది నార్ల వెంకటేశ్వరరావు గారు. వారు భాష గురించి చెప్పింది ప్రామాణికం, పత్రికలకు సంబంధించిన ఇతర అంశాలు కూడా – " దైనందిన జీవితానికి దర్పణం జర్నలిజం. ఈ కారణాన తక్కిన వారి కంటే జర్నలిస్టు జీవితంతో మరింత సన్నిహిత సంబంధం పెట్టుకోవాలి, మరింతగా దాని నుంచి పాఠాలు నేర్చుకోవాలి.'' అంటారు. అలాగే భాష ఎట్లా ఉండాలో తెలియపరుస్తూ – " రెండు తరాల క్రితం వరకు బ్రిటిష్ జర్నలిజంలో ఆక్స్ఫర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీ పట్టభద్రులకు స్థానము లభించేది కాదు. లండన్లోని ఒక వీధి పేరు 'ఫ్లీట్ స్ట్రీట్' పత్రికలన్నీ ఆ వీధి నుంచే, లేదా దాని చుట్టుపక్కల నుంచే వెలువడుతుండేయి. సామాన్య పాఠకులకు అర్థంకాని పదజాలాన్ని వాడతారని వారిని ఫ్లీట్ స్ట్రీట్లోకి అడుగుపెట్టనిచ్చేవారు కాదు. క్రింది మెట్టు నుండి పైదాని వరకు వెళ్లే వారు దానిలో ఎక్కువగా రాణిస్తారు. నా తొలి ఉద్యోగం ప్రకాశం గారి 'స్వరాజ్య'లో. రిపోర్టర్లు "అలాగే కర్తవ్య నిర్వహణ పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ" చేస్తున్న పనిని, ఏదైనా సరే, మనసు పెట్టి చక్కగా చేయడంలోనే జీవితానందం సగానికిపైగా దాగుంది. తమ వృత్తి ధర్మాలను ఈసురోమంటూ నిర్వహించేవారు. తమ జీవితాల్ని తామే దుస్సహం చేసుకుంటారు. జర్నలిస్టులు ఎవరినీ, దేన్నీ నిర్లక్ష్యం చేయరాదు." ఈ వృత్తి ప్రత్యేకత తెలుపుతూ' "ఇందులో ఆరోగ్యం చెడిపోగల ప్రమాదం ఉంది. అయినా దీనిలో ఆనందం కూడా ఉన్నది". ఇది వాస్తవం. వారు ఈ మాటలు పత్రికా భాష ఎట్లా ఉండాలో తెలపడమే గాక వాటిలో పని చేయువారు వ్యక్తిగత లక్షణాలు ఎలా ఉండాలో కూడా తెలిపారు. ఇవి సదా స్మరణీయం. ఆచరణీయం.

అంతటి విలువైన విషయాలు తెలిపిన నార్ల గురించి సుప్రసిద్ధ సినీ పండిత పాటల రచయిత వేటూరి సుందర రామ్మూర్తి గారి మాటల్లో నార్ల వారు –

"పాత్రికేయుల వృత్తికి సరికొత్త ధ్యేయం ఏర్పరిచిన వారు నార్ల గారు. పత్రికల్లో వ్యవహారిక భాషను, పల్లీయుల స్థాయికి, పామరుల స్థాయికి తేవడంతో పాటు తెలుగు పత్రికలు ఒక నిత్యావసర వస్తువుగా, అది చదవకపోతే పొద్దు గడవని స్థాయికి కూడా తెచ్చిన ఘనత నార్ల గారికే దక్కుతుంది. **ఉప్పు ముట్టుకుని బ్రిటిష్ సింహాసనాన్ని వణికించిన మహాత్ముని వలె, మౌలికమైన ఈ నుడికారాలతో ప్రజాహృదయాలను చూరగొన్నారు నార్ల గారు.** పత్రికలు శిష్ట వ్యవహారికంతో చదువుకున్న వారు కొందరికే ఉపయోగ

పడుతున్న రోజుల్లో, గౌరవ వాచకాలు, బహువచనాలు మొదలైన అడ్డంకుల్ని తొలగించి, తనలో తను ప్రతి మనిషి అనుకునే ప్రథమా విభక్తులు, ఏక వచనాలు, పత్రికలకు అందించిన ఘనత నార్ల గారిదే. వ్యక్తిని బట్టి వాడే పదాల మార్పు, కూర్పు చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. నేను కొత్తగా వారి శిష్యరికంలో పాత్రికేయునిగా కలం పట్టినపుడు నాకు చెప్పిన మొదటి మాట **'వార్తలు రాసేటప్పుడు ఆంగ్ల పద్ధతి మనకు పనికిరాదు. ఎవరు, ఏమిటి, ఎప్పుడు, ఎక్కడ అనేది వారి పద్ధతి. ఏమిటి, ఎప్పుడు, ఎక్కడ, ఎవరు అనేది మన పద్ధతి, అని'.** సాంఘిక న్యాయం కోసం నిరంతరం సంగ్రామం జరిపిన మహా వీరుడు నార్ల. ఆయన 'చదివినది సిందువైతే రాసింది బిందువనే' అనాలి. బహుశా ఈ జన్మకి ఇది చాలు అన్నట్లు క్లిష్ట సమయంలో తెలుగు పత్రిక ద్వారా జాతిని ఉత్తేజపరచిన వైతాళికుడు నార్ల. పత్రికలపై ఈగ వాలినా ఆయన సహించేవారు కాదు. బుద్ధుడు, గాంధీజీ మాట అటుంచి ముట్నూరి కృష్ణారావు, కోటంరాజు రామారావు, తాపీ ధర్మారావు, వేటూరి ప్రభాకర శాస్త్రి అంటే ఆయనకు ఎనలేని అభిమానం." ఈ విధంగా వేటూరి నార్ల గురించి చెప్పడంతో పాటు వారు భాషా పరంగా పత్రికా రంగానికి చేసిన సేవలను ప్రస్తుతించారు. ఈ మాటలతో పత్రికల ప్రాశస్త్యం, భాష తీరుతెన్నులు, వాటి మార్పులకు కారకులెవరో సంక్షిప్తంగా అయినా సమగ్రంగా చెప్పారు వేటూరి.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాఘవాచారి:ఇటు ప్రాచీన అటు ఆధునిక సాహిత్యంపై సాధికారతతో పాటు సంస్కృతం, ఆంధ్ర, ఆంగ్లంతో పాటు న్యాయశాస్త్రం లోనూ ఎంతో పట్టు ఉన్నటువంటి సంపాదకులకే సంపాదక స్థాయి కలిగిన మరో మహోన్నతుడు సి.రాఘవాచారి గారు తన వ్యాసాలలో ఇతర భాషా పరిణామాల్లోని అనేక అంశాలు ఉన్నది ఉన్నట్లుగా వివరించారు. అవి వారి మాటల్లోనే – " పత్రికల్లో భాష ప్రామాణికం చేయకపోవడంతో విశృంఖలత పెరిగింది. ఎడిటింగ్ లో సెన్సేషన్, ప్రాసకు, నివారించదగిన ప్రయాస ప్రాధాన్యం ఏర్పడింది. ప్రింటింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ రంగప్రవేశంతో పత్రికా రచన వృత్తిలో చేరగలిగే వారి సంఖ్య తగ్గిపోయింది. ప్రింటింగ్ క్వాలిటీ పెరిగిందే కానీ కంటెంట్ క్వాలిటీ కాదు. ఫలానా పత్రిక ఫలానా పార్టీ, ఆ పార్టీలో ఫలానా గుంపుది, ఫలానా వ్యక్తికి అనుకూలంగా రాస్తుంది'. అనే భావన పాఠకుల్లో కలుగుతోంది. ఆ మేరకు విశ్వసనీయత, నిష్పాక్షికత నీరసిస్తుంది. **రాజకీయేతరంగా ఉన్న ముఖ్య సమస్యలపై ప్రజలకు సమాచారాన్ని అందజేయడం రాను రాను సన్నగిల్లుతోంది.** ఇప్పటి తీరు ఎలా ఉన్నా సంఘ సంస్కరణ, భాషా సాహిత్య రంగాలకు గతంలో పత్రికా సేవలు ప్రశస్తం." వర్తమానం పరిస్థితులకు మరింతగా అద్దంపడుతూ– – " యజమానులు – యజమానుల మధ్య సాగుతున్న కుస్తీకి, సంపాదకులు హెడ్ లైన్ల కుస్తీ జోడు చేశారు. ఫలితం హెడ్లైన్లు జోడు గుర్రాల సవారీ చేస్తున్నాయి. కింద వార్త లో ఉన్న ముఖ్యమైన విషయాన్ని సూచించటం హెడ్ లైన్ ల కర్తవ్యం. ఈవేళా రేపు కనబడుతున్న హెడ్ లైన్లలో ఆ కర్తవ్యాన్ని నెరవేర్చే విధంగా హెడ్డులైన్లు పెట్టేవారు అంతా కృతయుగంలో ఉండాల్సిన వారే. ప్రాసలు, పద విన్యాసం మహా కవుల పద్యాల లైన్లు, సినిమా పాటల్లోని చరణాలు ఏదైనా శీర్షిక సాహిత్యంలో 'కాదేదీ' అన్నట్లు సర్వసాధారణమైపోయింది. ఎన్ని ఎన్ని కాలములు వార్తలు ఇవ్వాలో మేనేజర్ నిర్ణయిస్తాడు. ఆఖరి నిమిషంలో వచ్చి నాకు రెండు కాలమ్స్ అడ్వర్టైజ్మెంట్స్ ఉన్నాయంటే ఆ మేరకు వార్తలు తీసిపారెయ్యాలిసిందే. ఇది రెండో పరిణామం".

**సంపాదకుల నైజానికి సంబంధించి:** వారి మాటల్లోనే – "ఎప్పుడైతే సంపాదకుడు తాను సంపాదకీయం రాసి కూడా మరెవరో తాను వ్రాసాను అంటే నోరు మూసుకుని కూర్చోవాల్సి వస్తుంది అంటే ఈ సంపాదకులు స్వయంగా ఘోస్ట్ రైటర్లగా తయారయ్యారని వేరే చెప్పాల్సిన పని లేదు. వీరిలో ఇంకో తరహా కూడా ఉన్నారు. ఆరోజు సంపాదకీయం ఏ విషయం మీద రాయాలి, అందులో ఏ వైఖరి అవలంబించాలని యజమాని చెబుతాడు. దానికి అక్షర రూపం ఇవ్వడమే వారి పని. మరొక తరహా ఆయన సంపాదకీయం మాత్రమే రాస్తారు. ఇంకే పనీ చేయరు. ఆయన సాంప్రదాయ సంపాదకుడు కాదు. కానీ ఆయన సంపాదకునిగా చలామణి అవుతున్నాడు. సంపాదక స్వాతంత్రంపై యాజమాన్య పట్టు ఇంకా ఇంకా బిగిస్తోంది. సంపాదకులు కేవలం నిమిత్త మాత్రంగా మిగిలిపోతున్నారు. తమ సంపాదకీయంలో ప్రపంచంలోని సమస్యలన్నింటికీ పరిష్కారాలు చెప్పే సంపాదకులు తమ సమస్యకు పరిష్కారం వెతుక్కోలేరా?" అనే మిలియన్ బిలియన్ డాలర్ల ప్రశ్న పత్రికా రంగం ముందుంచారు. ఈ సందర్భంలో సంపాదకీయాల గురించి 1984 లోనే' ఏబీకే' గారి మాటలు ఒకసారి గుర్తుచేసుకుందాం. "మీరు ఎడిటోరియల్స్ అని చదువుకునే వన్నీ నిజానికి ప్రొప్రయిటోరియల్స్". ఇక ఇప్పటి మాట చెప్పనవసరం లేదు. ఈ రంగంలో పనిచేసే వారి గురించి చెబుతూ – " ఉద్యోగులు జీతం కోసం పని చేస్తారు. పాత్రికేయులు అంతే. అయితే నైపుణ్యతను, సమర్ధతను, అనుభవాన్ని పెంచుకోగలిగితే వారి వృత్తిలో రాణించటానికి తోడ్పడుతుంది." అని స్పష్టం చేశారు.

**రాఘవాచారి గారు పత్రికల్లో భాషల గురించి** కూడా సవివరంగా తన వ్యాసంలో పేర్కొన్నారు. దానికి వారు భాష – అనివార్య మార్పు అనే శీర్షికతో సవివరంగా మన ముందుంచారు. ఇవి వారి మాటల్లోనే – " సాంఘిక సంస్కరణలకు ఉపయుక్తమైన మాధ్యమాలుగా నూరేండ్లకు పైగా గుర్తించదగిన పాత్ర నిర్వహించిన తెలుగు పత్రికలు భాషా వికాసానికి ప్రజలకు సాహిత్య రీతుల్ని సన్నిహితం చేయడంలోనూ గణనీయమైన భూమిక నిర్వహించాయి. ఈనాడు తెలుగులో వ్యవహారిక భాషకు పట్టంగట్టిన పరిస్థితులకు ప్రజాబాహుళ్యం సాధనాలైన సినిమా, రేడియో, టీవీలతో పాటు బహుశా కొంచెం ఎక్కువగానే దోహదం చేసింది పత్రికలని జిజ్ఞాసువులు అంగీకరించక తప్పదు. ఈ విషయంలో ప్రత్యేకించి సాహిత్య పత్రికలుగా– వార పక్ష మాస వర్గీకరణ కిందకి వచ్చేవి– పేర్కొనబడే వాడి ప్రయత్నాలకు తోడు అధికతర ప్రాచుర్యం, ప్రామాణిక వ్యవహార భాషలో కల్పించినవి దిన పత్రికలు. ఈ పరిణామ క్రమంలో ఎన్నెన్నోపార్శ్వాలు ఉన్నాయి. సంఘంలో

మారుతున్న పరిస్థితుల పట్ల, అందుకు దారితీసిన పరిస్థితులు పట్ల అలాగే పత్రిక భాషగా తెలుగు ప్రయోజనం ఏమిటో నిర్దిష్టమైన అవగాహన ఉంటే తప్ప ఇప్పటిలో అందులో వచ్చిన మార్పులను గాని, తప్పనిసరిగా ముందు రాబోయే మార్పులను గాని అర్థం చేసుకోవడం ఆహ్వానించటం సాధ్యం కాదు".

**పత్రికల్లో భాషా వినియోగం:** దీని గురించి తెలుపుతూ "పరిశుద్ధ భాషా పదాలు చాందసంతో నిమిత్తం లేకుండా వ్యవహారంలో కొనసాగుతున్న భాషనూ వాక్యనిర్మాణ అన్వయ విభక్తి పరమైన ఇతర సాధారణ నియమాలకు అనుసంధించి వినియోగంలోకి తెస్తున్నవి పత్రికలనటంలో సందేహం లేదు." అంటూ "విశ్వవిద్యాలయాల్లోనే వ్యవహార భాష వరదలై పారుతున్నప్పుడు పత్రికల అక్కర చెప్పనక్కరలేదు" అలాగే వర్తమాన స్థితిగతులను వివరిస్తూ- "పారిభాషిక పదాలు ఏకరూపత సంబంధించి ఇప్పటికీ అన్ని పత్రికలు పాటించగల సూటి నియమ పట్టిక ఏదీ లేదు( స్టైల్ షీట్). రోజూ భాషతోనే తంటాలు పడుతున్న లోక వ్యవహారాల్లో కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నా భావన సంపుటికి తగ్గ పదాల పొందికలో ప్రాప్తకాలజ్ఞత తప్ప ప్రయోగ విశిష్టత కానరావటం లేదు. వస్తూనిష్ఠను తెలుగు పత్రికల్లో సీనియర్లయిన శిష్టుల వ్యవహారమే ఆ భాషకు ప్రమాణంగా ఉండాలన్న ఆ నాలుగు గోడల వెలుపల జరుగుతున్న మార్పులను మదించి యిమడ్చడానికి ప్రయత్నం ప్రణాళికాబద్ధంగా సాగడం లేదు"అని కుండ బద్దలుగొట్టారు.

తెలుగు వార్తా పత్రికలలో సుదీర్ఘకాలం అంకితభావంతో, సమాజం పట్ల, మనిషి పట్ల, పత్రికల పట్ల పూర్తి నిబద్ధతతో కడవరకూ పనిచేసి ఎందరెందరినో అమితంగా ప్రభావితం గావించిన నార్ల, రాఘవాచారి గార్ల పై ఉటంకింపులతో ఈ వ్యాసకర్త పూర్తి ఏకీభావం ఉండడంతో వాటి ప్రస్తావన తప్పనిసరి అయ్యింది. ఇక అదనంగా వాటిపై ఏమి వ్యాఖ్యానించినా అది సూర్యుని ముందు దివిటీ కాగలదు.

**విశ్వ వీక్షణలో ఆంగ్ల భాషావశ్యకత:** వార్తా పత్రికలకు మూల సమాచారం పీటీఐ, యుఎన్ఐ, ఐయేఎన్ఎస్ లాంటి ఏజెన్సీల ద్వారా లభిస్తుంది. ముఖ్యంగా జాతీయ, అంతర్జాతీయ, ఇతర రాష్ట్రాలకు సంబంధించి. అవన్నీ సహజంగానే ఆంగ్లంలో ఉంటాయి. వాటిని ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా తప్పనిసరి. ఈ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఉన్నాయి. అనువాదకునికి ఇరు భాషల్లో తగినంత పరిజ్ఞానం ఉంటే తప్ప ఇది సఫలం కాదు. వీటికి సంబంధించి పెద్దపెద్ద పత్రికలు కూడా అనేకసార్లు తప్పులో కాళ్లు వేస్తూ ఉంటాయి. వీటికి సంబంధించి నిక్కచ్చి విమర్శకులు, సాహసి రాచమల్లు రామచంద్రారెడ్డి( రారా) గారు: ఇలాంటి వాటిపై ఏమంటున్నారో చూస్తే అనువాదం ఎట్లా ఉండాలో తెలుస్తుంది." కేవలం మాటల అర్థాన్ని కాక, అర్థం వెనుక ఉండే భావాన్ని తెలుగులోకి తేవటం అనువాదకుడి కర్తవ్యం. అలా అని సొంత కవిత్వం దూర్చే అధికారం లేదు అనువాదకుడుకి". మనం కొన్ని యథాలాపంగా వాడే మాటల్ని వాటి మూలాల్ని తెలుపుతూ – " ధన్యవాదాలు అనేది హిందీ మాట తెలుగులో కృతజ్ఞతలు అనాలి. ధన్యవాదాలు అని ఎవరైనా అంటే వాళ్లకు తెలుగు రాదని చెప్పాలి". అని నిక్కచ్చిగా చెబుతారు. ఇలాంటి అంశాల్లో ఆయన ఎంతటి పత్రికలనైనా, ప్రముఖులనైనా కూడా వదిలిపెట్టలేదు. పత్రికా రంగంలో వారే కాక భాష పట్ల, అనువాదాలు పట్ల, సాహిత్యం పట్ల ఆసక్తి గలవారు ఎవరికైనా వారి' అనువాద సమస్యలు' అనే గ్రంథం కరదీపిక. వారు ప్రస్తావించిన అనేక అనేక అంశాల్లో పాఠకుల ఉపయోగార్థం కొన్ని- "ఇంగ్లీష్ భాషా నియమాలు ఆంగ్ల భాషా పదాలకు వర్తించవని ప్రాథమిక సూత్రాన్ని అనువాదకుడు గుర్తు పెట్టుకుంటే పొరపాట్లు పరిష్కరించడానికి ప్రయత్నమైనా జరుగుతుంది. రాసినట్లు పలకడంలో, పలికినట్లు రాయడంలో అనే పద్ధతి భారతీయ భాషల్లో ఉన్నట్లు యూరోపియన్ భాషల్లో లేదు. ఇంగ్లీష్ ఉచ్చారణలో నియమాలు ఇతర భాషా పదాలకు వర్తించవనే సూత్రం నిత్యం మన బుర్రలో మెదులుతూ ఉంటే, మనం కాస్త బాగు పడతాం" అంటారు రారా. ఇది ముమ్మాటికీ నిజమే కదా!

తెలంగాణ జన జీవన సాంస్కృతిక వికాసానికి దోహదపడిన త్రయంగా పేరుగాంచిన వారిలో ఒకరైన సామల సదాశివ (మిగతా ఇద్దరు సురవరం, కాళోజి) గారి మాటల్లో పర భాషల ఆదాన ప్రదానాల గురించి "భాషల మధ్య అన్యోన్యంతోనే అనాదినుండి అభివృద్ధి చెందినాయని,భాషా సంస్కృతుల కలయిక వల్ల హృదయాలు విశాలమై ప్రజల మధ్య సాన్నిహిత్యం, వ్యవహార బాంధవ్యాది సంబంధాలతో సమన్వయము ఏర్పడుతుంది" అని వారి 'ముచ్చట్లు,సాహితి స్వర రాగాలు' స్పష్టపరుస్తున్నాయి. ఎన్ని భాషలొస్తే అన్ని అదనపు మెదడులున్నట్లే.

**అలనాటి సంపాదకీయాలు:** దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం, అప్పటికీ ఇప్పటికీ అనేక ప్రయోజనాత్మక ప్రయోగాలతో అగ్రగామిగా ఉన్న ఈనాడు దినపత్రికలో సంపాదక శీర్షికలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం ఆసక్తిదాయకం. వాటిలో కొన్ని' ఇల్లలకగానే పండగ కాదు'11/9/81' సగం బుర్ర చాలు'13/9/81, వాములు మేసే స్వాములు18/9, ఆది లోనే హంస పాదు23/9, చిన్న పామునైనా 25/9, ఆవు చేలో మేస్తే 28/9, ఆలస్యం అమృతం విషయం 6/10, అసిధారావ్రతం 17/10/81, శ్రీరంగనీతులు 30/1/82, పురిటిలోనే సంధి 12/2, చల్లని చావు కబురు 21/2, ఉట్టికెక్కలేనమ్మ 12/3, పుండుమీద కారం29/4, సూది కోసం సోది కెళితే 11/5, పుట్టుకతో వచ్చిన బుద్ధి21/5, మంత్రాలకు చింతకాయలు 16/6/82. వీటిని ఇప్పుడు వస్తున్న వాటితో పోలిస్తే అప్పటికీ ఇప్పటికీ వచ్చిన, వస్తున్న మార్పులు అవగతమవుతాయి. అప్పటి వాటిలో కొన్ని వింతగా ఉన్నాయి. ఉదాహరణకు 9/9/1981 సంపాదక శీర్షిక ' గొడ్డు మోతు లెక్కలు'. సహజంగా గొడ్డు మోతు అనే పదాన్ని జీవుల పునరుత్పత్తి సంబంధించి, అది లోపించటాన్ని సూచిస్తుంది. ఆ విధంగానే వాడుకలో ఉంది. మరి ఇక్కడ లెక్కలకు దానిని ఆపాదించటంలో కవి హృదయమేమిటో వారికే తెలియాలి. ఇలాంటివి బహిష్కరించడం పత్రికకి పాఠకులకి శ్రేయస్కరం.

**తాజావార్తలు- భాషా వికాసం:** ఎన్నో విశిష్టతలతో,

ప్రత్యేకతలతో జగమెరిగిన ఈనాడు దినపత్రిక' తాజా సంచిక 311, సంపుటి 25, తేదీ 15 ఫిబ్రవరి 2021 మెయిన్ పేజి మెయిన్ హెడ్డింగ్ పరిశీలన ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది. ఇది 'రుధిర దారి' పెద్ద అక్షరాల్లో బ్యానర్ ఐటెంగా ముద్రించారు. కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం సంబంధించి. ఈ వ్యాసం రాసే ఆలోచనతో పై హెడ్డింగ్ చూసి లైబ్రరీలో ఎదురుగా ఉన్న, రోజూ అన్ని పత్రికలు చదివే అతన్ని అడిగాను, ' రుధిర' అర్థం ఏమిటని. అతను ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నప్పటికీ చెప్పలేకపోయారు. చివరకు మరీ బాగుండదని పక్కన దారి అని ఉండడంతో 'మలుపు' అన్నాడు. దీని గురించి ఎంతైనా రాయొచ్చు. క్లుప్తంగా, అంతటి విషాదంలోనూ ఎవరికీ అర్థం కాని ఆ కఠినమైన పదం అవసరమా? అదీ ఈ రోజుల్లో!. అందునా వాడుకభాష కొరకు, మాతృభాష అవతరణకు కంకణం కట్టుకున్న లక్షలాది మంది చదివే దినపత్రికలో. దాని పక్కనే మరో పెద్ద హెడ్డింగ్ ' తెరపైకి పుర పోరు'. మధ్యలో మాట ఎంత మందికి తెలుస్తుందో తెలియదు. అసలా యతి,ప్రాసల,అక్షర వ్యామోహంలో పాఠకులకు వెంటనే అర్థమైనా కాకపోయినా వారికి పర్వాలేదనిపిస్తుందేమో. వీటికి ముగింపు లేకుంటే పత్రికతోతో పాటు పక్కన నిఘంటు ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పత్రికల్లో భాషా పరిణామం ఏ వైపు పయనిస్తుందో పునరాలోచించుకోవాల్సిన అవసరం వస్తుంది. దీన్నిబట్టి మనం ఎక్కడి నుండి ఎక్కడకు బయలుదేరి ఎక్కడకు వచ్చి ఎక్కడికి వెళుతున్నామో అర్థమవుతుంది. ఈ ధోరణిలో తప్పనిసరిగా మార్పు రావాలి.

**మాతృభాష మాధుర్యం:** అన్ని భాషలకు ఉన్నట్లే మన తెలుగుకి ప్రత్యేకమైన పలుకుబడులు, నుడికారం, జాతీయాలు, సామెతలు లాంటివి ప్రామాణిక భాషతో పాటు మాండలికాల మాధుర్యాలు అపారంగా కలవు. వాటిని సందర్భోచితంగా ఉపయోగించగలిగితే పాఠకునికి సమాచారంతో పాటు భాషా పరిమళాన్ని అందించినట్లు కాగలదు. ఈ విషయంలో భాషాపరంగా ఏమాత్రం రాజీ పడని 'కాళోజీ' మాటలు సదా స్మరణీయం ఆచరణీయం. **"వాడకంలో పలుకుబడి తప్పనిసరి, బడి పలుకు కాదు".** అలాగని అతిగా వెళ్లి ఔచిత్యాన్ని మరవరాదు. యతి, ప్రాసలకై పాకులాడి అపహాస్యం పాలు కారాదు. కరుణార్ద్ర అంశాల్లో భాషా పాండిత్య ప్రదర్శన ఏమాత్రం కూడదు. అలా అని చౌకబారు రాజకీయ ఆరోపణ ప్రత్యారోపణలు పేరుతో జరిగే తిట్ల పురాణాన్ని పరిహరించి సంస్కారయుతంగా ప్రకటించాలి. భాష పట్ల ప్రత్యేక శ్రద్ధ, నిరంతర అధ్యయనం, మార్పుల పట్ల అవగాహన ఉంటే తప్ప ఇది సాధ్యం కావు. ఏ భాషా తనంతట తాను గొప్పది కాదు. తక్కువది కాదు. దాని శక్తి సామర్థ్యాలన్నీ ఉపయోగించే వారి స్థాయిని బట్టి ఆధారపడి ఉంటాయి. ఇందుకు నిరంతర శ్రమతోపాటు ప్రతి సూక్ష్మ అంశంలోనూ సునీత పరిశీలన అత్యంత ఆవశ్యకం. వాక్యంలో కర్తలు, క్రియలు, వచనాలు, విభక్తులు కుదరనప్పుడు కొత్త వ్యాకరణానికై ప్రయత్నించాలి. అందుకు కావాల్సింది సాహసం కాదు. విజ్ఞత అని గుర్తుంచుకోవాలి.

**మహోన్నత బాధ్యత:** నిత్య పురోగమన శీల సమాజాన్ని సంతృప్తి పరచడం సామాన్య విషయం కాదు. అందునా విలువలకై తపించు వారికి మరింత కష్టసాధ్యం. సాధ్యం కాని వాటిని సాధించుటలోనే వ్యక్తి ఔన్నత్యం కనిపించేది, ఆత్మ సంతృప్తినిచ్చేది. దానికి ఏదీ సాటి రాదు. భాషా పరిణామక్రమాన్ని సక్రమంగా అర్థం చేసుకోగలిగితే వర్తమానంలోని లోటుపాట్లను సరిచేసుకుని మెరుగులు దిద్దుకోవచ్చు. తద్వారా వ్యక్తిగా తనకు తాను, పని చేసే పత్రికకీ, అంతిమంగా సమాజానికి మేలు చేసిన వారు కాగలరు. ఇందుకోసం తాను 'విశ్వ మానవుడై' అక్షర దీపాల ఉషోదయ కిరణాలతో– జగతిలో అలముకొన్నచీకటిని పారద్రోల గలగాలి. అందుకై ఇందులోని అంశాలు తప్పక ఉపకరిస్తాయని ఆశాభావంతో.

–ఈ వ్యాస రచయిత

విశ్రాంత ఆచార్యులు ఎం.బి.ఎ.(హెచ్ఐడి)



–వాచస్పతి

(గత సంచిక తరువాయి...)

# పదనిష్పాదనకళ 9

*The joy of coining new words!*

**ఆరో అధ్యాయం**

**తెలుగు ఉపసర్గల సహాయంతో కొత్త క్రియాధాతువుల నిష్పాదన పద్ధతి**

**ఉపోద్ఘాతం : ఉపసర్గలంటే ఏంటి ?**

ఉప అంటే దగ్గఱ. సర్గ అంటే సృష్టించడం. అంటే, మూలధాతువుకి దగ్గఱగా ఉన్న అర్థంలో కొత్త పదాల్ని సృష్టించడానికి ఉపయోగపడేది ఉపసర్గ. ఆంగ్లంలో Prefix అంటున్నారు. ఉదాహరణకి – Reduction, deduction, induction, production మొదలైన పదాలలో అసలు (ల్యాటిన్) క్రియ ducio. దానికి re- de- in- pro ఇత్యాది కొసఱు పదాల్ని ముందుచేరిస్తే అర్థం మారుతుంది. అంటే ఉపసర్గల సహాయంతో ఒక క్రియని పదీ–ఇఱవై భిన్న అర్థాలలో రూపాంతరించి వాడుకోవచ్చునన్నమాట. ఫలితంగా, భాషలో పదసంపద పదీ–ఇఱవై రెట్లు పెఱుగుతుంది. అలాగే, ఉదాహరణకి – సంస్కృతంలో హృఞ్ (తీసుకోవడం) అనేది మూలధాతువు కాగా దానికి ఉపసర్గల్ని చేర్చడం ద్వారా వివిధ అర్థాల్లో వాడుకునే సౌలభ్యం ఉంది.

*ఆ + హృ – ఆహార = తిను; వి + హృ = విహార = వాహ్యాళి చేయి; ప్ర + హృ = ప్రహార = కొట్టు; సమ్ + హృ = సంహార = చంపు; ఉప + హృ = ఉపహార = తీసుకురా; ఉప + ఆ + హృ = ఉపాహార = టిఫిన్ చేయి; ఉప + సమ్ + హృ = ఉపసంహార = వెనక్కి తీసుకో.* అలాగే, **భూ** అనే మూలధాతువుకి కావడం, ఉండడం అని అర్థాలుండగా, వివిధ ఉపసర్గల మున్ జేర్పు వల్ల రకరకాల కొత్త క్రియాధాతువులేర్పడి కొత్త అర్థాల్ని ఇస్తాయి. ఉదాహరణకి *సమ్ + భూ = సంభవతి = జఱుగుతోంది; ప్ర + భూ = ప్రభవతి = చేయగలుగుతున్నాడు; పరి + భూ = పరిభవతి = అవమానిస్తున్నాడు; అను + భూ = అనుభవతి = అనుభవిస్తున్నాడు; వి + భూ = విభవతి = వెలిగిపోతున్నాడు; అభి + భూ = అభిభవతి = తిరస్కరిస్తున్నాడు.*

ఇవి నామవాచకాలుగా కూడా ఇలాంటి అర్థవైవిధ్యాన్నే సృష్టిస్తాయి. **ఉదా :**– డుకృఞ్ = కరణే = చేయుట

అధికారం, అపకారం, ఉపకారం, ప్రతీకారం, ప్రకారం, వికారం, ఆకారం, సంకరం, అవకరం, అనుకరణం, ప్రకరణం, అధికరణం మొ॥

ఇలా సంస్కృతం, ఇంగ్లీషు భాషల తరహాలో పదాలకు ముందు చేర్చదగిన ఉపసర్గలు (prefixes) తెలుగులో లేవు. కారణం – తెలుగుభాష, పదం పక్కన పదం/ ప్రత్యయం చేరిస్తే టర్కిష్ మొదలైన భాషల కోవకి చెందినది. ఈ రకం భాషల్లో పదాలకి ముందు కాక, తరువాత ప్రత్యయాలు చేఱతాయి.

**(i) ఉపసర్గలుగా తుమున్నంతాలు :**

అయితే తెలుగులో అచ్చం ఉపసర్గల్లాగానే ప్రవర్తించే పదాలున్నాయి. వాటిని తుమున్నంతాలంటారు. తుమున్నంతా లంటే – చెయ్యడానికి, పోవడానికి, చేయుటకు, పోవుటకు (in order to do, in order to go etc.) అని అర్థ మిచ్చే క్రియారూపాలు. ఇవి ప్రాచీన తెలుగులో చేయన్, పోవన్, అనన్ అనే విధంగా ఉంటాయి. తుమున్నంతాలు పై అర్థాన్నే కాకుండా “చేసేలా, పోయేలా” (so that/so as to) అనే విధంగా కూడా అర్థాన్నిస్తాయి.

**ఉదా:**– పోవన్ + కొట్టు = పోవగొట్టు – పోగొట్టు = పోయేలా కొట్టు ; చావన్ + కొట్టు = చావగొట్టు (చచ్చేలా కొట్టు); లేవన్ + కొట్టు = లేవగొట్టు (లేచేలా కొట్టు) మొ.

విడి మొదలైనవి విశేషణాలు గనుక, “విడు” మొదలైనవి వాటి మూల ధాతువులు కనుక, వాటి తుమున్నంత రూపాలైన విడన్ మొ. వాటిని (వేఱుగా అనే అర్థంలో) ఉపసర్గలుగా వాడుకునే సౌలభ్యముంది.

**ఉదా :**– విడన్ + కొట్టు = విడగొట్టు
చెడన్ + కొట్టు = చెడగొట్టు మొ.

**ఈ క్రింది ఉదాహరణలు పరిశీలించండి :**

ఎగు = ఎక్కుట; ఎగన్ + తీయు = ఎగదీయు; దిగు = దిగుట; దిగన్ + తీయు = దిగదీయు; అలయు = చేసినదే చేసి కష్టపడుట; అలియన్ + బడు = అలబడు → అలవడు → అలవాటు; అలియన్ + పోవు = అలఁబోవు → అలఁబోక → అలవోక; అలియన్ + ఆడు = అలియాడు = అల్లాడు; అలియన్ + చడి = అలజడి (మళ్ళీమళ్ళీ చెలరేగుతున్న చప్పుడు) తడయు = ఆలస్యము చేయుట; తడయన్ + పడు = తడఁబడు → తడబాటు; పొఱయు = కలఁతపడు; పొఱయన్ + పడు = పొఱఁబడు → పొఱబాటు; ఎడము = దూరము; ఎడయు = దూరమగు; ఎడయన్ + పడు = ఎడఁబడు →ఎడబాటు; ఒడ్డు = పందెములో పెట్టుట; ఒడ్డన్ + పడు = ఒడఁబడు → ఒడబాటు (ఒప్పందము); కలియు = కలియు; కలియన్+ పడు = కలఁబడు; కలియన్ + చూచు = కలియజూచు → కలజూచు (చుట్టూ చూచు); అకు = అగుట; అకన్ + చేయు = కాజేయు (అయ్యేలా చేయడం); పోవు = వెళ్ళుట; పోవన్ + పడి = పోవబడి → పోఁబడి (పోయే చోటు, పోయే మార్గం = జాడ, గమ్యం); పోవన్ + కాలం = పోవగాలం → పోఁగాలం; పెనఁగు = అల్లుకొను; పెనగన్ + వేయు = పెనవేయు (పేనేట్లు వేయు); పెనగన్ + కొను = పెనఁగొను (పేనుకొను)

పైన ప్రతిపంక్తిలోనూ చివటి బాణంగుర్తు తరువాత ఫలితార్థంగా చూపించినవి ఇప్పుడు అందఱికీ తెలిసిన శబ్దస్వరూపాలు. సంధులుగా చూపించినవి ఆ స్వరూపాల మూలరూపాలు. వీటిని పరిశీలించినప్పుడు క్రియాధాతువుల తుమున్నంతాలే తెలుగులో ఉపసర్గల్లా ప్రవర్తిస్తాయని అర్థం చేసుకుంటాం. తుమున్నంతాలంటే – చెయ్యడానికి, పోవడానికి అని అర్థమిచ్చే క్రియారూపాలు. ఇవి

ప్రాచీన తెలుగులో చేయన్, పోవన్, అనన్ అనే విధంగా ఉంటాయి. తుమున్నంతాలు పై అర్థాన్నే కాకుండా 'చేసేలా, పోయేలా' అనే విధంగా కూడా అర్థాన్ని ఇస్తాయి. ఉదా:

పోవన్ + కొట్టు = పోవఁగొట్టు; పోఁగొట్టు = పోయేలా కొట్టు

నిజానికి ఈ నిర్మాణాలు క్రియాగుచ్ఛాలు లేక మాలికాక్రియలు అనే రకానికి చెందుతాయి. కారణం – తెలుగులో క్రియ మీద పక్కన క్రియ దండలాగా చేరే సౌలభ్యం ఒకటుంది. ఇతర భారతీయ భాషల్లో కూడా తెలుగులో ఉన్నంత విస్తారం కాదు. ఉదా:

1. పట్టుకోలేకపోయాడు (ఇందులో పట్టు, కొను, ఉండు- వ్యతిరేకార్థకం, పోవు అనే ధాతువులున్నాయి) 2. పడగొట్టగలడు (పడు + కొట్టు + కలుగు)

మనం తెలుగులో ఉపసర్గల్ని కల్పించాలంటే ముందు ఇలాంటి క్రియాగుచ్ఛాల్ని కల్పించాలన్నమాట. ఈ సందర్భంగా కొన్ని అంశాల్ని గమనంలో ఉంచుకోవాలి:

(అ) తెలుగు ఉపసర్గలు పైన ఉదాహరించిన పద్ధతిలో తుమున్నంతాలై ఉండాలి.

(ఆ) అవి తెలుగులిపిలో గరిష్ఠంగా మూడు అక్షరాలకు మించనివై ఉండాలి.

(ఇ) అవి ప్రసిద్ధ అర్థాన్నే కాక సంబంధిత వ్యంగ్యార్థాన్ని సైతం ఇవ్వాలి. అంటే ఒకే ఒక్క నిశ్చితార్థాన్ని ఇచ్చే విధంగా ప్రయోగించకూడదు.

(ఈ) ఉపసర్గల్ని ఏర్పఱిచే క్రమంలో పనికొస్తాయనుకున్న పాత ధాతువుల్ని సైతం పునరుద్ధరించడానికి వెనుకాడ కూడదు.

(ఉ) క్లుప్తత నిమిత్తం అక్షరాల్ని కుదించడానికి అనుమతించాలి.

ఉదా: పొలియన్ + పడు = పొఱబడు మీద ఉపసర్గ చేర్చడం సాధ్యపడదు. అంటే ఒక

(ఊ) సంస్కృతంలో లాగా తెలుగులో ఉపసర్గ క్రియాధాతువుకు ఒక్క ఉపసర్గనే చేర్చగలం.

(ఎ) తెలుగు ఉపసర్గల్ని స్వతంత్ర పదాల్లా ప్రయోగించకూడదు. అలా చేస్తే అవి నామవాచకాలవుతాయి. ప్రతి నామ వాచకానికీ ఒక ఖచ్చితమైన అర్థం ఉంటుంది కనుక ఉపసర్గసహిత పదాల అర్థంలో అవి చెడ్డజోక్యాన్ని కలిగించుకుంటాయి.

పూర్వీకుల పద్ధతిలోనే చిఱుధాతువుల తుమున్నంతాల్ని ఉపసర్గలుగా మార్చి నేను కల్పించిన క్రియాధాతువులు కొన్నింటి ని ఇక్కడ ప్రదర్శనకి పెడుతున్నాను.

1. అలయన్ + పల్కు = అలబల్కు = అలవల్కు = (మళ్ళీ మళ్ళీ పలుకు) వాదించు 2. విడన్ + పల్కు = విడఁబల్కు = (విడగొట్టి పలుకు) వివరించు 3. అకన్ + పల్కు – కాఁబల్కు = (అయ్యే విధముగా చెప్పు) జోస్యము చెప్పు 4. రాన్ + పల్కు = రాఁ బల్కు = (వచ్చే విధముగా పలుకు) ఆహ్వానించు 5. (కవ అంటే జంట) కవన్ + కలుపు = కలుపు = కౌఁగల్పు (కౌఁగలించు లాగా) అనుసంధానించు

వీటినే నామవాచకాలుగా కూడా యథాతథంగా ప్రయోగించవచ్చు.

**(ii) ఉపసర్గలుగా విభక్తి ప్రత్యయాలు :**

విభక్తి ప్రత్యయాల్ని ఉపసర్గలుగా వాడుకునే సౌలభ్యమొకటి తెలుగులో ఉంది. విభక్తి ప్రత్యయాలంటే నామవాచకాలకు చివఱ వచ్చే తోన్, లోన్, పై, క్రీ (క్రింరు), మీన్ (మీఁదు) మొదలైనవి.

**ఉదా:**- తోడ – తోన్ + పుట్టువు = తోఁబుట్టువు (కలిసి పుట్టినవాడు) ; పైన – పైన్ + చరిమి = పైసరము ( పైకి జఱుగుట – స్త్రీతో కలయిక) ; క్రింద – క్రిన్ + కంటి = క్రీఁగంటి; మీద – మీన్ + కట్టు = మీఁగడ; మీఁదు + కట్టు = మీదుకట్టు, ముదుపుకట్టు to pledge

(iii) ఉపసర్గలుగా నామవాచకాలు (Nouns) : ఉదా :- కవ = జంట కవన్ + కలియించు = కవంగలించు → కౌఁగలించు (తన జంటగా చేజేలా చేయు)

నామవాచకాన్ని క్రియాధాతువుతో కలిపి ప్రయోగించే ఇలాంటి ఉదాహరణల్ని శబ్దపల్లవాలు (phrasal verbs) అంటారు. కాని కొన్నిసార్లు వీటిల్లో మొదటి పదం మనకు ఉపసర్గ (prefix) గా ఉపయోగపడుతుంది.

**మచ్చుకు కొన్ని శబ్దపల్లవాలు :**

ఉరితీయు, వలవిసురు, కన్నుమూయు, గుఱిపెట్టు, చేపట్టు, దారితీయు, దారిపట్టు, మనసుపడు, మనసగు, తెఱదించు, మిన్నంటు, గాలిసోఁకు

**(iii) ఉపసర్గలుగా విశేషణాలు :-** కొన్ని పదాలు ప్రాచీనకాలంలో విశేషణాలుగా ఉండి తరువాత్తరువాత ఉప సర్గల్లా ఉపయోగపడడం మొదలుపెట్టాయి.

ఉదా:- మఱు = తరువాతి/ ప్రత్యామ్నాయంగా; మఱు + నాడు = మఱుచటినాడు; పెద + తల్లి = పెత్తల్లి; చెన్ను + అందమైన; చెన్ను + కలువ = చెన్ + కలువ = చెంగలువ; ప్రాత + మినుకులు = ప్రాన్ + మినుకులు = ప్రామినుకులు = పాత మాటలు (వేదమంత్రాలు); ప్రాన్ + చదువులు = ప్రాజదువులు = పాత చదువులు (వేదమంత్రాలు); కొత్త + కారు క్రొ + కారు = క్రొక్కారు (కొత్త ఋతువు) ; క్రొత్త + సీమ = క్రొ + సీమ = క్రొసీమ (కొత్తదేశం)

భాష బాగా తెలియాలే గానీ ప్రతి 2 – 3 అక్షరాల పదాన్ని సంధిసమాస పద్ధతిలో ఉపసర్గలా వాడుకోవచ్చు.

**కొన్ని సంస్కృత ఉపసర్గలకి దీటైన తెలుగు ఉపసర్గలు :**

వీటిల్లో కొన్ని ప్రాచీనకాలం నుంచి ఉన్నటువంటివి. మఱికొన్ని నేను సూచిస్తున్నవి.

1. అప = చెడన్, చెడు ఉదా :- అపకరించు = చెడుసేయు, చెడగొట్టు 2. ఉప = తోడు, తోన్, ఒడన్ ఉదా :- ఉపకరించు = ఒడగూర్చు, ఉపమంత్రి = తోడుప్రెగ్గడ; 3. సహ = తోడు, తోన్ ఉదా :- సహకరించు = తోడ్పడు, సహోదరి = తోబుట్టువు 4. అవ = దిగన్ ఉదా :- అవమానించు = దిగనాడు ; 5. అతి = తెగన్, మీఱన్, కడు ఉదా :- అతిబలం = కడులావు 6. అను = వెన్ (వెను), మఱు ఉదా :- అనుసరించు = వెనుగొను 7. ని = లోన్ ఉదా :- నిలయం = లోగిలి 8. నిర్/నిస్ = వెలి, కొఱ ఉదా :- నిర్గమించు = వెలువడు కొలలోతు = లోతులేనిది 9. అధి = మీన్, మీదు, పై, మున్ ఉదా :- అధిపతి = మీదుకాడు 10. సు = సరి, మంచి, మేటి, మేల్, బాగు, బాగ, బా ఉదా :- సురూపం = సరిపొడ, మేల్పొడ 11. దుర్/దుస్ = చెడు, చెడ్డ ఉదా :- దురహంకారం = చెడ్డ ఏనరితనం 12. ప్రతి = ఎదురు, మాఱు,

సాక్షిదినపత్రిక, 25-00-2021, నుండి :

# డిజిటల్ తెరపై తెలుగు వెలుగులు

'డిజిటల్ హ్యూమానిటీస్' రంగానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పెరిగింది. ఆ దిశగా చాలా పరిశోధనలూ ఫలితాలూ అందుబాటులోకి వచ్చాయి. భారతీయ భాషలు వీటిని అందుకోవడంలో కాస్త వెనుకబడే ఉన్నాయి. డిజిటల్ రంగంపై కరోనా విశేష ప్రభావాన్ని చూపింది. ఈ నేపథ్యంలో తెలుగు భాగస్వామ్యాన్ని అంతర్జాలంలో మరింత పెంచాల్సివుంది. కరోనా కల్పించిన అనివార్యత వల్ల సమాచారం కోసం, మొదట్లో మృదు ప్రతుల్ని కంప్యూ టర్, ఫోన్ స్క్రీన్ల మీద చదవడం కొంత ఇబ్బంది కలిగిం చినా, తర్వాత అలవాటైపోయింది. ఇప్పుడు 'ఫలానా బుక్ సాఫ్ట్ కాపీ ఏ వెబ్‌సైట్‌లో దొరుకుతుంది' అనే అలవాటు లోకి వచ్చేశాం. అందుకే డిజిటల్ వేదికపై సాహిత్యం, కళలువంటి మానవీయశాస్త్రాలతోపాటు వాణిజ్య, వైద్య, సైన్స్, రాజకీయ మొదలైన సకల శాస్త్రాల సమాచారాన్ని పరిశోధకుల నుంచి సాధారణ ప్రజల వరకు అందరికీ అందుబాటులో ఉంచాలి.

భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతోన్న సమాజాల్లో సమాచార లభ్యత ప్రధాన సమస్య. దీన్ని అధిగమించి సుపరిపాలన వైపు అడుగులు వేయడానికి తగిన ఏర్పాట్లు చేయడం ప్రభుత్వాల తక్షణావసరం. సమాచారంపై కొందరి గుత్తాధిపత్యాన్ని తొలగించేలా రచయితలు, ప్రభుత్వాలు, ముద్రణాసంస్థలు పరస్పరావగాహనతో ముందు కెళ్ళాలి. తెలుగు ప్రభుత్వాలు దీన్ని లాభసాటి కార్యక్రమంగానో, సమాజోద్ధరణగానో చూడకుండా ఇవాల్టి పోటీ ప్రపంచంలో అనివార్యంగా దాటవలసిన మైలురాయిగా పరిగణించాలి. ప్రభుత్వరంగ సంస్థలే పూనుకొని ఆయా రచయితలతో, ముద్రణాసంస్థలతో చర్చలు జరిపి, వారికి కావలసిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక వెసులుబాట్లకు సంబంధించిన 'ఒప్పందాన్ని' కుదుర్చుకోవాలి. దీనికోసం అవసరమయ్యే కొత్త చట్టాలను తేవాల్సిన, సర్దుబాటు చర్యలను చేపట్టాల్సిన పెద్దన్న పాత్రను ప్రభుత్వాలు పోషించక తప్పదు.

ప్రజలకు తక్షణం వినియోగపడటానికి కావలసిన సమాచారం మొదట కనీసం పీడీఎఫ్ రూపంలోనైనా ఉంచాలి. యూనికోడ్‌లో ఉంచగలిగితే మరింత ప్రయోజనకరం. ఈ రూపంలో ఉంచడానికి కొన్ని పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు రాజ్యమేలుతున్న పేజ్‌మేకర్ సాఫ్ట్‌వేర్ స్థానంలో యునికోడ్ ఫాంట్స్ వాడేలా రచయితలను, ముద్రణారంగాన్ని ప్రోత్సహించాలి. పేజ్‌మేకర్‌లో ఉండే అనేకరకాల వెసులుబాట్లను యునికోడ్‌లో కూడా జోడించడానికి ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, వికీపీడియా, తెలుగు ఫాంట్స్ లాంటి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో పని చేయాల్సి ఉంటుంది. దాంతోపాటు ఇంగ్లిష్‌కు ఉన్నట్టు తెలుగుకు కూడా ఓసీఆర్ (ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్)ను అభివృద్ధి చేసి, అందుబాటులోకి తెస్తే మరో అద్భుతం చేసినవాళ్ళవు తారు. ఈ టెక్నాలజీ ద్వారా ఇప్పటివరకు పీడీఎఫ్ రూపంలో కోట్లాది పుటల్లో ఉన్న సమాచారాన్ని ఒక్క మీట నొక్కుతో ఎలక్ట్రానిక్ ఫార్మాట్‌లోకి మార్చుకునే వెసులు బాటు ఉంటుంది.

తమ సంస్థల్లో ముద్రితమవుతోన్న ప్రతి పుస్తకానికి సంబంధించిన వివరాల్ని విధిగా ఆ సంస్థలచేత ఆధునిక పద్ధతుల్లో 'సమాచార నిధి'(డేటా బేస్) తయారు చేయించాలి. తెలుగు పుస్తకాల సమాచారం ఒక దగ్గరకు తీసుకురావాలి. ఆ పుస్తక సంబంధిత పీడీఎఫ్, ఎలక్ట్రానిక్ ఫార్మాట్ కాపీని అంతర్జాలంలో పెట్టడానికి కావలసిన వ్యవస్థను ఏర్పాటుచేయాలి. అంతర్జాలంలో పుస్తకాల్ని చదవడం ద్వారా వచ్చే ఆదాయం రచయితకు అందేలా చూడాలి. ప్రతి ముద్రిత ప్రతికి సంబంధించిన కొన్ని పుస్తకాల్ని ప్రభుత్వ ప్రాతినిధ్య సంస్థలకు పంపేలా చూడాలి.

ఇప్పటికే యంత్రానువాదం (మిషన్ ట్రాన్స్‌లేషన్) అందుబాటులోకి వచ్చింది. దీన్ని మరింత అభివృద్ధి చేసి మెరుగ్గా అందించాలి. ముఖ్యంగా యూజర్ ఫ్రీ అప్లికేషన్స్ రావడం ఈనాటి సాంకేతిక రంగంలో పెనువిప్లవం. జ్ఞానాన్ని డిజిటల్ మాధ్యమంలో ఉంచే ప్రక్రియ నిరంతరం చేయగలిగితే ప్రజల్లో విషయ సంబంధిత అవగాహన పెరుగుతుంది. తెలుగులో రాస్తోన్న సకల శాస్త్రాల సమా చారం అందుబాటులో ఉండటం వల్ల పరిశోధనలు వేగ వంతమవుతాయి. తెలుగు పరిశోధనల్లో ముఖ్యంగా భాషా పరిశోధనల్లో కొత్తశకం ప్రారంభమౌతుంది. తెలుగు భాషలో ఏ అక్షరం ఎవరు రాశారు? ఏ అక్షరాలను ఎవరు, ఎక్కడి నుంచి, ఎంతశాతంలో వాడుకొన్నారు మొదలైన విషయాలు ఇట్టే తెలిసిపోతాయి. తద్వారా పరిశోధనల్లో కచ్చితత్వం, నిర్దిష్టత, నిర్దుష్టత సాధ్యమై సారవంతమైన ఫలితాలు వస్తాయి.

డా. ఎస్. చంద్రయ్య, టి. సతీశ్
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

## 34 వ పుట తరువాయి.....

మఱు ఉదా :- ప్రతివచనం = మాఱుపలుకు 13. వి = విడన్, విడి, మఱు ఉదా :- విభజించు = విడగొట్టు వివాసనం = విడికాపరం 14. సం = కలన్, కూడన్, కవన్ (కౌన్) సమ్మేళించు = కలగలుపు, సముచ్చారణ = కూడబలుకుకొను 15. పరా = మీఅన్, మీదు, మీన్ 16. పరి = చుట్టు, కలయన్, మీన్, మున్. పరిలోకనం = చుట్టుచూపు, కలయజూపు 17. ఉత్/ ఉద్ = ఎగన్, మీన్, పై 18. ఆజ్ = ఎల్ల

(తరువాయి వచ్చే సంచికలో...)

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-11

# నా కరకంబాడి - తాటికోన యాత్ర

**తి**రుపతిలో ఎస్వీభక్తి ఛానల్‌లో పని చేస్తున్న ప్రముఖ వారసత్వ కార్యకర్త బి.వి.రమణ నా మిత్రుడు. ఆయన తిరుమల కొండల్లోని 'తీర్థాల'నన్నింటికీ, కాలినడకతో వెళ్ళి, ఆదిమమానవుని అడుగుజాడల్ని నిరంతరం గాలిస్తూ, పాత చరిత్ర వాసనల్ని పీలుస్తూ ఉంటాడు. సుదూర ప్రాంతాల్లో, అడవుల్లో, కొండల్లో కోనల్లో, శిధిలాలయాలు, మంటపాలు, శిల్పాలు, శాసనాల ఆనవాళ్లు చేజిక్కించుకొంటాడు. ట్రెక్కింగ్ అంటే ఆయనకు మక్కువ. ఫోటోగ్రఫీ ఆయన హాబీ. చూసింది, పరిశీలించిందీ, అక్షరరూపంలో అందించటం ఆయన అలవాటు. ఆదివారాలన్నీ ఆయనకు కాలి నడక సమాహారాలే. ప్రతి మాటా వినసొంపే. ప్రతి రచనా ఆసక్తికరమే. 100కు పైగా వారసత్వ నడకల్ని, ట్రెక్కింగ్‌లను నిర్వహించి ట్రెక్కింగ్‌లో మెళకువలపై ఒక పుస్తకాన్ని రాశాడు. అది చదివినాక నేను కూడా, బి.వి. రమణ గారితో కొన్ని ఊళ్లు తిరగాలి అన్న కోరిక కలిగింది. అవకాశం కోసం ఎదురు చూస్తున్నా! తిరుపతివెళ్లటానికే!! అనుకుంటున్నానో లేదో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(తుడా), వైస్ ఛైర్మన్ హరికృష్ణగారి నుంచి తిరుపతికి ఆహ్వానం. రానుపోను విమాన యానం. చక్కటి ఆతిథ్యం. ఇదే వంకతో రమణగారితో వారసత్వ స్థలాల సందర్శన. ఒకే ప్రయాణంలో రెండు ప్రయోజనాలు. హరికృష్ణగారు ఫోనులో, తిరుపతి చుట్టుపక్కల గల నిర్లక్ష్యవారసత్వ కట్టడాలను పదిలపరచి, వాటి చుట్టూ ఆహ్లాదకర ఉద్యాన వనాలను ఏర్పాటు చేయబోతున్నామనీ, ఆ కట్టడాలను మరమ్మతులు చేసే విషయంలో సలహాలివ్వమని చెప్పారు.

తిరుపతిలో దిగంగానే తుడా కారు సిద్ధం. బి.వి.రమణ గారు కూడా సన్నద్ధం. తిరగటానికి రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా కరకంబాడి కెళ్ళాం. కరకంబాడి పక్కనే ఉన్న దేశాంతర మండపం దగ్గరికి అప్పటికే హరికృష్ణ గారు, తుడా ఇంజనీరు వచ్చి ఉన్నారు. ఈ దేశాంతర మండపం గురించి నాకు మొదటిసారిగ చెప్పింది ప్రముఖ సాహితీ వేత్త, జానపద విజ్ఞానఖని, కథకుడు, **తిరుమల కథలు, తిరుపతి కథలు, తిరుమల తిరుపతి కథలు** రాసిన ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి(పేటశ్రీ). అక్కడొక విశాలమైన చెరువు. ఆ చెరువుకు ఒక పక్కగా 16 కాళ్ల(స్థంభాల) మండపం. ఎప్పుడో 16వ శతాబ్దంలో వివిధ దేశాల నుంచి(మన దేశంలో, మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాలను దేశాలనేవారు కళింగ దేశం, కన్నడ దేశం, అరవ దేశంలా) వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవటానికి, వంటా వార్పూ చేసుకొని, ఒక కునుకుదీసి, మళ్లీ పిల్లా పాపలతో కొండకు పయనమవటానికి నిర్మించిన మండపం. సదాశివరాయల కాలంలో నిర్మించారని పేటశ్రీ గతంలో చెప్పిన విషయం గుర్తొచ్చింది. మండపం శిధిలమైంది. కప్పు రాళ్లు పడిపోయాయి. నేలరాళ్లు కుంగిపోయాయి. నిధుల వేటగాళ్లు ఒక అంకణాన్ని కదిలించి, లాభం లేక నిరాశతో తమ ప్రయత్నాన్ని విరమించుకొన్న ఆనవాళ్లు కనిపించాయి.



హరికృష్ణ గారు కల్పించుకొని, ఈ మండపానికి గత వైభవ, ప్రాభవాలను తేగలమా అన్నారు. అదెంతపని, నిధులు మీవి, విధులు మావి అన్నాను. సరేనన్నారు. కొలతలు తీసుకొని సుమారు ఇంతౌతుందనగానే, దేశాంతర మండప జీర్ణోద్ధరణ, సుందరీకరణకు అంగీకరించారు.

కొత్త ఆలయాల నిర్మాణం కంటే పాత వాటిని బాగు చేయమని విద్యారణ్యస్వామి, హరిహర, బుక్కరాయలకు చెప్పిన సంగతి గుర్తొచ్చింది. దేశాంతర మండపం దశ తిరుగుతున్నందుకు నాకళ్ళల్లో ఆశల ఆనందహేల!

అక్కడనుంచి బయలుదేరి చంద్రగిరికి బయలుదేరాం. కారెక్కెనానాకు, ఆదే ప్రాంతంలో ఉంటున్న ప్రముఖ పురాతన రాత ప్రతులు, కైఫియత్తులు, సిద్ధయ మఠంలోని వేమన పద్యాల పరిష్కర్త, **ఒంటిమిట్ట దేవాలయ** గ్రంథకర్త స్నేహశీలి, పాతపుస్తక వనమాలి, కట్టా నరసింహులు గారు గుర్తుకొచ్చారు. ఆయనకు ఫోన్ చేస్తే రోడ్డుమీద కొచ్చారు. వస్తూ వస్తూ తెచ్చిన **సిద్ధయ్యగారి మఠం వేమన పద్యాలు, ఒంటిమిట్ట దేవాలయం** పుస్తకాల్ని, నాకూ, హరికృష్ణగారికి, బీవీ రమణగారికి ఇచ్చి ఆనందించారు. కారెక్కాం. 'సార్ ఇక్కడ దొంగల మండపం ఉండేది. మేం తిరుపతి శిల్పకళాశాల్లో చదువుకొనేప్పుడు, అప్పుడప్పుడూ వచ్చి స్కెచ్‌లు వేసేవాళ్లం. చుట్టూ ఇళ్లు రావటంతో రోడ్డు మీదనుంచి కనబడటం లేదు. చూపిస్తారా' అని అడిగాను, 'అదెంతపని, ఇక్కడేగా' అని రెండు పర్లాంగుల దూరంలో, లోపల అరఫర్లాంగు దూరంలో రోడ్డుకు ఎడమవైపున బిక్కుబిక్కు మంటున్న ఒక పెద్దమండపాన్ని చూపించారు కట్టానరసింహులుగారు. స్థానికులు గుమిగూడారు. మంటపం చిక్కి శల్యమైంది. విరిగిన కపుల రాళ్లు, జారి పడిన దూలాలు, కుంగిపోయేసరికి, ఒకరు కట్టెలమోపుల్ని, మరొకరు పశువుల మేతను నిల్వబెట్టుకొన్నారు. ఒక వైపు ఒకగోడ, మరోవైపు రోడ్డు, మిగిలిన రెండు వైపులా ఏపుగా పెరిగిన గడ్డి, పేరుకుపోయిన గాదం. హృదయవిదారకరకంగా కనిపించిన దృశ్యాలు. ఇంతకీ అదే దొంగల మండపం. దేశాంతర మండపంలాగే ఈ మండపం, తిరుమల భక్తులకోసం ఎవరో ఒక మహానుభావుడు క్రీ.శ 16వ

శతాబ్దంలో నిర్మించిందే. నాలుగొందలేళ్లయినా మండపం శిథిలమైందే గానీ, జనహితం కోసం చేపట్టిన ఆ మహానుభావుని అభిమతం అభినందించ దగ్గదనిపించింది. నరసింహులుగారు కల్పించుకొని ఇక్కడ ఆదమరచి నిద్రించే భక్తుల సొత్తును కాజేయటానికి కొందరు దొంగలు కూడ



భక్తుల వేషాల్లో వచ్చి, అదును చూసి కాజేసి ఉడాయించేవారనీ, అందుకని ఆ మండపానికి దొంగల మండపమనే పేరు వచ్చిందన్నారు. స్థానికులంతా కలసి హరికృష్ణగార్ని బతిమిలాడారు, ఈ మండపాన్ని బాగు చేయమని. అందుకు తమ సహకారమందిస్తామని హామీ కూడా ఇచ్చారు. మళ్లీ నేనూ, రమణగారు తుడా ఇంజనీర్లు కలసి కొలతలు, ఫోటోలు తీసుకొని కారెక్కి తిరుపతి అన్నమాచార్య కళామండపం దగ్గరకెళ్లాం. నాకు బాగా ఇష్టమైన దోశలు, వడకరి, కుష్కి ఇడ్లీతిన్నాం. నాకు మళ్లీ 1973–77 తిరుపతి శిల్పకళాశాల జీవితం గుర్తొచ్చింది. ఇడ్లీ, సెలయేటి ధారలాంటి శెట్నీ, మందంగా ఉన్న ఉల్లిపాయ సాంబారు, ఎర్రకారం పొడి తింటుంటే మధ్యలో వచ్చిపడుతున్న చిట్టిగారెలు.నాస్టు అలా ఇష్టంగా ముగిసింది.

చంద్రగిరి, 'ఇదే చంద్రగిరి, శౌర్యానికి గిసినగిరి' అన్న పాట గుర్తొచ్చింది. ఇమ్మడి నరసింహరాయలు గుర్తొచ్చాడు. చిన్నప్పుడు ఇక్కడ పలకా, బలపం పట్టుకొని బడికెళ్లిన బుల్లి కృష్ణదేవరాయలు గుర్తొచ్చాడు. రమణగారు చంద్రగిరి మీద రాసిన విషయాలు గుర్తొచ్చి నన్ను గిలిగింతలు పెట్టాయి. 1975లో నేను శిల్పకళాశాలలో చదివేప్పుడు, ఎస్వీ సంగీత నృత్యకళాశాలలో, హరికథ విద్యను నేర్చుకొంటున్న భట్టాచార్య మా విద్యార్థులందరీ చంద్రగిరికి విహార యాత్రకు తీసుకొచ్చి 'ఇదే చంద్రగిరి, శౌర్యానికి గిసినగిరి' అంటూ పాడుతూ, కోటగోడల నుండి లోతైన కందకాలు, ఆలయాలు, శిల్పాల గురించి మాకు ఆసక్తికరంగా వివరించిన చారిత్రక సంఘటనలు, కట్టడ కౌశలం, శిల్పకళా వైభవం కళ్లముందు కదలాడాయి. భట్టాచార్యగారెవరోకాదు, అన్నమయ్య, శ్రీరామరాజ్యం సినిమాలకు మాటలు, కొన్ని పాటలు రాసిన జె.కె భారవి. ఆయన ఒక చక్కటి కళాకరుడు. సంగీతజ్ఞుడు. మిమిక్రీ ఆర్టిస్టు. హాస్యరస స్ఫూరక ప్రసంగాలు చేయటంలో దిట్ట. పంతువరాళిరాగంలో 'దినకరా! శుభకరా' కీర్తనను, 'జిలకరా మెంతులూ' అంటూ అప్పటికప్పుడు పేరడీ చెప్పిన ఆశుకవి.

చంద్రగిరిలో, శౌర్యసిరిలో కాలు మోపాం. హరికృష్ణగారు రాజమహల్ దాటింతర్వాత, దిగుడుబావికి ఎగువన గల ప్రదేశాన్ని చూపించారు. సందర్శకుల కోసం ఒక ఉద్యానవనం చేపడతాం అని చెప్పి,కొన్ని చారిత్రక సంఘటనల నేపథ్యాన్ని కల్పించొచ్చా అని అడిగారు, చంద్రగిరి కోట, కట్టడాలు కేంద్ర పురావస్తుశాఖ వారి రక్షణలో ఉన్నాయి. ఉద్యానవనం తప్ప, కొత్తవాటిని చేర్చటానికి వీలులేదని, డైనమిక్ లైటింగ్ ఏర్పాటు చేయవచ్చని, శిథిల దర్బారుహాలు, చేదబావి, రోడ్డుకు ఆవలనున్న శిథిలాలపునరుద్ధరణ, తెనాలి రామలింగని మట్టింటిని అనుమతి మేరకు బాగు చేయటం, సందర్శకులకు వసతులు, సౌకర్యాలు, స్థానిక జానపదకళారూపాలు, చేతి కళాఖండాల ప్రదర్శన ఏర్పాటు చేయవచ్చని సూచించాను. బి.వి.రమణ గారు మాకు తెలియని అనేక ఆసక్తికర చంద్రగిరి సంగతుల్ని చెబుతుంటే విజయనగర కాలంలో విహరించిన అనుభూతికలిగింది.

ఇక మా ప్రయాణం శ్రీనివాస మంగాపురం వైపు. ఆలయం నుంచి, కాలిబయటకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఒకదాని మీద మరొకటి పడి ఉన్న క్రీ.శ.16వ శతాబ్ది స్థంబాలు, దూలాలు, కప్పు, నేలరాళ్లు. చరిత్ర పైన ఇంతనిర్లక్ష్యమా అనిపించింది. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉందని వెంటనే వేరేచోట నిర్మిస్తామని చెప్పి 15సం॥ల క్రితం ఒక చక్కటి మండపాన్ని ఊడదీసి, అక్కడ పడేశారే తప్ప మళ్లీ కట్టాలన్న ఆలోచన ఇప్పుటికీ లేక పోవటం విడ్డూరం! ఎవర్ని నిందిస్తాం! వదిలేద్దాం.



కాలినడక మెట్లదారి. అసలు స్వరూపంకోల్పోయి, కొత్త కట్టడాలతో వారసత్వం, నిస్సత్తువగా మారింది. తిరుగు ప్రయాణంలో, చలివేంద్ర మండపం, ఆంజనేయ ఆలయం, మరో మండపం దగ్గరదిగి, స్థంభాల పైన చెక్కిన దేవతా మూర్తులు, రుషిపుంగవులు, కురువగొల్లలు, వేటగాడు, వేటరాయుడైన నరసింహస్వామి విగ్రహాలను స్పృశించి, అలనాటి శిల్పులతో మాట్లాడిన అనుభూతిని పొందాను. పాత కట్టడాలను కొత్తసొబగులద్దటంలో ఉన్న శ్రద్ధ, ఉన్న వాటిని ఉన్నట్లుగా బాగు చేయటంలో ఎందుకు లేదా అని తి.తి.దేవస్థానాల అధికారులపై కొంచెం కోపం వచ్చింది కూడా. వారొక శిల్ప కళాశాలను నడుపుతున్నారు. శిల్ప విభాగముంది. లేందల్లా ఆలోచనే.



రమణ గారు 'సార్ ఇదే స్వర్ణముఖి నది' అని చెప్పారు. కాజ్‌వే నుంచి చూశాను. ఒకవైపు దేవతలు దివినుంచి భువికి దిగివచ్చి స్నానాలాచరించి శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకొనే వారనీ, స్వర్ణముఖీనది అంతటి పవిత్ర తీర్థమని విన్నాను. నేడు, సర్కారు కంపతో నిండి, ఇసుకాసురులకు బలై నిలువెల్లా కంతలతో వెతలు వెళ్లగక్కుతుంది.

దాదాపు 10 కి.మీ దూరం సాఫీగా

సాగిన మా ప్రయాణం ఊపు తగ్గింది. రమణ గారు రోడ్డు మలపమన్నాడు. మట్టిడొంక, చక్కటి మామిడి తోటలు, పచ్చటి వరి పైరులతో సిరులొలకబోస్తున్న పల్లెలు దాటుకుంటూ పోయాం. మేం చూడాలనుకుంటున్న తాటికోన రానేవచ్చింది. కారును ఒకచోట ఆపి, కాలిబాటను పట్టాం. ఉరకలు బెదుతున్న సెలయేరు. మోకాళ్ళకు పైనే లోతు. బట్టలు ఎగబట్టుకొని సెలయేటిని దాటాం. ఏటవాలుకొండ, వడ్డెరలు ఊరికే ఉండకుండా, ఆకొండపైపొరను కంకర కొట్టడంతో నడకదారి మాయమై, జారుకుంటూ పైకి చేరుకున్నాం. బాగా అలుపొచ్చింది. ఇంతలోనే ఆ ఊరి అబ్బాయితో రమణగారి నుంచి పిలుపు. కూర్చున్నంతసేపట్లోనే, మళ్లీలేచి, ఒకమూలగా పైకి చేరుకున్నా అక్కడొక శిథిల శివాలయం క్రీ.శ. 11-12 శతాబ్దాల చోళుల నాటి దేవాలయం. లింగం వొంగింది. కప్పులేచిపోయింది. మనుషులకైతే రకరకాల ఇళ్ల పథకాలున్నాయి. ఎందుకంటే వారికి ఓట్లున్నాయి. దేవుళ్లకు ఓట్లులేవుగా. అందుకే వారికి ఏ ఇళ్ల పథకాలూ లేక ఇలా కునారిల్లుతున్నాయి. 'సార్ ఇక్కడికి రండి ఇనుపయుగపు సమాధి ఉందని మరో పిలుపు. చిన్నరాళ్లు, మంచం కాళ్లలా పేర్చి, పైన ఒక బండను అమర్చి మరణించిన వారి అస్థికలకు ఆచ్ఛాదన ఏర్పాటు చేశారు. క్రీ.పూ.1000 నాటి మానవులు ఇనుమును కనుగొని, పనిముట్లతో రాయిని తొలగించి, చనిపోయినవారి మీద గౌరవంతో,



గుర్తుగా, కలసికట్టుగా కట్టుకున్న సమాధిగూడు. కప్పుబడి క్రింద చిన్నచిన్న వర్ణచిత్రాలు ఆనాటి మానవుని ఆలోచన, అధ్యయనం, సమాచార ప్రసరణకు అద్దంపడుతున్నాయి. ఇలాంటి సమాధులు కొండ చరియపైన చాలా ఉండేవని, చరిత్ర పై అవగాహన లేని స్థానికులు కంకరకోసం ధ్వంసం చేశారని, ఉన్న ఈ ఒక్క దాన్నైనా కాపాడుకోవాలని రమణగారు నన్ను బతిమిలాడారు. ఆయన బాధను నేను కూడా భరించాను. పేపరు వార్త ద్వారా ప్రభుత్వానికి తెలియజేశాను. ఇంత వరకూ అలికిడి లేదు. ఈ సమాధిని గతంలోనే రమణగారు చూశారు. అంతకు ముందు చాలామంది పరిశోధకులు చూశారు. అయినా ఈ తరానికి తెలియజేయడం నా బాధ్యత అనిపించింది.

తరువాత అదే గుట్టమీదున్న కొండచరియల్ని పరిశీలించాను. ఏవైనా శిలా యుగపు చిత్రాలు దొరుకుతాయేమోనని. లేవు. లేనందుకు బాధపడలేదు. ప్రయత్నం చేశానన్న తృప్తి మిగిలింది. అక్కణ్ణుంచి చక్కటి ప్రకృతిని చూశాను. చూపు కొంచెం కిందికి మళ్లింది. ఆశ్చర్యం! నేలమట్టానికి, కొండ శిఖరాగ్రానికి మధ్య మట్టంలోనున్న ఒక పెద్ద రాతిగుండుపై గర్భాలయం, అర్ధమండపం వరకూ రాయి, ఆపైన ఇటుకతో కట్టిన విజయనగర కాలపు చక్కటి ప్రాసాదం కనిపించింది. ఆ సెలయేటి ఒడ్డున, కొండ దిగువన ప్రకృతి అందచందాల నడుమ ఏ మహనీయుడు ఆ ఆలయాన్ని నిర్మించాడో తెలియదుకాని, ఆయనకు నమస్కరించాను. రమణగారు నేను వెనక్కి తిరిగాము.

తిరుపతి చేరేంతవరకూ చూచిన కట్టడాలు నన్ను ప్రశ్నలతో వేధిస్తున్నాయి. ఆ ప్రశ్నలు, హోటల్లో సేదతీరే నన్ను బాధిస్తున్నాయి. వారసత్వం వరస తప్పుతుందని హెచ్చరిస్తున్నాయి.



జె.యు.బి.వి.ప్రసాద్
jubv@yahoo.com

# 'కొట్టడం'
## మానవ సంస్కృతిలో భాగమేనా!

**ఇద్దరు స్త్రీలు, ఒకరి నొకరు తోసుకుంటున్నారు. ఒకరి నొకరు కాళ్తో పట్టేసి, నొక్కేస్తున్నారు. ఒకరి బలాన్ని మరొకరి మీద చూపించేస్తున్నారు. అది స్త్రీల మల్ల యుద్ధం ఆట! స్త్రీల కుస్తీపోటీ! ఎంతో మంది విరగబడి చూస్తున్నారు. మొగవారి మల్లయుద్ధాల ఆటల నుండి, మన సంస్కృతి, స్త్రీల మల్లయుద్ధాల ఆటలకు ఎదిగింది!**

**మన సంస్కృతిలో, కొట్టడం ఒక భాగంగా, మన చిన్నప్పటినించే అయిపోయింది.**

ప్రతీదానికీ, సంస్కృత మాటలను ఉదహరించే పండితులు, కొట్టడం అనే విషయం వచ్చినప్పుడల్లా, "దండం దశ గుణం భవేత్" అని గొప్పగా చెప్పేస్తూవుంటారు. అసలా మాటలు ఎక్కణ్ణించీ వచ్చాయి?

*'విశ్వామిత్రా హి పశుషు, కర్దమేషు జలేషుచ*
*అంధే తమసి వార్ధక్యే, దండం దశ గుణం భవేత్'*

అంటే, చేతికర్ర, పక్షులనూ, కుక్కలనూ, శత్రువులనూ, పాములనూ, పశువులనూ అదుపులో ఉంచడానికి ఉపయోగపడుతుంది. బురదలో, నీటిలో, గుడ్డితనంలో, చీకటిలో, ముసలితనంలో, సాయంగా వుంటుంది చేతికర్ర. ఈ విధంగా, చేతికర్ర, పది విధాలయిన గుణములు కలది అగుచున్నది. శ్లోకం అర్థం ఇలా ఉంటే, మనలో చాలమంది ఎందుకో, దండించడం వల్ల (శిక్షించడం వల్ల) పది లాభాలు ఉన్నాయి ..... వంటి అర్థాలు చెబుతూ ఉంటారు. దండం అనే పదాన్ని దండన అనుకోవడం వల్ల, ఈ భావంకలుగుతూ ఉండొచ్చును. సరే, ఈ సంస్కృతం గోల అలా వొదిలేద్దాము.

**కొట్టడం మొదలు:**

ప్రకృతి పరిణామ క్రమంలో, మొదట్లో జంతువులను రాళ్ళతో కొట్టి, చంపి తినేవారు. ఆ తర్వాత ఆ కొట్టడం అనేది, తిండి కోసమూ, భూమి కోసమూ, నీటి మడుగుల కోసమూ, మిగిలిన వనరుల కోసమూ మానవులలో కూడా ప్రవేశించింది. కాలం గడిచేకొద్దీ, సమాజంగా ఏర్పడి ఆ కొట్లాటలు తగ్గించుకున్నారు. అయితే, వేరే గుంపులతో కొట్టుకోవడాలు సాగుతూనే వున్నాయి. అవి, పరిణామక్రమంలో దేశాల మధ్య కొట్లాటలుగా మారాయి. పైపెచ్చు, ఈ నవీన కాలంలో, కుస్తీ, బాక్సింగ్, కరాటే, కుంఫూ, జూడో, వగైరా పేర్లతో ఈ కొట్లాటలని ఆటలుగా పరిగణిస్తున్నారు. బాక్సింగులో అయితే, రక్తాలు వచ్చేటట్టు కొట్టిన వారికి బంగారు పతకాలు కూడా ఇస్తారు. కొట్టుకోవడాలు ఆటలేమిటీ? – అనే బుద్ధి, మనుషులకు వుండదు.

**పిల్లలని పెద్ద వాళ్ళు కొట్టడం:**

తల్లిదండ్రులు పిల్లలని కొట్టడంతో మొదలవుతుంది, మనిషికి ఈ కొట్టడం అనే ప్రక్రియ. అల్లరి చేస్తే కొట్టరా? – అనేగొప్ప వత్తాసు కూడా వుంది ఈ విషయంలో. అవును మరి, పిల్లల్ని కనడానికి గానీ, పెంచడానికి గానీ, కొట్టడానికి గానీ ఎటువంటి లైసెన్సూ, ఎటువంటి శిక్షణా అక్కరలేదు కదా? తర్వాత, ఉపాధ్యాయులకు పిల్లల్ని కొట్టడానికి అన్నిహక్కులూ ఇచ్చేస్తారు. కొంత మంది తల్లిదండ్రులు, "మాపిల్లల్ని బాగా కొట్టి చదువు చెప్పండి" అంటారు కూడా. ఇక, ఆ ఉపాధ్యాయుల చేతిలో బెత్తానికి ఎక్కడ లేని అధికారం వచ్చేస్తుంది.

పిల్లలు, వాళ్ళలో వాళ్ళు కొట్టుకునే లక్షణం కూడా, ఈ చెత్త సంస్కృతిలోంచే మొదలవుతుంది. కొట్టడం అనే విషయమే తెలియని పెంపకాలలో, పిల్లలు కొట్టుకోరు. ఇది అనుభవంలోచూస్తున్న విషయం. కొండొకచో, ఎక్కడైనా అలా వున్నా, దాన్ని పట్టించుకోనక్కరలేదు. ఎందుకంటే, ఆ చెత్త సంస్కృతి లేనిచోట, ఈ సమస్య తొందరలోనే మాయం అయిపోతుంది.

ఒక కేసు, ఇరవై ఏడేళ్ళ, మెదడు సరిగా ఎదగని అబ్బాయి విషయం. తండ్రి లేడు. అన్నా, తమ్ముడూ కలిసి, ఈ అబ్బాయిని ఎక్కడో ఏదో ఆశ్రమానికి పంపిద్దామని ప్రయత్నించారు గానీ, తల్లి ఒప్పుకోలేదు. మల, మూత్రాల దగ్గర్నించీ, స్నానం చేయించడం, తిండి తినిపించడం, అన్నీ తల్లే చూసుకునేది. అయినా, జబ్బు వలన, ఈ అబ్బాయి ప్రవర్తనలో మార్పులు వస్తాయి. ఫలితం, అన్నా, తమ్ముడూ కలిసి, ఈ అబ్బాయిని చావబాదేవారు. వాడు తిరగబడేవాడు. వాళ్ళు ఇంకా బాదేవారు. "వాడికితెలియదురా! వాణ్ణి కొట్టకండర్రా" అని ఆ తల్లి ఆక్రోశించేది. వినేదెవరు?

ఇంకో ఘోరమైన కేసు. ఏదో దేశంలో, ఒక ఆడ పిల్ల, ఎవరినో ఇష్టపడింది. అంతే! చుట్టు పక్కల వాళ్ళందరూరాళ్ళతో ఆమెని కొట్టడం మొదలెట్టారు, ఒక ఆడ పిల్లకి అటువంటి స్వేచ్ఛ లేదంటూ. అలా రాళ్ళు విసిరిన మొగవాళ్ళలో, ఆ పిల్ల తండ్రి కూడావున్నాడు.

**పిల్లలు పెద్ద వాళ్ళని కొట్టడం:**

ఒక చదువుకునే కొడుకు, తల్లిని కొట్టేకేసు ఇంకోటి. ఒక కుర్రాడు, ఐఐటీ ఎంట్రన్సుకి తయారవుతున్నాడు. తల్లి రోజంతా కొడుక్కి సేవలు చేస్తూ, ఆ పైన, సీటు రావాలనిపూజలు చేస్తూ, కొడుక్కి ధైర్యం చెబుతోంది. కావలిసిన డబ్బును తండ్రి ఇచ్చేస్తున్నాడు. చివరికి, ఆ కుర్రాడికి ఆ సీటు రాలేదు. "నువ్వు పూజలు సరిగా చెయ్యలేదు, అందుకే నాకు సీటు రాలేదు" అంటూ, ఆ కుర్రాడు తన తల్లిని చాచి చెంపమీద కొట్టాడు. తండ్రి కలగ జేసుకుని, కొడుక్కి నచ్చజెప్పి, వేరే కోచింగ్ సెంటర్‌లో చేర్చాడు. వచ్చే యేడు, ఆ సీటేదోతెచ్చుకుని, ఆ పైన ఇంకా పెద్ద చదువులు చదివి, తల్లికి కనకాభిషేకం చేశాడు. కాబట్టి, ఆ కుర్రాడు, ఒక జాతిరత్నం! వాడినేమీ అనకూడదు. ఏదో ఆవేశంలో అలా తల్లిని కొట్టేశాడు. అంతే! ఎంత సిగ్గుమాలిన విషయం ఇదీ? దాన్నీ క్షమించేస్తారు. "ఇది క్షమించరాని తప్పు" అనే వారు కూడా, ఆ కొడుకు పాడయిపోతాడని, వాడిని శిక్షించకూడదు – అంటారు. ప్రతీ దాన్నీ క్షమించెయ్యడమే. ఆ తర్వాత, ఆ వెధవ కొడుకు, కోట్లు సంపాదించి, ఆ దెబ్బలు తిన్న తల్లికి కనకాభిషేకం చేశాడు. అదన్న మాట ఆ గొప్పతనం! అదే క్షమించడానికి వున్న

అర్హత! అలా కాకుండా, వాడు, ఏ బరువులు మోసే కూలీగానో అయితే, అప్పుడు కూడా క్షమిస్తారా? క్షమించినా క్షమిస్తారు. దానిదేముంది? ఆ సిగ్గులేని తల్లే, క్షమించేస్తుంది. ఆత్మ గౌరవం వున్న తల్లి, ఆ అభిషేకాన్ని తిరస్కరించాలి. అదే వుంటే, ఇంకేం? మొదట్లో, ఆ తల్లికి కొంచెం కష్టం అనిపించింది. "ఎందుకు లేరా! మళ్ళీ నీకు కోపం వస్తే, కొడతావు" అని గొణుగుతూ, అభిషేకం వద్దనే అంది, మనసులో ఇష్టంగానే వున్నా. "కొట్టనులేమ్మా" అని కొడుకు కాసింత భరోసా ఇవ్వగానే, గంగిరెద్దు లాగా ఒప్పేసుకుంది అభిషేకానికి.

విచిత్రం ఏమంటే, తల్లిని కొట్టిన ఆ కొడుకు, తండ్రిని కొట్టడు సాధారణంగా! ఎందుకంటే, ఆ తండ్రి తిరగబడి చావ బాదుతాడు కాబట్టి. ఇక్కడ ఆ సాకులు పని చేయవు.

**మొగుళ్ళు పెళ్ళాలని కొట్టడం:**

ఇక తాగుబోతు మొగుడు, పెళ్ళాన్ని కొట్టడం! పెళ్ళాన్ని కొట్టడానికి తాగనక్కర లేదు. ఈ సమాజం అలా చెయ్యడానికి ఎప్పటి నించో హక్కు ఇచ్చేసింది. తాగడం అనేది ఒక సాకు మాత్రమే. ఆ తాగుబోతు మొగుడు కూడా పక్కింటి వాళ్ళ పెళ్ళాల్ని కొట్టడు. కొడితే, ఏం జరుగుతుందో వాడికి బాగా తెలుసు.

బ్యాంకులో ఉద్యోగం చేసే మా ఎదురింటి మనిషి, బయట ఎక్కడో తిరిగి, జబ్బు అంటించుకుని, దాన్ని భార్యకి అంటించాడు. ఆ తర్వాత, ఆ భార్య పడక గదిలోకి వెళ్ళడానికి తిరస్కరిస్తే, కొట్టాడు. చుట్టు పక్కల వాళ్ళందరూ సానుభూతి చూపించారు. కొన్నాళ్ళకి అది పాత విషయం అయిపోయింది. ఆ బ్యాంకు ఉద్యోగికి మామూలుగా ఎప్పట్లాగానే గౌరవం.

**మొగుళ్ళని పెళ్ళాలు కొట్టడం:**

మాటలో మాటగా, గృహ హింసకు గురైన ఒక భర్త విషయం కూడా చిన్నగా చెప్పుకుందాం. చిన్నతనంలో, మావూళ్ళో, పక్క వాటాలోంచి, "ఒసేయ్, గిల్లకే! చెప్పినట్టే చేస్తానే! గిల్లకే!" అనే జాలి మాటలు వినబడేవి. మా అమ్మావాళ్ళు, ఆ విషయం చెప్పుకుని, నవ్వేవారు. ఆ గిల్లించుకునే భర్త మీద వారికి జాలే కలిగేది కాదు. అతన్ని, 'చేతకాని వాడు' అని వీళ్ళనేవారు.

నాకో అమెరికన్ మిత్రుడు వున్నాడు. ఇతని భార్య కూడా అమెరికా మనిషే. భర్త కన్నా రెండేళ్ళు పెద్ద. ఇద్దరు ఆడపిల్లలు. వీళ్ళంతా కారులో వెళుతున్నప్పుడు, భర్త సరిగ్గా డ్రైవింగ్ చెయ్యలేదని, భర్త తల మీద కొట్టేస్తూ వుంటుంది. అదీ, అతను కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు. అతనే, నాతో చెప్పుకున్నాడు. "ఎందుకూ, అలా దెబ్బలు తినే సంబంధంలో వుంటావూ?" అని నేనడిగాను. జవాబు లేదు. ఆ సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకునే శక్తి, అతనికి లేదు. ఎంతోమంది, భార్యలు దెబ్బలు తింటూ, భర్తల దగ్గిరే పడివుంటారు కదా? అలాంటి కేసన్న మాట. నా అదృష్టం, నేను వారికి చాలా దూరంగా వుండగలగడం.

**కొట్టడాన్ని క్షమించేవారు:**

సరే! ఈ చెత్త సంస్కృతి పెరుగుతూనే వుంటుంది. దానివల్ల, మనకు ఎక్కువగా కొట్టడాన్ని క్షమించే గుణం అలవాటయిపోతుంది. "తప్పే అనుకో! అయినా, మర్చిపోయి, ముందుకు సాగాలి" అన్నట్టుగా వుంటారు.

క్షమించరాని నేరాలని క్షమించే వారు కూడా ఆ నేరాలలో భాగస్తులే.

నాగరికత పెరిగాక, కొట్టడం అనేది మన సంస్కృతి తగ్గింది. ఎంతోమంది, చదువుకుని పెద్ద ఉద్యోగాలు చేసేవారూ, చేసినవారూ, ఈ కొట్టడం అనే కార్యక్రమంలో వుండరు. దాన్ని మంచి పని అని కూడా అనరు. అయితే, అది జరిగితే మాత్రం, దాన్ని క్షమించెయ్యడానికి, ఒక్క క్షణం కూడా వెనుకంజ వెయ్యరు.

ఒకాయనైతే, 'పిల్లలు, నిరాశ(ఫ్రస్ట్రేషన్) వల్ల పెద్ద వాళ్ళని కొడతారు, అది మామూలే, ముఖ్యంగా పసిపిల్లలు కూడా'– అని నొక్కి వక్కాణిస్తూ వుంటాడు. పసిపిల్లలకి మెదడు ఇంకా ఎదగదు. వారికి సమాజం చెప్పే విషయాలు ఇంకా తెలియవు. వారితో, ఊహా జ్ఞానం తెలిసిన వారిని పోల్చకూడదు అనే ఇంగితం మనకుండాలి. అది వుండదు అసలు.

ఇక ఏ దేశానికి సంబంధించిన సినిమాల్లో అయినా సరే, తెగ కొట్టేసుకోవడమే. అటువంటి సినిమాలు, మనుషులకి కుసంస్కారాన్ని మాత్రమే నేర్పుతాయి. దీనర్థం అవి చూసినవారు, ఇతరులను కొడతారని కాదు. కొట్టడం అనే విషయాల్లో, ఎలా స్పందించాలో తెలియకుండా అయిపోతారు.

ఒకాయనైతే, తల్లిని కొట్టిన కొడుకును వెనకేసుకొస్తూ, "వాడు, పాపం మంచివాడే. కోపం తట్టుకోలేక పోయాడు. ఆ తర్వాత చాలా చక్కగానే వున్నాడు. వాణ్ణేమీ అనకండ్రా!" అన్నాడు.

ఈ మధ్య ఒక చోట చూశాను – మిత్రుడు కొట్టడం అనే విషయాన్ని, ఇసక మీద రాయాలట! మిత్రుడు మరణాన్నించి రక్షించడం అనే విషయాన్ని, రాతి మీద చెక్కాలట! పోలికలు చూడండి. అంటే, 'ఇసకలో రాసినది గాలికి చెరిగిపోతుందీ, ఆ విధంగా కొట్టడాన్ని మర్చిపోవాలీ' – అని అర్థం. మామూలు మనుషులకు, "అవును కదా? నిజమే కదా? గొప్ప నీతి కదా?" అని అనిపించేటట్టు వుంటుంది. ఆ రెండు విషయాలనూ పోల్చి, కొట్టడాన్ని చిన్న విషయంగా ఎందుకుచూడాలి? "కొట్టే అమ్మే, పెడుతుందని" నేర్పే ఈ సంస్కృతి, ఇంతకన్నా ఇంకేం నేర్పుతుంది.

కొట్టించుకున్న వారూ క్షమించేస్తారు. "మొగుడన్నాక, ఒకదెబ్బ వేయడా, ఒక మాట అనడా" అనే పెళ్ళాలు కూడా వున్నారు. మొన్నా మధ్య ఏదో ఇంటర్వ్యూలో, "మా అమ్మ నన్ను చిన్నతనంలో చితక బాదేసేది. బెల్టూ, హేంగరూ వగైరాలతో బాగా కొట్టేది, అల్లరి చేశానని. తరిమితరిమి కొట్టేది" అని ఒక సినిమా నటుడు నవ్వుతూ చెప్పుకున్నాడు.

ఇప్పుడు అరవై యేళ్ళ వయసు దాటిన వారిని అడిగి చూడండి. వాళ్ళందరూ చిన్నప్పుడు తల్లిదండ్రుల చేతిలో దెబ్బలు తిన్నవారే. ఒక్కరూ తమ తల్లిదండ్రులను విమర్శించరు. "నేనబద్ధం చెబితే మా నాన్న కొట్టాడని" ఒకరూ, "వంటింట్లోని తిండి దొంగిలించానని మా అమ్మకొట్టిందని" మరొకరూ, నవ్వుతూ చెప్పేసుకుంటారు. వారికా పరిస్థితులు లేకుండా చూడాల్సింది ఆ తల్లిదండ్రులే అని, ఈ అరవై యేళ్ళు దాటినవారికి తెలియదు. వీరు కూడా తమ పిల్లలని ఎప్పుడో ఒకప్పుడు కొట్టే వుంటారు. ఒకాయనంటాడు, "కొట్టకూడదు గానీ, తప్పు చేస్తే ఒక దెబ్బ వేయొచ్చు".

**అమెరికాలో కొట్టడం :**

నేనూ ఈ కొట్టే చెత్త సంస్కృతిలో చాలా యేళ్ళు పెరిగినవాడినే! కొట్టడం లేకపోయినా, కొట్టే వారి పట్ల రావలిసినంత కోపం,

అసహ్యం రాకుండానే బతికాను చాలా కాలం. చిన్నప్పుడు, మా అమ్మ కొట్టేది, ఏదో చెప్పిన మాట వినలేదని. కొంచెం పెద్దయ్యాక, మా నాన్న కొట్టాడు, తన దౌర్భాగ్య పరిస్తితులకు తట్టుకోలేక, తన కోపాన్ని ఎవరో ఒకరిమీద చూపించుకోవాలని. స్కూల్లో రౌడీలు కొట్టేవారు. ఇక టీచర్ల సంగతి చెప్పక్కర్లేదు. బాగానే బాదుతూ వుండేవారు శాయశక్తులా. నా జీవితంలో మార్పులు మాత్రం పెద్ద వయసు వచ్చాకే, అంటే ముఖ్యంగా ఇండియా వదిలాకే బాగా వచ్చాయి.

అమెరికాలో కొట్టడం అనేది పెద్ద నేరం. ఇక్కడ ఈ విషయానికి సంబంధించిన సంస్కృతే వేరు. అమెరికా సంస్కృతిలో వేరే చెత్త ఎంతో వున్నా, ఈ కొట్టడం విషయంలో మాత్రం అమెరికా సంస్కృతిని మెచ్చుకోక తప్పదు. కొట్టడాన్ని ఎవరూ క్షమించరు. పిల్లలు, తల్లిదండ్రులను తిరస్కరిస్తారు. తల్లిదండ్రులు, పిల్లల్ని తిరస్కరిస్తారు. టీచర్లని జైల్లో పెడతారు. మనుషులకు ఎవరూ కొట్టరు అనే సెక్యూరిటీ వుంటుంది బాగా. దొంగల సంగతీ, రౌడీల సంగతీ, వేరే విషయాలు. ఆ లొకాల్టీలు వేరు కూడా. దీనర్థం, నేను, అమెరికా గొప్పతనాన్ని పొగుడుతున్నట్టూ, దాని సంస్కృతిని బాగా మెచ్చేసుకుంటున్నట్టూ కాదు. ఇలా కొట్టడం విషయంలో మాత్రమే, ఆ మెప్పుకోలు. పిల్లలు గానీ, స్కూల్లో టీచర్లు గానీ, పక్కింటి వాళ్ళు గానీ, తల్లిదండ్రులు పిల్లల్ని కొడుతున్నారని, పోలీసులకు ఒక్క ఫోనుకాల్ చేస్తే, ఇక ఆ తల్లిదండ్రులు వుండేది జైల్లోనే. పిల్లల్ని ఫాస్టర్ కేర్‌లో పెడతారు. స్కూల్లో టీచర్లు, పిల్లల ఒంటి మీద చెయ్యనేదే వెయ్యరు. చట్ట విరుద్ధం అలా చెయ్యి చేసుకోవడం. టీచర్లనే జైల్లో పెడతారు. అలా పెట్టిన కేసులు ఎన్నో. ఎక్కువ శాతంగా చూస్తే, పిల్లలకి తమని ఎవరో కొడతారనే భయం వుండదు.

దీనర్థం, అమెరికాలో పిల్లలని కొట్టడం, అసలు లేదని కాదు. అన్ని రకాల కొట్టడాలూ వున్నాయి. పిలిచిన వెంటనే వచ్చేసే పోలీసు వ్యవస్థ వుండటం వలన, ఇది చాలా తక్కువ శాతంలో వుంటుంది, మిగిలిన దేశాలతో పోలిస్తే. ఒక సినిమాలో, ఒక కుర్రాడి పాత్ర అంటుంది, "మా నాన్న, కాలుస్తున్న సిగరెట్ పీకలు మీదకి విసిరి, నన్ను నిద్రలేపేవాడు."

**ముక్తాయింపు:**

హత్యతో పోలిస్తే, కొట్టడం చిన్న విషయమే. అయితే, అలా పోల్చుకునే దౌర్భాగ్య పరిస్తితిలో ఎవరూ వుండకూడదు.

ఇలా రాయడాన్ని స్వగతం అంటారు. అంటే, ఒక వరసా, వాయీ లేకుండా, చెప్పుకుంటూ పోవడం అన్న మాట. గత ముప్పై యేళ్ళుగా ఈ కొట్టడం అనే సంస్కృతికి ఎంతోదూరంగా బతుకుతున్నాను. అయినా ఈ మధ్య కాలంలో, కొన్ని ఈ కొట్టే సంఘటనలు నా దృష్టిలోకి వచ్చి, ఎంతో వ్యాకుల పరిచాయి. ఆలోచనలు సాగుతూనే వున్నాయి. ఈ రాతలు ఎవరినో ఉద్ధరిస్తాయని కాదు. రాయడం నా స్వాంతన కోసం మాత్రమే. ఎవరిలో అయినా ఒక ఆలోచనాతునక మొదలయితే, అదే గొప్ప!

ఈ వ్యాసరచయిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.
రెండు కథా సంపుటాలను వెలువరించారు.
కాలిఫోర్నియాలో నివాసం

## బట్టలుతికే ఓ సాకలక్క
## మా ఇంటి మహాలక్ష్మి

తెల్లవారితే మా ఇంటికొచ్చే ఆడబిడ్డవు నీవు..
వండిన అన్నం, గంజో పెడితే మురిసిపోతావు
మాసిన బట్టలను మెరిసేలా చేస్తావు,
మా ఇంటికొచ్చే ఆడపడుచువి నీవమ్మా.....
మా ఇంటికొచ్చిన చుట్టాలను చూసి చిరు బొర్రులాడుతావు
ఉతికే బట్లెక్కువ అవుతాయి అని చిటపట లాడుతావు
పోతున్న చుట్టాని కేసి చూస్తున్నావు.
ఆగి ఆగి అరచేయిగీతలను చూపుతూ ఉంటావు
వాల్లు ఇచ్చే పైసలతో పసందైన వరుసలు కలుపుతుంటావు...
సద్ది అన్నం పెట్టినప్పుడు
సర్రున
ఉడుకు అన్నం పెట్టినప్పుడు
చిరు బొఖ్ఖులాడుతవు
వేడి అన్నం పెట్టినప్పుడు పెదవి మీద చిరునవ్వు పువ్వయి వికసిస్తుంది
ఏది ఉన్నా తినిపోయే మా ఇంటి మహాలక్ష్మివి నీవేనమ్మా.....
మా ఇంట్లో సావొచ్చినప్పుడు ఇంటికి ఇదువువై ఉంటావు.
అందరికంటె ముందు ఉంటావు..
ఆరోజు మా గుండె బరువు కంటే
నీ వీపుమీది  బట్టల బరువే ఎక్కువా....
ముట్టు బట్టలుతికి అమ్మవైతివి
మా వీపు మీది బట్టలుతికి అక్కవైతివి
అన్నీటా ముందుండే ఆడపడుచు వైతివి,
అందరూ ఉన్నా అభివృద్ధికి ఆమడ దూరమైతివి...
చాత కాకున్నా నీ నడక ఆపనంటివి
చావొచ్చిన సాకలితనాన్ని విడవనంటివి
మేము చచ్చేవరకు నిన్ను మరువము
ఎందుకంటే
అన్నిటా ముందుండే మా ఆడపడుచే నీవైతివి...
మా అందరిని ప్రేమతో పలుకరించే మరో అమ్మవైనావు కదా..
అలనాటి అత్మ బందువులు
ఇలనాటి కాలంలో కనుమరుగు అవుతున్నారు కదా.....

కొండల్ పులి
9866537341

తెలుగు అనే మాటను పనికట్టుకొని విడిచిపెట్టి నుడిగంటులలో దానికి బదులు దేశి అని రాసిన వారు ఎవరైనా సరే, తెలుగుకు విరోధులే. తెలుగు ఎడల వారికి గల అభిమానాన్ని అనుమానించవలసి వస్తుంది.

తెలుగు చాలా పాతకాలపు నుడి. దీనిలోని మాటలు చాలా సంస్కృతంలోనికీ యూరోపియను నుడులలోనికీ పోయి ఉన్నాయి. -బి.స. బంగారయ్య

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# ప్రజాస్వామ్యంతో పరాచికాలు

**“ప్రజలచేత, ప్రజలకొరకు, ప్రజలే యెన్నుకునేప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటారు” అనే అబ్రహంలింకన్ నిర్వచనం చిన్నప్పుడెప్పుడో ప్రభుత్వమంటే యేమిటో కూడా తెలియని బాల్యంలో విన్నప్పుడు వొళ్ళంతా పులకించి పోయింది. యిప్పటికీ ఆ నిర్వచనం విన్నప్పుడు యెంతో కొంతగానయినా ఆ పులకింత కలుగుతూనే వుంటుంది.**

విశ్వవిద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదువు చదివాక గవర్నమెంటు డిగ్రీకాలేజీలో మొదటి వుద్యోగం వచ్చేటంత వరకూ భారతదేశంలోని ప్రజాస్వామ్యం పైన చాలా నమ్మకముండేది. అయితే నాయీ నమ్మకానికి పగుళ్లు రావడం మొదటిసారిగా నేను యెన్నికల్లో పోలింగ్ ఆఫీసరుగా పనిచేసినప్పుడే జరిగింది.

యిది దాదాపుగా ముప్పయ్యేడేళ్ల క్రిందట జరిగిన సంగతి. అప్పుడు నేనో డిగ్రీకాలేజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాను. మొదటిసారిగానాకు యెన్నికల డ్యూటీ పడింది. వుద్యోగంలో చేరిన నాలుగయిదు నెలలకంతా ఆ బాధ్యత నాపైన పడింది. యెన్నికల నిర్వహణ కోసం యేర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లోనే ఆ ప్రాంతపు రాజకీయ నాయకులు యెన్నికల్లో అదివరకు చేసిన ఘనకార్యాలను గురించిన వర్తమానం నాకు అందింది.

వేగం కంటే శబ్దమే యెక్కువగా చేసే ఆర్టీసీ బస్సొకటి, మిట్ట పల్లాల గతుకుల మట్టిరోడ్డుపైన భయపెడుతూనే గంటలసేపు ప్రయాణం చేసి, యెండిన పొలాల మధ్యలో, కూలిపోవడానికి సిద్ధంగా వున్నట్టున్న యిండ్లు యెక్కువగా వుండే వో పల్లెలో, నన్ను, మరియిద్దరు పోలింగు క్లర్కులనూ దించేసి వెళ్లిపోయింది. కొన్ని యిండ్లే వుండే ఆ పల్లెలో మాకు ఆ రాత్రి పోలీసు స్టేషనులో ఆశ్రయముందని చెప్పారు. వూరికి ఫర్లాంగు దూరంలో భూమి వయస్సంత వయస్సుంటాయేమోననిపించే పెద్ద చింత చెట్ల మధ్యలో, వొంటరి, పాత, యెత్తుగోడల పెంకుటింటికి పోలీస్‌స్టేషననే బోర్డుంది. అది బ్రిటీషు వాళ్ళెప్పుడో కట్టిపోయిన రహదారి బంగళా అని తెలిసిపోతోంది. అక్కడి పోలీసులు కూడా యెన్నికల డ్యూటీల కెళ్లిపోవడంతో కాపలా పోలీసు మాత్రమే మాకు రాత్రిపూట దొరికాడు. చుట్టూవున్న వూర్లలో వొకప్పుడు ముఠాగొడవలు యెక్కువగా వుండేవనీ, ప్రజారక్షణకోసం అంత చిన్ని వూర్లో వొక పెద్ద పోలీసు స్టేషను మాత్రం అవసరమయిందనీ ఆ కాపలా పోలీసు మాతో చెప్పాడు.

దెయ్యాలు, భూతాల సినిమాకు సరిగ్గా సరిపోయేలా వున్న ఆ పాతకాలపు బంగళాలో నేరస్థుల కోసం రెండు చీకటి గదులూ వున్నాయి. పాత డొక్కు ఫోనెందుకో అప్పుడప్పుడూ అనవసరంగా మోగేది. బాలెట్ కాగితాల్ని ప్రాణంకంటే జాగ్రత్తగా తలగడల కింద దాచుకుని, యెప్పుడేం జరుగుతుంతోనని భయపడుతూ మేము ముగ్గురమూ ఆ రాత్రంతా దాదాపుగా జాగారం చేశాము.

మరునాటి వుదయాన్నే చీకట్లోనే లేచి పోలింగుకు కావల్సిన వన్నీ సిద్ధంచేశాం. ఆ వూరి మొగదలలో వుండే ప్రాథమిక పాఠశాలఅనే చిన్న మట్టిమిద్దెలో పోలింగు జరగాలి. పాఠశాలకవతల మహా అంటే యిరవైయిండ్లుండవచ్చు. వుదయాన యెనిమిది గంటలకంతా అక్కడికొచ్చిన పోలింగు యేజెంట్లు చుట్టూవున్న అయిదారు పల్లెలకంతా యిదే పోలింగు స్టేషనని చెప్పారు.

వోట్లు వేయడానికంతా సిద్ధం చేశాక నేను ఆ పోలింగు యేజెంట్లను ముందు తమ వోట్లువేయమని చెప్పాను. వాళ్ళు సిగ్గుపడుతూ ముఖాలు తిప్పుకుని పక్కకు వెళ్ళినప్పుడే నాకు సందేహం వచ్చింది. కాలం గడవసాగింది. అయితే డబ్బాలోకి వొక వోటయినా పడలేదు. కాస్సేపయ్యాక ఆ వూరి జనాలంతా యెన్ని కలను బహిష్కరించారని వొక యెజెంటు నా చెవిలో వూదాడు. అక్కడేం జరుగుతుందో మెల్లమెల్లగా అర్థం కాసాగింది. దొరికిన సమాచారాన్నంతా వొక పద్ధతిలో చేర్చి చూసుకున్నాకే మాకు అసలు సంగతి తెలిసివచ్చింది.

ఆ ప్రాంతపు నాయకులతో యెన్నికల్లో పోటీ చేస్తున్న యిరుపార్టీల అభ్యర్థులు చాలా రోజులుగా తర్జన బర్జనలు చేస్తున్నారు. అయితే యెంతకూ వాళ్ల మధ్య వొక అవగాహన కుదరలేదు. యెంతకూ తనదారికి రాని అభ్యర్థులిద్దరి పైన ఆ ప్రాంతపు నాయకుడికి చెప్పలేనంత కోపం వచ్చింది. అందుకే ఆ పోలింగ్ స్టేషనుకు చెందిన వోటర్లనంతా వోట్లేయకండని ఆయన ఆజ్ఞాపించేశారు.

కాసేపయ్యాక ఆక్కడికొచ్చిన యేజెంట్లు పేరుకే వేర్వేరు పార్టీల వాళ్ళమని చెప్పుకుంటూన్నారు గానీ అందరూ ఆ ప్రాంతపు నాయకుడి అనుచరులేనని తెలిసింది. నాతో బాటు వున్న పోలింగుక్లర్కులు యిలా వొక వోటయినా పడకపోతే, రూలుప్రకారం మళ్లీ రెండు మూడు రోజుల తర్వాత యింకోసారి పోలింగు యేర్పాటు చేస్తారనీ, అప్పుడు మళ్లీ మేమే యిక్కడికొచ్చి డ్యూటీలు చేయాలనీ చెప్పారు.

పాఠశాల ముందున్న పూరిగుడెసె ముందు, విరిగిపోవడానికి సిద్ధంగా వున్న నులక మంచంపైన ముసలాయన చాలాసేపటి నుంచీ పడుకునే వున్నాడు. ఆయన మధ్యాహ్నమప్పుడు వోపిక జేసుకుని పోలింగు బూత్‌లోకి వచ్చాడు. అతను వోటేస్తాడనుకుని మేమంతా సంరంభంలో మునిగిపోయాము. అయితే పోలింగ్ యేజెంట్ వొకతను ఆ ముసలాయనను వేళాకోళం చేసి నవ్వసాగాడు. ఆ ముసలాయిన గాజుకళ్లతో మమ్మల్నంతా వోసారి కలయజూసి ఆ తర్వాత కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు. చివరకు వొక వోటయినా పడని ఖాళీ డబ్బాలతో– మళ్లీ ఆ వూరికి మమ్మల్నే తరిమి రీపోలింగు జరపమంటారేమోనన్న భయంతో విలవిల్లాడుతూ మేము తిరిగొచ్చాము.

ఆ తర్వాతేం జరిగిందో తెలియదు. అదృష్టవశాత్తు మళ్లీ రెండోసారి ఈ జన్మలో ఆ వూరికెళ్లాల్సినప్రమాదం నాకు రాలేదు.

యిలాంటి ఆరుదైన అనుభవం యెంతమందికి దొరికిందో నాకు తెలియదు. అయితే ముప్పయి యేడేళ్ళ క్రితమే మన

ప్రజాస్వామ్యపు పరిస్థితేమిటో తెలుసుకోడానికి నాకా అనుభవం తోడ్పడింది. అప్పుడే నేను అదే విషయంపైన "మృగతృష్ణ" అనే పెద్ద కథ రాశాను. అయితే ఆ కథలో చిన్నకల్పన చేశాను. కథలో వోయువకుడు వచ్చి వోటువేసి వెళ్తాడు. దాని ఫలితంగా ఆ యవకుడ్ని ఆ ప్రాంతీయ నాయకుడేం చేయబోతాడో తలుచుకుని పోలింగు యేజెంట్లు కూడా వణికిపోతారు. ఆ పోలింగు ఆఫీసరు ఆ యువకుడెవరికి వోటేశాడో తెలుసుకోవాలనుకుంటాడు. వోట్లు లెక్కబెట్టే పనిగూడా అతడి పాలబడుతుంది. అప్పుడు వొకే వోటున్న బేలట్ పెట్టెను లెక్క బెట్టిన తోటి వుద్యోగిని వెతికి పట్టుకుంటాడు. ఆ వుద్యోగి ఆ యువకుడెవరికి వోటేశాడో తెలుసుకుని చెప్తాడు. ఆ వోటు పైన యెన్ని ముద్రలు పడ్డాయో లెక్కబెట్టడం కష్టమని తెలుస్తుంది. ఆ వోటేసినవాడెవరో, ఆ వోటు తన శత్రువైనట్టుగా దానిపైన స్టాంపుతో ముద్రలు గుద్దేసినట్టున్నాడని అంటాడోవుద్యోగి.

యిటీవలి కాలంలో నోటా(NOTA) అనే అదనపు సౌకర్యంగూడా ప్రజలకొచ్చింది. అయితే ఆది యెంతవరకూ వుపయోగ పడుతుందో అందరికీ తెలుసు. **భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికీ వొకే వోటు వేసే అవకాశాన్నిస్తుంది. అయితే వొకేవ్యక్తి వొకే యెన్నికల్లో రెండు మూడు చోట్ల పోటీ చేసేందుకు అనుమతినిస్తుంది. అతను రెండు చోట్లలోనూ గెలిచినప్పుడు, వొక చోట రాజీనామా చేయాల్సి వుంటుంది. అక్కడ రెండవసారి యెన్నికల్ని నిర్వహించడానికయ్యే ఖర్చు యెంతగా వుంటుందో అందరికీ తెలుసు.** భారతదేశం వంటి పెద్ద దేశాల్లో అభ్యర్థుల్ని రాజకీయ పార్టీలు నిర్ణయిస్తాయి. మామూలు వ్యక్తి అలా యెవరో నిర్ణయించిన వ్యక్తుల్లోంచి వొకర్ని యెంచుకోవాలి.

ప్రపంచంలో వుండే ప్రభుత్వాలనన్నీటినీ మౌలికంగా ప్రజాస్వామ్యాలూ, నిరంకుశత్వాలూ(totalitarianisms) అనే రెండు రకాలుగా విభజించవచ్చు. నిరంకుశత్వాలతో పోలిస్తే ప్రజాస్వామ్యాల్లో ప్రజలకు వాక్స్వాతంత్ర్యం కొంతలో కొంతయినా మిగిలివుంటుంది. అయితే ఆమెరికా, యింగ్లండు అనే రెండు గొప్ప ప్రజాస్వామ్యాలకు చెందిన **టి.యెస్. యెలియట్ లాంటి గొప్ప కవీ, విమర్శకుడూ తనకు రాజరికమే యిష్టమని అన్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. చాలా మంది మేధావులు స్వార్థ పరుదైన ప్రజాసామ్య నాయకుడికంటే నిస్వార్థ పరుదైన నియంతే అవసరమని అన్నప్పుడూ అలాంటి ఆశ్చర్యమేకలుగుతుంది.**

1992 ప్రాంతంలో రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వం పతనం కావడానికి మునుపు ప్రపంచంలో ప్రజాస్వామ్యమూ, నియంతృత్వమూ అనే రెండు రకాల ధోరణుల మధ్య పోటీ వుండేది. యిండియా వంటి ప్రజాస్వామ్య దేశాలు రష్యా వంటి నియంతృత్వరాజ్యం వైపుకు మొగ్గడం పెద్ద వైచిత్రి. యీరెండు ధోరణుల మధ్యవుండే తేడీలను ప్రతీకాత్మకమైన పద్ధతిలో(Allegory) విలియం గోల్డింగ్ అనే ప్రఖ్యాత ఆంగ్ల నవలా కారుడు లార్డ్ ఆఫ్‌ది ఫ్లయిస్(lord of the flies) అనే నవలలో చిత్రిస్తాడు. అందులో ఆయన మామూలు మనిషి బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్యంకంటే ఆకర్షణీయమైన నియంతృత్వం వైపుకే మొగ్గుతాడని అంటాడు. చెడు అనేది ప్రతి మనిషిలోంచీ పుడుతోందని తెలుసుకోవాలనీ, ఆ చెడు అనే దెయ్యాన్ని అదుపులో పెట్టుకున్నప్పుడే సుఖమూ, శాంతీ వుంటాయనీ చెప్తాడు.

తన "ముక్తధార" అనే ప్రసిద్ధమైన నాటకంలో రవీంద్రనాథ టాగూరు ప్రజలూ, రాజూ అనే యిద్దరూ రాజ్యమనే వ్యవస్థకున్న రెండు కాళ్ళవంటి వాళ్ళని అంటాడు. అధికారమన్నది ఆ రెండు కాళ్ళకూ సమానంగా వుండాలనీ, వాటిలో వొకదానికి యెక్కువ అధికారమున్నప్పుడు రాజ్యం కుంటుతూ నడవక తప్పదనీ, అలా రాజ్యం కుంటి నప్పుడల్లా దేవతలు కన్నీళ్లు కారుస్తారనీ చెప్తాడు. సింహాసనం అనేది కూర్చుని ప్రార్థన చేయడానికి మాత్రమే వుండాలనీ, అధికారంతో తుళ్లిపడ్డానికి కాదనీ ఆయన వాదిస్తాడు. 1922లో రాసిన ఆ నాటకంలో టాగూరు వ్యక్తులు పూర్తిగా యెదగక ముందు వచ్చేస్వాతంత్ర్యం నిజమైనదిగాదనీ, నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందేందుకవసరమైన వ్యక్తిత్వాన్ని అందరూ ముందుగా చేకూర్చుకోవాలనీ అంటాడు. రాజ్యపు రాజకీయ స్థిరత్వమన్నది ఆదేశ ప్రజల ఆధ్యాత్మిక పరిణితిపైన ఆధారపడి వుంటుందని ఆయన గుర్తు చేస్తాడు. వ్యక్తి పూజ మంచిదికాదని ఆయన హెచ్చరిస్తూనే గొప్ప నాయకుడయిన వ్యక్తి పాటించిన విలువలను ఆచరించడం అందరూ చేర్చుకోవాలని బోధిస్తాడు.

**గొప్ప ప్రజాస్వామ్య విలువల గురించి కవులూ, మేధావులూ చెప్పవలసినదంతా చెప్పేవెళ్ళారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రజల్లోనూ, నాయకుల్లోనూ వున్న గొప్ప మానవీయ విలువలు క్రమంగా నీరసపడిపోయాయి. ఆర్థిక సంపదలు ప్రజలందరికీ సమానంగా వుండాలనే ఆకాంక్ష సన్నగిల్లిపోయింది. ప్రపంచీకరణ తరువాత నమ్మకాలు, విలువలూ మారిపోయాయి. యీ మార్పు ప్రపంచమంతా కనబడుతోంది.**

ప్రజాస్వామ్యమనే గొప్ప ఆదర్శంవైపు సాగిన మానవుని ప్రయాణం కొంతకాలం పురోగమనంగానే వూరించింది. అయితే ఆ తరువాత అదొక పెద్ద ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. లార్డ్ ఆఫ్‌ది ఫ్లయిస్ నవలలో, సగం ప్రయాణం జరిగాక రాల్ఫ్ అనే కుర్రాడు "అన్నీ విరిగిపోతున్నాయి" అని ఆక్రోశిస్తాడు.

"రెండవ ఆగమనం" (the second coming) అనే కవితలో మరో గొప్ప యిరవయ్యో శతాబ్దపు కవి డబ్ల్యూబీ యేట్స్ యిలా అంటాడు.

విషయాలు విడివిడిగా పడిపోయాయి
కేంద్రం భరాయించలేకపోతోంది
కేవలం ఆరాచకం ప్రపంచంలోనంతా విప్పుకుంటోంది
రక్తంతో మసకబారిన అల ముంచుకొస్తోంది
ప్రతి చోటా అమాయకత్వపు వేడుక మునిగిపోతోంది
అత్యంత వుత్తముడి నమ్మకాలు సన్నగిల్లాయి
అత్యంత చెడ్డవాడు తీవ్ర వుద్వేగంతో నిండిపోయివున్నాడు.

Things fall apart, the center can not hold;
Mere anarchy is loosed upon the world,
The blood dimmed tide is loosed and every whare
The ceremony of innocence is drowned
The best lack all conviction, while the worst
Are full of passionate intensity.

The Second coming - W.B. Yeats

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209



**7**

**కానీ** నాతో ముసలి పెండ్లిపెటాకులు కాలేదు అని చెప్పినే అని యోచన చేస్తా వున్నెట్లే, నన్ను వాళ్లకి పరిచయం చేసె ముసలి.

వాళ్లు నన్ను మాట్లాడిచ్చిరి. నేను వాళ్లని మాట్లాడిస్తిని. ఆమీట నీళ్లు పోసుకొని టిఫిన్ తింటిమి.

నాకు టిఫిన్ తింటానే రవంత నిద్ర వచ్చినట్లాయె. రూంలా పోయి పనుకొనేస్తిని. నిద్ర లేచేతలికి మద్దేనమయింది.

అబుడే ముసలి కారు దిగి ఇంట్లోకి వస్తా వుండాడు.

ఇంతసేపు ఏడకి పోయివున్నో అడగాలనుకొంటిని కాని, అడగకుండా నోరు మూసుకొంటిని. ఏలంటే ముసలిది చానా పెద్ద కత వున్నెట్ల వుంది. ఇంటినింక అవతలికి పోయినంక అడగాల, బాగా కడగాల అని నాలా నేను అనుకొంటిని.

“ఓసూరోడా పక్కలా పార్కు వుంది పోదామా” అనె ముసలి.

‘నేను దానికే కాసుకొని వుండా పదా పోదాము’ అని మనసులా అనుకొని “పోదాము” అంటిని.

ముసలి కారు ‘స్టార్ట్’ చేసె. ఆ సందులా, ఈ సందులా కారుని తిప్పతా పార్కు తావ నిలిపె. పార్కు చానా పెద్దగా, బలే పద్దతిగా వుంది. మాను నీడలా, పచ్చిక పైన ఇద్దరం కూకొంటిమి.

“అవును ముసలీ, నీకు పెండ్లి, పెటాకులు లేదంటివి. ఆ కొంపల వుండే వాళ్లని, ఇంగా ఆ 40 ఏండ్ల చిన్నోన్ని చూస్తే అచ్చం నీకు దిగిండే (పుట్టిండే) వాని మాదిరిగానే వుండాడు” అంటిని.

“నాకు పెండ్లి, పెటాకులు కాలేదంటిని కాని, పెండ్లాంబిడ్డలు లేరంటినారా?” అంటా కిసకస నగె. నా అనుమానము నిజమాయె.

“నీ లత్త మొకానికి చెత్త ఏసి కొట్టా నీ అట్లా ముచ్చుకొరసోడు (నటించేవాడు) ఇంగ ఏడా చిక్కలే, ఎంత మోసము, ఎంత మోసము” అంటిని.

“దీంట్లా మోసము ఏముందిరా, ఆదిమానవుడు కూడా పెండ్లి చేసుకోకుండానే బిడ్డని కనె, అది తెలుసుకో” అనె.

“ఆహాహా! ఏమి చరిత్ర చెప్పతావురా ముసలీ. నంగీ నంగీ మంచానికి ఎన్ని కాళ్లు అంటే – మూడు లేదా నాలుగు అన్నెంటా, అట్ల నాయాలువిరా నవ్వు. నీతావ చానా వుశారుగా వుండాలి. లేదంటే నన్ను నాలుగు కాసులకి అమ్మేస్తావు” అదో మాదిరిగా అంటిని.

“నా ఓసూరోన్ని నేను అట్ల చేస్తానా? నా బిడ్డ కన్నా నాకు నువ్వే జాస్తిరా”

“వద్దురా సామి, నన్ను నీ కొంపలా చేర్చొద్దు. నీకూ నీ కొంపకీ ఓ నమస్కారము” అని నేను అంటానే ముసలి మెలికలు తిరగతా పచ్చిక పైన పొర్లాడతా వుండాడు. అబుడు నాకు గేణం వచ్చె.

“అవును ముసలీ నీ కొంపలా ఎవురూ తెలుగు మాట్లాడేలేదే ఏమి కత”

“మీ ముసల్ది, అదే మీ అవ్వ మాట్లాడుతుందిరా”

“వరసలు కలపొద్దు, విషయము చెప్పు” అంటా రేగితిని.

“అట్ల రేగితే ఎట్లరా ఓసూరు, రవంత తాంసము కారా, మీ అవ్వ మలయాళముదిరా, నేను కాలేజి చదివేటపుడు పరిచయమాయె.

పెండ్లి చేసుకొంటానని మా ఇంట్లో వాళ్లకి చెప్పితిని. కాని వాళ్లు వినలే, దాన్నింకానే పెండ్లి పెటాకులు లేకుండా ఇబుటికీ ఇట్లే వుండా”

“ఇంకోకిత నీకు పెండ్లి పెటాకులు కాలేదంటే పరక తీసుకోని పది వేస్తా” అంటిని.

నా మాటలు విని ముసలి సిగ్గూశరము లేకుండా నగతా వుండాడు. నేను తిడితే ముసలికి బలే నగువు. ఒగోకిత కావాలనే నన్ను రేగిపిచ్చి తిట్టిచ్చుకొంటాడు.

ఇదేమి కుశాలు ముసలీ నీకు అంటే “తిట్లు తినని బదుకులు బదుకులా, కష్టాలని తట్టుకోలేవు రా, వందపేజీల సారము ఒగోకిత ఒక తిట్టులా కనిపిస్తుందిరా” అని ఏదేదో చెప్పతాడు.

నేను చిన్నోనిగా వుండినపుడు నా నోట్లా తిట్లు వస్తా వుండ్లేదు. ఈ కాలేజీలా చేరినంక వాడికాయె. ఈ ముసలి సావాసము చేసినంక అది ముదిరిపోయె. నోరు తెరిస్తే తిట్లే వస్తాయి.

అయినా ఇది నా బాస, ఇది నా యాస, నా బాస, నా యాస, నా శ్వాస.

“నీ చరిత్ర చాలు కానీ ఈ పార్కు చరిత్ర రవంత చెప్పు ముసలీ” అని అడిగితిని.

“ఇది పానగల్ రాజా పార్కు. తెలుగోడి పార్కు. 1921ల



మద్రాసు ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా పనిచేసిరి. తన సొంత నేలని ఈ పార్కు కోసరమని ఇచ్చిన దాత. కులాంతర పెండ్లిండ్లు చేసుకోవచ్చని, మాల, మాదిగలని తక్కువగా చూడకూడదని రూలేసిన పెద్దమనిషి, నేను పన్నెండో క్లాసు చదివేటబుడు ఈ అప్ప జీవిత చరిత్రని నాండిటెయిల్ గా ఇచ్చింద్రి" అని పాత గేణము చేసె ముసలి.

"నేను పన్నెండో క్లాసు చదివేటబుడు కూడా వీరపాండ్య కట్టబొమ్మన గురించి తెలుగు సబ్జెక్టుకు అనుబంధంగా నాండిటెయిల్ ఇచ్చింద్రి. వీరపాండ్య కట్టబొమ్మన తెలుగురాజని తెలిసి బలే కుషీ పడితిని" నేను చెప్పితిని.

"నీకు ఒగ విషయము చెప్పేది మరిస్తిని ఓసూరు. మొన్న ఒగ తమిళపత్రికలా తెలుగురాజులైన వీరపాండ్య కట్టబొమ్మన, తిరుమల నాయకుల గురించి బందిపోట్లు, దొంగలని రాసిండిరి. దీన్ని ఖండిచ్చి అక్కడి తెలుగుజనం సుమారు రెండువేలమంది మదురై అరిసిపట్టిలాని ఎస్.ఆర్.వి.అరంగమ్ నింకా మదురై కళాశాల దాకా ర్యాలిగా పోయి కట్టబొమ్మన విగ్రహనికి పాలాభిషేకం చేసి మన తెలుగుతనాన్ని చాటి చెప్పిరి" అనె.

నాకు తెలుగురాజుల గురించి తెలుసుకొని సంతోషము ఆయె. తెలుగుజనాల, తమిళనాడులాని తెలుగుజనాల బాదలు తెలుసుకొని బేజారు ఆయె.

"సరే పదరా! ఈపొద్దు మద్రాసు విశ్వవిద్యాలయములా ఒగ జాతీయ సదస్సు వుంది పోదాం" అనె. ఇద్దరం పోతిమి.

అబిటికే ఆ సదస్సులా చిన్న జీయర్‌సామి మాట్లాడతా వుండారు. "తెలుగు భాష వేదవైభవం కలిగిన భాష. ఒకప్పుడు కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు తెలుగు వ్యాప్తి వుండేది. అఖండ భారతంలో భాగమైన లాహోర్‌లోని సరస్వతి గ్రంథాలయంలో వందలవేల తెలుగుగ్రంథాలు వుండేవి. నేను పంజాబ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నప్పుడు డా. నాయక్ ద్వారా ఈ విషయం తెలుసుకొని పోయి చూశాను. ఆ తెలుగుసంపదను చూసి నాకు చాలా సంతోషం కలిగింది. దేశ విభజన సమయంలో లాహోర్ నుంచి పరిరక్షించబడిన నలభైవేల గ్రంథాలు చూశాను. దాంట్లో ఎక్కువ తెలుగుగ్రంథాలు ఉండడం నాకు ఆశ్చర్యం వేసింది. వేదవైభవం కలిగిన భాష కాబట్టి దేశమంతా తెలుగు విస్తరించి వుంది" అని సాములు చెప్పతా వుంటే పొగడతా వుంటే నన్ను పొగిడినట్లే అనిపిచ్చె నాకు.

'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా – గతమెంతో గనకీర్తి కలవోడా' అంటా పాట పాడితిని.

"పాట నిలపరా ఓసూరు, మన తెలుగువాళ్లు పాటలు పాడేకే లాయకి (పనికొస్తారు). తెలుగు నుడిపైన పది శాతము పని చేసినా ఎంతో సంపద, అదెందరో తెలుగువీరులు కనిపిస్తారు" అనె ముసలి.

అచ్చరాలా సత్యమైన మాట చెప్పె ముసలి.

రాత్రి పదిగంటలు అవ్వతా వుంది.

ధర్మపురి పోయే బస్సు అప్పుడే వచ్చి బస్టాండులా నిలిచె.

అబుడు ముసలి కొడుకు పారిపారి వచ్చి ముసలి చెవిలా ఏమో చెప్పె.

ముసలి తల గుంకాయిస్తా "ఓసూరూ నువ్వు పదా, ఒగ చావు సమాచారము. నేను అది ముగించుకొని వస్తా" అనె.

"సరే" అని నేను బస్సు ఎక్కితిని.

ధర్మపురికి వచ్చిన మరసోనాడు ముసలికి ఫోన్ చేస్తిని. చావు

సమాచారము ఎవరిదని అడిగితిని.

"పుష్పరాజ్ అని సదరన్ పీపుల్స్ ప్రోగ్రెసివ్ యూనియన్ సంస్థని పెట్టిన మనిషి. 1972 నింకా తమిళనాడులా తెలుగుబాస గురించి జనాలకి చెప్పతా లేఖలు రాస్తా జనాలని, సర్కారుని ఆలోచించే మాదిరిగా చేసిన మనిషి. నా నేస్తగాడు ఓసూరు" అంటా చానా బాదపడె.

కాలానికి కాయిలాలు వస్తాయా? బాద అనేది వుందా దానికి! దిగులు అంటే ఏమని తెలుసా! లేదు కదా... ఏమీ లేనిది, అన్నీ తనలానే వున్నా, కాదు కాదు, తన నింకా వచ్చినా, తనకి ఏమీ తెలీదని, తన పాటికి అది పోతా వుంటుంది. కాలానికి పోటీ లేదు. మేటీ లేదు. కానీ నేను అట్ల చేసేకి అవుతుందా? ఎవరైనా అట్ల వుండేకి అయ్యే పనేనా? కాని పని. దాన్నింకానే నా పని నేను చేస్తా డిగ్రీ పాసైతిని. నా చదువుకి తగిన యాపారం మొదలు పెట్టితిని. అంతేనప్పా! కాలం నా పైన కన్నేసినట్లుంది. మీసాలు, గడ్డాలు బలే వచ్చేసిండాయి నాకు.

దీనికన్నా చానా పెరిగితే తొందరని మా ఇంట్లోవాళ్లు నాకు పెండ్లి చేసిరి.

నేను కాలంలా ఇందాగంట ఒగడిని. పెండ్లితో ఇద్దరయితిమి. ఇబుడు నలుగురు అయిండాము. కాలం నన్ను ఒగడినింకా నలుగుర్ని చేసింది. కడకి నన్ను ఏమి చేస్తుందో ! ఏమయినా చేయనీ. ఎట్లయినా చేయనీ. నేను కాలంలా వుండాను. ఈ కాలంలా వుండాను. ఇది నా కాలం. ఆ గుర్తు నాకుంది.నాకది చాలు.

(తరువాయి వచ్చే సంచికలో...)

## స్పందన

**సెప్టెంబరు సంచికలో యం. సాహితి రచన 'నాకు అర్థమైన రవీంద్రుడు' :**

అ) 'అమ్మనుడి' సెప్టెంబర్ సంచికలో ప్రచురింపబడిన, పైన పేర్కొన్నవ్యాసం చదివి చాలా సంతోషించాను. నేనుకూడా 'గీతాంజలి'ని అనువదించిన సంగతి మీకు తెలిసినదే. ఐతే

ఆ) ఆ వ్యాసంలో, నేను చేసిన అనువాదంలో, గ్రంథారంభంలోనే, నేను రాసిన.... 'నా స్పందనలు' .....లో పేర్కొన్న కొన్ని వాక్యాలను రచయిత్రి యథాతథంగా ఉటంకించారు. ఉదాహరణకు. ఆమె రాసిన, మీరు ప్రచురించిన, వ్యాసంలో, పుట. 36, మొదటి కాలం,4వ పేరా లో, ఈ వాక్యాలు చూడండి:

1) "కవి భావుకుడైతే, భావుకుడు తాత్వికుడైతే, తాత్వికుడు దార్శనికుడైతే అతడే రవీంద్రుడు......(నుండి చివరి మాటలు): ... హృదయ బృందావనంలో విరగబూసిన రంగు రంగుల పుష్పాలే, ఈ కవీంద్రుని గీతాంజలి" ....వరకూ,

2) అదే 36వ పుటలో రెండవ కాలం లో 2వ పేరా లో;.... "ఆ కమనీయ భాషాసౌందర్యం వెనుక దాగిన.......నేను మరల మరల ఈ కవితను నిశితంగా పఠించి, పరిశీలించటానికి దోహదం చేసింది.".....వరకూనూ...

ఇ) రచయిత్రి వ్యాసం చివరలో, వ్యాసం రాయటానికి పేర్కొన్న 'ఆధార గ్రంథాలు'లో నేను అనువదించిన 'గీతాంజలి' పేరుగానీ, నా పేరుగానీ లేకపోవటం విచారకరం.

ఈ) ఐతే, రచయిత్రి, ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో చివరి ఏడాది విద్యార్థినిగా తెలుస్తోంది. కాబట్టి, ఆమె ఎంతో శ్రద్ధ తీసుకుని రవీంద్రనాథ్ టాగోర్ విరచిత 'గీతాంజలి' గురించి రాస్తూ, నా వాక్యాలను కూడా ఉదాహరించినందుకు, నేను సంతోషపడుతున్నాను. కానీ, నా అనువాదంలోని వాక్యాలను యథాతథంగా ఉపయోగించుకుని, నా పేరున కూడా చివరలో పేర్కొనకపోవటం ఉచితం కాదు.

ఉ) నేనెటువంటి ప్రచారమూ అభిలషించేవాడిని కాదండి... ఐనప్పటికీ, మీరు దయచేసి పైన పేర్కొన్న ఈ లోపాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చి, ఇకముందు, ఎప్పుడూ, ఇటువంటి పొరపాట్లు చేయవద్దని ఈ ఔత్సాహిక రచయిత్రికి సలహా ఇవ్వమని కోరుతున్నాను.

**– గీతాంజలిమూర్తి**

## సవరణ

'అమ్మనుడి' సెప్టెంబరు సంచికలో డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు గారి వ్యాసం 'భాషాధ్వనులు– రోమన్ లిపి ' వ్యాసంలో 34వ పుటలో రెండవ నిలువు వరసలో 'హల్లులు' అన్న ఉపశీర్షిక క్రింద ఇచ్చిన వివరాలలో కొన్ని తప్పులు చోటుచేసుకొన్నాయి. వాటిని ఈ క్రింది విధంగా సవరించుకొని చదువుకొనవలసిందిగా కోరుతున్నాము. ఆ తర్వాత కూడా 'రోమన్‌లిపిలో తెలుగు భాష' అనే ఉపశీర్షిక క్రింద 12వ అడ్డవరుసలో - chandanam లో h ను తొలగించి candanam గా చదువుకోవలసిందిగా కోరుతున్నాము. ఈ పొరపాట్లను మాకు తెలియజేసినందుకు వ్యాస రచయితకు కృతజ్ఞతలు.

| | | | | |
|---|---|---|---|---|
| **క్ = k** | **ఖ్ = kh** | **గ్ = g** | **ఘ్ = gh** | **ఙ్ = ng** |
| **క = ka** | **ఖ = kha** | **గ = ga** | **ఘ = gha** | **ఙ = nga** |
| **చ్ = c** | **ఛ్ = ch** | **జ్ = j** | **ఝ్ = jh** | **ఞ్ = ny** |
| **చ = ca** | **ఛ = cha** | **జ = ja** | **ఝ = jha** | **ఞ = nya** |
| **ట్ = T** | **ఠ్ = Th** | **డ్ = D** | **ఢ్ = Dh** | **ణ్ = N** |
| **ట = Ta** | **ఠ = Tha** | **డ = Da** | **ఢ = Dha** | **ణ = Na** |
| **త్ = t** | **థ్ = th** | **ద్ = d** | **ధ్ = dh** | **న్ = n** |
| **త = ta** | **థ = tha** | **ద = da** | **ధ = dha** | **న = na** |
| **ప్ = p** | **ఫ్ = ph** | **బ్ = b** | **భ్ = bh** | **మ్ = m** |
| **ప = pa** | **ఫ = pha** | **బ = ba** | **భ = bha** | **మ = ma** |
| **య్ = y** | **ర్ = r** | **ల్ = l** | **వ్ = v** | **శ్ = S** |
| | **ష్ = sh** | **స్ = S** | **హ్ = H** | **ళ్ = L** |
| **య = ya** | **ర = ra** | **ల = la** | **వ = va** | **శ = Sa** |
| | **ష = sha** | **స = sa** | **హ = Ha** | **ళ = La** |

– సంపాదకుడు



తెలుగు మీదకన్నా సంస్కృతంపై ఎక్కువ అభిమానం చూపే (సంస్కృతమే తెలుగు అనుకునే) వారు తెలుగువారా? సంస్కృతీయులా?

–బి.స. బంగారయ్య

కన్నడ మూలం: డా.చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

5

**ఎంత కష్టమొచ్చినా పంచపాండవులను కదల్చకండి**

1977లో మా అన్నయ్య వీరన్నగౌడ చనిపోయాడు.

ఆ చావు మా వంశపారంపర్యంగా వచ్చిన కళ మీద చాలా ప్రభావాన్ని చూపింది.

అటుతర్వాత నాన్న మరణం మరొక పెద్దమార్పుకు కారణమైంది.

అన్నయ్య చనిపోయిన తర్వాత తమ్ముడు జీవన గౌడ్, నేను, చెల్లెలు కలిసి మా మేళంతో ఆటను కొనసాగించాం.

మా చెల్లెలు ఆట ప్రదర్శనలో పాల్గొనేదికాదు.

అయితే బొమ్మలను చక్కగా అలంకరించేది.

ఖాళీగా ఉన్నప్పుడు నేపథ్యగాయకులతో కలిసి నేపథ్య గీతాలు ఆలపించేది. అది కూడా చాలా తక్కువే.

ఇలా రెండేళ్ళు ఆటలు ప్రదర్శించాం.

ఇలాంటి సమయంలోనే హఠాత్తుగా గుండెపోటు వచ్చి తమ్ముడు చనిపోయాడు.

మా కుటుంబం మొత్తం శోకంలో మునిగిపోయింది.

ఏమి చేయడానికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది.

అప్పుడు ఆటలు ప్రదర్శించడం చాలా కష్టమైంది.

అందువల్ల ఆట ప్రదర్శన అక్కడితో ఆగిపోయింది.

కొన్ని సంవత్సరాల నుంచీ నేను, మా అన్న, అతని కుమారుడు, తమ్ముడు, నా పిల్లలు కలిసి ఆట ఆడేవాళ్ళం. అన్నయ్యే మా మేళానికి నాయకుడయ్యాడు. నాన్న తర్వాత ఇతనికి యాజమాన్యం వచ్చింది. అతను చాలా బుద్ధిమంతుడు. మెట్రిక్ చదివాడు. మా మేళంలో ప్రభుత్వంనుంచి, ఇతర సంస్థల నుంచి ఎక్కువగా అవకాశాలను తెచ్చాడు. విదేశాలలోనూ అతనే మా బృందానికి నాయకుడు. ఆట ఆడే సందర్భంలో, కథ గురించి, ఆట గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వెంటనే తగిన జవాబులు ఇచ్చేవాడు. వాదప్రతివాదాలు అంటే చాలు ఉత్సాహంతో ముందుకు వచ్చేవాడు. ధారవాడ, హావేరి జిల్లాలలో ఉన్న మఠాల, మఠాధీశులతో అతనికి పరిచయాలు బాగా ఉండేది. అతను, తమ్ముడు చనిపోయిన తరావాత ఇంటివాళ్ళంతా కలిసి ఆట ప్రదర్శించే అవకాశమే లేకుండాపోయింది.

అప్పటికే కుటుంబాలు వేరుపడ్డాయి. ఆస్తి పంపకాలు కూడా జరిగాయి.

మొదట్లో కలిసి ఆట ఆడేవాళ్ళం. అందువల్ల ఇంటిలోని బొమ్మల పంపకాలు జరగలేదు.

నాన్న చివరి క్షణాల్లో, "ఎంత కష్టం వచ్చినా పాండవులను (బొమ్మలను) మాత్రం వేరు చేయకండి" అని అభ్యర్థించారు.

అందువల్ల బొమ్మలను పంచుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. మొత్తానికి అన్నయ్య నాయకుడయ్యాడు. తలవాకిలి ఉన్న ఇల్లు అతని భాగానికి వచ్చింది. మా ఇంటి నుంచి బొమ్మలను వేరు చేయకూడదని అక్కడే పెట్టాం. బొమ్మలను ఒకరి ఇంట్లో లేదా అన్న దగ్గరే ఉంచాలని నాన్న ఉద్దేశం కాదు. నేను ఇంతకు ముందే చెప్పినట్టు నాన్న చాలా ముందుచూపు కలిగినవారు. కలిసి బతికే రీతులను తెలియజెప్పేవారు. బొమ్మలు ఒక చోట ఉంటే ఆ బొమ్మల కోసమైనా మేము, మా పిల్లలు, మావాళ్ళు కలిసి బొమ్మలాట ప్రదర్శిస్తారు. అప్పుడు మా సొంత తండా ఉంటుంది. వంశపారంపర్యమైన కళ సజీవంగా ఉంటుందనే ఆశ, కోరిక, నమ్మకం ఆయనది.

ఆయన కోరిక అన్నయ్య వీరన్నగౌడ, తమ్ముడు జీవన్ గౌడ జీవించి ఉన్నంతవరకు ఉండింది.

బొమ్మలు మా అన్న కొడుకు కృష్ణ గౌడ్ దగ్గరే ఉండిపోయాయి.

తాతయ్య నాన్న, అన్నయ్య ఆటలు ప్రదర్శించిన బొమ్మలు...

నేను ఆటలు నేర్చుకున్న బొమ్మలు...

ఆట ప్రదర్శనలో ఉపయోగించిన బొమ్మలు...

ఈరోజు మూలన చేరాయి !

ఇది నాకు చాలా దుఃఖాన్ని కలిగించింది.

నేను ఈ మధ్యన తయారు చేసుకున్న బొమ్మలు చైతన్యవంతంగా ఉన్నాయి.

అయితే నాన్న బొమ్మలు మౌనంగా ఉండిపోయాయి కదా? మూలనపడి పాడవుతున్నాయి కదా? అని తలుచుకుంటే బాధ కలిగేది. అయితే ఏమి చేయగలను? నాన్న కోరిక తీర్చడానికి అన్నయ్య కొడుకు కృష్ణగౌడ దగ్గరికి వెళ్ళి చాలాసార్లు బొమ్మలు ఇవ్వమని అడిగాను.

అతను అంగీకరించలేదు.

నాకు సహకరించలేదు.



మాతో కలిసి ఆడటానికి ఒప్పుకోలేదు.

మేము ఆటను వదిలివేసిన ఒక(రెండు సంవత్సరాలు తన మేళాన్ని తయారు చేసుకుని ఆటను ప్రదర్శించాడు.

ఇప్పుడు మళ్లీ నిలిపివేశాడు. అది అతని వ్యక్తిగత విషయం అనుకోండి. అది ఇక్కడ ముఖ్యం కాదు.

బొమ్మలు సజీవంగా ఉండాలి. చైతన్యవంతం కావాలి. అది నా ఉద్దేశం.

అలా ఉండాలి అంటే ఆట ప్రదర్శింపబడుతూ ఉండాలి.

అతను ఆటను ప్రదర్శించినా మాకు సంతోషమే !

లేదా ఆ బొమ్మలను ప్రదర్శించడానికి మాకు ఇచ్చినా సంతోషమే !

**కూడబెట్టిన సొమ్ముతో బొమ్మలు కొనిచ్చిన కూతురు**

అన్నయ్య, తమ్ముడు చనిపోయిన తర్వాత ఆట ప్రదర్శనకు నాకు బొమ్మలు లేకుండా పోయాయి.

ఇది అత్యంత బాధ కలిగించే విషయం.

సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నట్టే బొమ్మలు లేని బాధ మరింత తీవ్రంగా పెరగసాగింది.

నాకు ఏ పని మీద ఆసక్తి లేకుండా పోయింది.

ఎప్పుడూ ఒంటరిగా ఉండాలని అనిపించింది.

అలాగే ఉండిపోయేవాడిని.

పొలానికి వెళ్ళటం తప్ప మిగతా సమయమంతా ఒంటరిగానే కూర్చునే వాడిని.

నా కూతురు రాధా, "నాన్న ఎప్పుడూ ఇలా విచారంగా ఉన్నవాడివి కాదు. ఏదో ఒక పని చేసేవాడివి. ఒకవేళ పని లేకపోతే జనాన్ని పోగేసుకుని వారితో కబుర్లు చెప్పేవాడివి. ఇది నీ ప్రత్యేకమైన గుణం. ఇప్పుడు ఎందుకు మౌనంగా కూర్చుంటున్నారు?" అని అడిగింది.

ఆమె నా మౌనాన్ని చాలా చక్కగా గుర్తించింది. ఎందుకంటే నా మనసులోని కోరిక, సంకటాలు, బాధలు ఆమె దగ్గర అప్పుడప్పుడు చెప్పుకునే వాడిని. ఆమెకు తన తండ్రిని అర్థం చేసుకోవడానికి అవి ఉపయోగపడ్డాయి. ఆమె ఈ విషయాలను నా దృష్టికి తీసుకు వచ్చింది.

ఆమె నా దగ్గరికి వచ్చి చాలా మృదువైన కంఠంతో, "ఎందుకు నాన్నా మౌనంగా ఉన్నావు? నువ్వు ఈవిధంగా ఉండటం నేను ఎన్నడూ చూడలేదు" అని అడిగింది.

అప్పుడు నాకు మనసులోని దుఃఖాన్ని, బాధను ఆపుకోవడం సాధ్యం కాలేదు.

మనసులోని బాధను కొద్దిగా అయినా చెప్పుకునే అవకాశం కనిపించడంతో "చూడమ్మా, ఇన్నేళ్ళు కొయ్య బొమ్మలాట ఆడాము. అయితే ఈ రోజు మన ఇంట్లో కనీసం చూడటానికి కూడా ఒక బొమ్మ లేదు. నేను మళ్ళీ ఆట ప్రదర్శించాలని అనుకుంటున్నాను అయితే ఏం చేయాలో తోచడం లేదు. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడం లేదు. అందుకే మనసుకు బాధగా ఉంది తల్లీ" అని అన్నాను.

ఒక కళాకారుడు తాను చేస్తున్న పనిని వదిలిపెట్టి కూర్చోవడం ఎంత ప్రాణాంతకమో అది అనుభవిస్తేనే తెలుస్తుంది. అది కలిగించే బాధ అంతా ఇంతా కాదు. దాన్ని అనుభవించినవారు మాత్రమే అర్థం చేసుకోగలరు. అందుకే నా కూతురు దగ్గర నా మనసులోని వేదనను చెప్పుకున్నాను.

అప్పుడు ఆమెకు ఏమనిపించిందో ఏమో "నేను డబ్బులు



ఇస్తాను" అని చెప్పి తాను మహిళా సంఘంలో కూడబెట్టిన వెయ్యి రూపాయలు తెచ్చి నా చేతిలో పెట్టింది.

నా కళ్ళల్లోంచి కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. నా కూతుర్ని పట్టుకుని బిగ్గరగా ఏడ్చేశాను.

ఆరోజు రాత్రి ఇంట్లో అందరం కూర్చోని ఇదే విషయం చర్చించాం.

మిగిలిన పిల్లలు కూడా డబ్బులు ఇస్తామని చెప్పి, ఎంత కష్టమైనా సరే బొమ్మలు తీసుకొని రమ్మని చెప్పారు.

నాకు చాలా సంతోషం కలిగింది

అప్పుడు నాకు కలిగిన సంతోషాన్ని మాటల్లో వర్ణించలేను.

(తరువాయి వచ్చే సంచికలో...)

గిడుగు స్ఫూర్తితో

బద్రి కూర్మారావు
97047 98643

# 18 ఏళ్లుగా తెలుగు భాషా, సాంస్కృతిక సేవలో 'గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, రంగోయి'

గిడుగు జీవితంపై కూడా చిన్ననాడు జానపద కళల ప్రభావం ఉంది. తన గ్రామంలో జరిగిన తోలు బొమ్మలాట, భాగవతం, హరికథ, పౌరాణిక నాటకాలు బాగా తనకు ప్రేరణ ఇచ్చినట్లు గిడుగు తన ఆత్మకథలో వ్రాసుకున్నారు.

అలాగే తెలుగు వ్యావహారిక భాష గురించే కాకుండా సవర భాషకోసం (శ్రీకాకుళం జిల్లా గిరిజనుల) శ్రీముఖలింగము శాసనాల పరిశోధన పట్ల ఆయన కృషి చేశాడు. అందుకే ఆంగ్లేయులు ఇచ్చిన రావుబహుదూర్ బిరుదును కూడా త్యాగం చేసారు. తన జీవితాన్ని వ్యవహారిక భాషకోసం అంకితం చేశారు సవర పాటలు, సవర కథల సేకరణ కృషిచేసి సవర డిక్షనరీని తయారు చేశారు.

ఒక భాష బ్రతికి ఉందా, లేదా? అనేది భాషను పలకడం, రాయడం, చదవడం అనే ముక్కాలి పీటమీద కుదురుకొని ఉంటుంది. ఈ మూడింటిలో ఎక్కడ మచ్చుపడినా అక్కడ భాష మసకబారుతుంది. ప్రజలందరూ పండితులు కానక్కరలేదు. గొప్ప, గొప్ప పుస్తకాలు చదవకపోయినా ఇబ్బంది లేదు. అవన్నీ లేకుండానే మంచి భాష వాళ్లకు వస్తుందన్న గిడుగు ఆశయాలకు అనుగుణంగా జానపదకళలు, తెలుగు మరియు ఇతర మాతృభాషల పరిరక్షణ ధ్యేయంగా 'గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం,' శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం రంగోయి గ్రామంలో తేది. 12-01-2004న నెలకొల్పబడింది. దీనికి అనుబంధంగా సంస్కృతి పరిరక్షణ, కోసం 'వివేకానంద నారాయణగురు చైతన్య సంఘం' 'బద్రి అప్పన్న స్మారక కళాపీఠం' నెలకొల్పబడ్డాయి. వీటి వ్యవస్థాపకులు ఈ వ్యాస రచయిత బద్రి కూర్మారావు.

2004 సంవత్సరంలో స్థానిక గ్రామ జానపద కళాకారులను సన్మానించడంతో ప్రారంభమై ఇప్పటివరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలోని జానపద కళాకారులైన గంగిరెద్దుల వారు, బుడిగె జంగాలు, ఎరుకుల వారు, తోలు బొమ్మలాట, జముకుల కథ, రుంజవాయిద్యం, హరికథ, బుర్రకథ, కోలాటం, తప్పెటగుళ్ళ, గిరిజనుల మైమై గుర్రం, శకుని పక్షి డప్పులు, స్త్రీల జానపద పాటలు, రేలా రేలా కళాకారులు, గజల్స్, పౌరాణికాలతో పాటు సామాజిక అభ్యుదయ గీతాలు వంటి కళాకారులను గౌరవించడంతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రతి ఏడాది నిరంతరముగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, వంటి రాష్ట్రేతర ప్రాంతాలలో తెలుగు జానపద కళలు, నాటికలు వంటి కార్యక్రమాలను నిర్వహించింది.

అంతేగాకుండా ఈ వేదిక ద్వారా వందలాది కళాకారులకు పరిచయం చేయుటతోపాటు కనుమరుగైపోతున్న జానపద కళారూపాలను వెలుగులోకి తేవడానికి కొంతమేరకు కృషిచేసింది. ఈ వేదిక ద్వారా ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు వేర్వేరు



ప్రాంతాలలో అనేక ప్రదర్శన అవకాశాలు రావడం సంతోషించదగ్గ విషయం. ప్రతి ఏడాది తెలుగు భాష జానపద కళలకు కృషిచేస్తున్న ఒక ముఖ్యవ్యక్తిని అతిథిగా పిలిచి సభకు పరిచయం చేస్తున్నారు.

2005లో "ఉత్తరాంధ్ర జానపద కళలు" పుస్తకాన్ని ప్రచురించి ఒక మైలురాయిగా నిలిచింది. అనేక సెమినార్లలో పాల్గొనటంతో పాటు "దక్షిణ భారత జానపద విజ్ఞానకోశం" వంటి పుస్తక రచనలలో భాగస్వామ్యం కావడం జరిగింది. 2010లో విజయనగరంలో జానపద గ్రంథాలయాన్ని, బాలల గ్రంథాలయాన్ని ప్రారంభించింది. కాలగర్భంలో కలిసిపోతున్న ఉత్తరాంధ్ర జానపద సాహిత్యాన్ని సేకరించి "కళింగాంధ్ర జానపద గేయాలు" అనే పుస్తకాన్ని 2015లో ప్రచురించింది. తెలుగు భాష, జానపద కళల పరిరక్షణ కోసం కరపత్రాల రూపంలో ప్రభుత్వాలకు తెలియజేయడమైనది. తెలుగు భాష పరిరక్షణకు వివిధ పత్రికలలో వ్యాసాలు వ్రాయడం, దేశ విదేశాలలో ఉన్న తెలుగువారి సమాచారాన్ని సేకరించి బర్మా బంగ్లాదేశ్ వంటి దేశాల్లోని తెలుగువారి భాషా సమస్యలు, అండమాన్ నికోబార్ దీవులు, అస్సాం, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో తెలుగువారి పరిస్థితులను దినపత్రికలు, మాసపత్రికలలో వ్యాసాల రూపంలో ప్రచురించింది.

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు తెలుగు భాష, సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగించడానికి పోటీలు నిర్వహిస్తున్నారు. మూడు జిల్లాలలో 100 మందికి పైగా విద్యార్థులతో తాత, నాన్నమ్మలు చెప్పినటువంటి జానపద కథలను వ్రాయించి ఒక పుస్తక రూపంలో తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతున్నది.

బరంపురం ఆంధ్ర సాంస్కృతిక సమితి, భిలాయ్ కళాంజలి, సృజన, ప్రవాసాంధ్ర తెలుగు సంఘాల ఆహ్వానం మేరకు హాజరవడంతో పాటు ఒడిషా, భిలాయ్ తెలుగు జానపద, నాటక కళాకారుల, సాహిత్యకారుల ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీకళాశాల శ్రీకాకుళంలో జరిగిన భాషా, జానపద కళల పరిరక్షణ సెమినార్‌లో పాల్గొన్నాము.



భాగవతుల ఛారిటబుల్ ట్రస్టు(డా. బి. వి. పరమేశ్వరరావు), డా. మానేపల్లి గారి అవగాహన(యలమంచిలి) ఇన్‌టాక్ శ్రీకాకుళం, విశాఖపట్నం శాఖలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తెలుగు భాషా జానపద కళలు, నాటికలు ప్రదర్శిస్తున్నాం.

ప్రజానాట్యమండలి, సాహితీ స్రవంతి, కథానిలయం, శ్రీకాకుళం సాహితీ, విజయాభావన, జన విజ్ఞాన వేదిక, వంటి సంస్థల ఆహ్వానం మేరకు పాల్గొని భాషా, కళలు పరిరక్షణ గురించి ప్రసంగించడం జరిగింది.

2010 సం.లో విజయనగరంలో మా స్వగృహంలో ఏర్పాటు చేసిన తెలుగు సాహిత్య బాలల గ్రంథాలయం Telugu Folklore Litrarary ప్రారంభమునకు ప్రొఫెసర్ తిరుమలరావు గారు విచ్చేసి ప్రారంభించిన ఈ సభలో డా. చాగంటి తులసి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరినాయుడు, జి.యస్.చలం, చీకటి దివాకర్, శ్రీ వెలుగు రామినాయుడు వంటి వారితోపాటు విజయనగరం రీజనల్ ఆర్.టి.సి.డైరెక్టరు శ్రీ గిడుగు వెంకటేశ్వరరావు (గిడుగు మునిమనవడు) శ్రీ యమ్.వి. కృష్ణాజి, శ్రీ యమ్.వి. వెంకటరావు (జనవిజ్ఞాన వేదిక) వంటి వారు పాల్గొనడం జరిగింది. ఈ గ్రంథాలయం ప్రస్తుతం బాలలలో భాషాసాహిత్యాలపై అవగాహన కల్పించడంతో పాటు ఎం.ఫిల్., పీహెచ్.డి విద్యార్థులకు జానపదంపై పరిశోధనకు ఉపయోగపడుతున్నది.

సవర, రెల్లి, గదబ, ఉరుకుల, పైడి వంటి ఉత్తరాంధ్రలోని లిపిలేని భాషలలోని పాటలు, కథలు, పదాలను సేకరించి వాటికి తెలుగులోకి అనువదించడానికి ప్రయత్నం జరుగుతున్నది.

ప్రతీ ఏడాది ప్రముఖ కవుల జయంతులూ వర్ధంతులు, తెలుగు మాతృభాషాదినోత్సవాలు, ప్రపంచ జానపద కళాదినోత్సవాలు, నిర్వహించారు. ఉత్తరాంధ్ర సంస్కృతికి ప్రతీకైన గైరమ్మ పండుగ, పాటలు తెలుగులోకి తీసుకు వస్తున్నాము. ఉత్తరాంధ్ర జానపద కళల 2005 పుస్తకం నుండి కొన్ని అంశాలను విశ్వవిద్యాలయాలు, రిఫెరెన్సుగా తీసుకోవడంతోపాటు 7వ తరగతి 5వ తరగతి తెలుగు వాచకాల్లో జానపద కళలకు పాఠ్యాంశాలుగా అవకాశం లభించడం సంతోషించదగ్గ విషయం.

ఇప్పటివరకు 2021లోను ఇంకా అనేక కార్యక్రమాలను నిర్వహించారు. భవిష్యత్తులో కూడా ఈ సంస్థ తెలుగు మాధ్యమం కోసం, జానపద కళల పరిరక్షణ కోసం తెలుగు భాషా సంస్కృతుల వ్యాప్తి కోసం, సంచార జాతుల అధ్యయనం మరియు అభివృద్ధి కోసం పోరాడుతూ జానపద శిక్షణాలయాన్ని ఏర్పాటు చేయుటకు కృషిచేస్తున్నది.

## "భారతీయ భాషల పట్ల ప్రభుత్వం, ప్రజలు శ్రద్ధ చూపించనందున మనం గత 50 ఏళ్ళల్లో 220 భాషలను కోల్పోయాం"

– కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి అన్నపూర్ణా దేవి

సెప్టెంబర్ 23న జరిగిన ఒక జాతీయ సదస్సులో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ తగినంత శ్రద్ధ చూపకపోవడం వలన మనం గత 50 ఏళ్ళలో 220 భాషలను కోల్పోయామని, ఇవి మాతృభాషగా కలిగిన ఒక్క వ్యక్తి కూడా లేకపోవడం వలన ఈ భాషలు అంతరించిపోయాయని ఆమె తెలిపారు.

పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి చదువుల్లో భారతీయ భాషలను బోధించడం, నేర్పించడం తక్షణమే చేపట్టాలని ఆమె కోరారు. దేశ ఐక్యతకు, సమగ్రతకు భారతీయ భాషలను కాపాడటం, అభివృద్ధి పరచడం చాలా అవసరం అని ఆమె అన్నారు.

## 'ఉపాధ్యాయ'
## కథలు, కవితలు, గేయాలు పోటీ – 12
## రచయితలకు, కవులకు ఆహ్వానం

గత 73 సంవత్సరాలుగా నిరంతరాయంగా వెలువడుతున్న ఏ.పి.టి.ఎఫ్. అధికార మాసపత్రిక "ఉపాధ్యాయ" లో గత 11 సంవత్సరాల నుండి కథలు, కవితల పోటీ నిర్వహిస్తున్నాము. ఫిబ్రవరి జన్మదిన సంచిక నుండి బహుమతి పొందిన రచనలను ప్రచురించడం జరుగుతుంది. కావున రచయితలు, కవులు, తమ రచనలను పంపవలసినదిగా ఆహ్వానిస్తున్నాము.

| | కథ | కవిత |
|---|---|---|
| ప్రథమ బహుమతి | రు. 5000/- | రు. 2000/- |
| ద్వితీయ బహుమతి | రు. 4000/- | రు. 1500/- |
| తృతీయ బహుమతి | రు. 3000/- | రు. 1000/- |

**వివరాలకు, రచనలు పంపవలసిన చిరునామా:**

కథలు, కవితల పోటీకి, సంపాదకులు 'ఉపాధ్యాయ'
చెన్నుపాటి–సింగరాజు భవన్, 29-7-22,
విష్ణువర్ధనరావువీధి, సూర్యారావుపేట, విజయవాడ–2
రచనలు డిటిపి చేసి aptf167@gmail.comకు పంపవలెను.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362




**అమ్మనుడి**లో ధారావాహికగా ప్రచురించిన
**జగమునేలిన తెలుగు** పుస్తకంగా ఈ అక్టోబరులోనే విడుదల
వివరాలకు: తెలుగుజాతి (ట్రస్ట్)
98480 16136 / 94404 48244

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
October 2021 Vol :7, Issue 5

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

5 దశాబ్దాలుగా ఆదరిస్తున్న ఆక్వా, ఫౌల్ట్రీ, వ్యవసాయ రైతు సోదరులకు గృహ వినియోగదారులకు, డీలర్లకు, టెక్నీషియన్లకు విజయదశమి శుభాకాంక్షలు



GOLDEN JUBILEE 2020-21
50 YEARS
In Customer Service Since 1971

నాణ్యమైన ఉత్పత్తులకు...
నమ్మకమైన సర్వీసుకు...

Kumar®

AN ISO 9001 : 2015 QMS CERTIFIED COMPANY
PUMPS & MOTORS
SUPERIOR QUALITY • SUPERIOR VALUE



అరుణజ్యోతి డిస్ట్రిబ్యూటర్స్

చెన్నై Cell : 93812 99777
సికింద్రాబాద్ Cell : 94907 59500
విశాఖపట్టణం Cell : 94907 59511
తెనాలి Cell : 94907 59522
నెల్లూరు Cell : 94907 59544
విజయవాడ Cell : 99663 55111
తిరుపతి Cell : 94907 59519

e-mail : marketing@kumarpumps.co.in visit : www.kumarpumps.co.in

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244